www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 313 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 6.58 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పునర్వసు సా. 6.01 తదుపరి పుష్యమి; వర్జ్యం: శేషం ఉ.7.33, రా.2.12-3.50, దుర్ముహూర్తం: మ.12.52-1.37, మ.3.08-3.54; అమృతఘడియలు: మ.3.36-5.12; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.11 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మణిపూర్ సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా

- రాష్ట్రంలో రెండేళ్లుగా జాతుల మధ్య సంఘర్షణ
- హింసను బీరెన్ స్వయంగా ప్రేరేపించారంటూ ఇటీవల ఓ ఆడియో విడుదల
- ఆయన గొంతుతో 93% సారూప్యత ఉందని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక.. సుప్రీం విచారణ
- సర్కారుపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన కాంగ్రెస్
- బీజేపీలో దాదాపు 18 మంది ఎమ్మెల్యేల వ్యతిరేకత



గవర్నర్‌కు రాజీనామా సమర్పిస్తున్న బీరెన్‌సింగ్ 2

అడవిలో నెత్తుటేర్లు!

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. 31 మంది నక్సల్స్ మృతి.. వారిలో 11 మంది మహిళలు

- మృతుల్లో పలువురు అగ్రనేతలు ఉన్నట్లు సందేహాలు
- తెలుగువారు భాస్కర్, ప్రకాశ్ కూడా ఉన్నారని ప్రచారం
- ఇద్దరు జవాన్ల మృతి.. మరో ఇద్దరు జవాన్లకు గాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ అడవుల్లో ఘటన
- ఇంద్రావతి జాతీయ పార్క్‌లో 3 రాష్ట్రాల నక్సల్స్ సమావేశం
- చుట్టుముట్టిన 650 మంది జవాన్లు.. గంటలపాటు కాల్పులు
- నక్సల్స్‌కు భారీ నష్టం.. 2 నెలల్లో 81 మంది హతం





పాలిథిన్ కవర్లలో నక్సల్స్ మృతదేహాలు; ఎన్‌కౌంటర్ సందర్భంగా జవాన్లు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

చర్ల/చింతూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోమారు తుపాకీ గర్జించింది. పోలీసులు-మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో బీజాపూర్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతం నెత్తురోడింది. ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమైన ఎన్‌కౌంటర్‌లో గ్రనేడ్ లాంచర్లతో మావోయిస్టుల దాడులు.. అధునాతన ఆయుధాలతో జవాన్ల ఎదురుకాల్పులతో అటవీ ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఆదివారం రాత్రి కడపటి వార్తలందేసరికి.. 31 మంది మావోయిస్టుల మృతదేహాలు.. పెద్ద సంఖ్యలో ఏకే-47, ఇతర తుపాకులు లభ్యమయ్యాయి. 15 మృతదేహాల వద్ద ఏకే-47, ఆటోమేటెడ్ గన్స్ లభించడంతో.. వారంతా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన డివిజనల్, స్టేట్, సెంట్రల్ కమిటీకి చెందిన నేతలు/సభ్యులు అయ్యి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని చెప్పారు. మావోయిస్టుల కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బస్తర్ ఐజీ సుందర్‌దాస్ కథనం ప్రకారం.. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మూడు రాష్ట్రాల మావోయిస్టులు సమావేశమైనట్లు ఉప్పందుకున్న డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు.. ఆదివారం తెల్లవారుజాము నుంచి కూంబింగ్ ప్రారంభించాయి. 650 మంది కూంబింగ్‌లో పాల్గొనగా.. ఉదయం 8 గంటలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో.. రెండు వైపులా కాల్పులు మొదలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నానికి 12 మంది నక్సల్స్ మృతిచెందగా.. సాయంత్రానికి ఆ సంఖ్య 31కి చేరింది. వారిలో 11 మంది మహిళలు. కాగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల కాల్పుల్లో నలుగురు జవాన్లు-డీఆర్జీ హెడ్‌కానిస్టేబుల్ నరేశ్‌ధ్రువ, ఎస్టీఎఫ్ కానిస్టేబుళ్లు వసిత్ రౌతే, గులాబ్ మాండవి, డీఆర్జీ కానిస్టేబుల్ జగ్గు కల్ము తీవ్రంగా గాయపడ్డారు. వారిని హెలికాప్టర్‌లో

మిగతా 2వ పేజీలో...

2026 మార్చి 31నాటికి నక్సలిజాన్ని తుడిచిపెడతాం

- ఇకపై నక్సల్స్ దాడిలో.. ఏ ఒక్క పౌరుడి ప్రాణాలు పోకూడదు
- ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు జవాన్ల మృతి బాధాకరం
- హోం మంత్రి అమిత్ షా

2

తిరువనంతపురంలో 'మాతృభూమి' సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



బీజేపీ, ప్రధాని మోదీ ప్రతిదాన్నీ తమ నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేస్తారు. ఇది ప్రజాస్వామ్యానికి పెనుముప్పు. దీన్ని తిప్పికొట్టేందుకు కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఏపీ, తెలంగాణ, పుదుచ్చేరి ప్రజలు ఏకమవ్వాలి.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి

- కుటుంబ నియంత్రణ పాటిస్తే.. శిక్షిస్తారా?
- జనాభా దామాషాతో పునర్విభజన చేస్తే బిమారు రాష్ట్రాలతోనే కేంద్రంలో సర్కారు
- దక్షిణాది రాష్ట్రాల అవసరం ఉండదు
- ఇది ప్రజాస్వామ్యానికి పూర్తి విఘాతం
- పునర్విభజనలో రాష్ట్రాల్లో ఉన్న సీట్లను 50% పెంచాలి.. దీంతో అన్ని రాష్ట్రాల్లో పెరుగుతాయి
- ఒకే దేశం.. ఒకే ఎన్నికకు మేం అంగీకరించం
- ఈ విధానంతో స్థానిక సంస్థలుగా రాష్ట్రాలు
- ప్రధాని మోదీ అసలు ఉద్దేశం అదే
- మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరమైన హక్కుల సాధనకు దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జనాభా దామాషా పద్ధతిలో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రంలోని మోదీ సర్కారు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే.. దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని.. బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి బిమారు రాష్ట్రాల్లో గెలిచే సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని, దక్షిణాది రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అవసరమే పార్టీలకు ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం తిరువనంతపురంలో జరిగిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. మాతృభూమి ఎడిటర్, ఆహూతుల ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "మెరుగైన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ.. కుటుంబ నియంత్రణను పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తారా?" అని కేంద్రాన్ని నిలదీశారు. ఈ చర్య ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆవేదన

మిగతా 13వ పేజీలో...

స్పీకర్‌ను సుప్రీంకోర్టు నిర్దేశించగలదా?



- తెలంగాణకు చెందిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంలో నేడు విచారణ
- ఇప్పటికే ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు
- సమయం ఇవ్వాలని ఎమ్మెల్యేల వినతి
- 'మణిపూర్ ఎమ్మెల్యేల'పై గతంలో సుప్రీం కోర్టు కీలక తీర్పు
- నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశాలు
- నేడు తెలంగాణ ఎమ్మెల్యేల కేసులో విచారణపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరగనుంది. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీపై చర్యలు తీసుకునేలా అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రిట్ పిటిషన్ వేయగా, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిపై చర్యలకు ఆదేశాలివ్వాలని కోరుతూ

మిగతా 12వ పేజీలో...

తీర్పును శిరసావహిస్తా

- ఉప ఎన్నిక వస్తే.. పోటీ చేసి గెలుస్తా
- ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు: కడియం

12



కోడ్ ముగిశాకే.. కొత్త ఇళ్లు

- ఎమ్మెల్సీ ఎన్నికలతో ఇందిరమ్మ ఇళ్లకు బ్రేక్
- ఇప్పటికే మంజూరైన వాటికి ఇబ్బంది లేదు
- లబ్ధిదార్ల జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్లు
- గత ప్రభుత్వ హయాంలో 'గృహలక్ష్మి' కింద ఇళ్లు మంజూరైన వారి వివరాల సేకరణ

13

రూ. 27.60 లక్షలకు సర్పంచ్ పదవి వేలం!

- ఎన్నిక ఏకగ్రీవం చేసేందుకు వేలంపాట
- 12 మంది పాల్గొన్నట్టు సమాచారం
- జోగులాంబ గద్వాల జిల్లా గోకులపాడు గ్రామంలో ఘటన

జగన్ సహా ప్రజాప్రతినిధుల కేసుల్లో రోజువారీ విచారణ!

- అమికస్ క్యూరీ హన్సారియా సిఫారసు
- అఫిడవిట్‌పై నేడు సుప్రీంకోర్టు విచారణ
- సుప్రీం చెప్పినా వాయిదాలేనని అఫిడవిట్‌లో అసంతృప్తి
- ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4732 క్రిమినల్ కేసులు పెండింగ్
- చాలా మంది నిందితులు కోర్టులకే రావడం లేదు
- వరుసగా రెండు సార్లు హాజరుకాకుంటే నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలి
- మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసుల ట్రయల్ పూర్తయ్యాకే ప్రత్యేక కోర్టులకు ఇతర కేసులు ఇవ్వాలి
- ఆ దిశగా ఆదేశాలివ్వాలని హన్సారియా వినతి
- సిటింగ్, మాజీ ప్రజాప్రతినిధులపై తెలంగాణ హైకోర్టులో 313 పెండింగ్ కేసులు







న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాఖలైన కేసుల్లో పురోగతే లేదు.. వారి కేసులను ప్రత్యేక కోర్టులు ఉదారంగా వాయిదా వేసేస్తున్నాయి.. సాక్షులను నిర్దిష్ట తేదీల్లో న్యాయస్థానాల్లో హాజరుపరచడంలో దర్యాప్తు సంస్థలు విఫలమవుతున్నాయి.. దర్యాప్తు, ట్రయల్ విషయాల్లో ప్రజాప్రతినిధుల ప్రభావం అధికంగా ఉన్నట్లు కనిపిస్తోంది' అని సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సుప్రీంకోర్టుకు నివేదించారు. కేసుల సత్వర విచారణకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా పదే పదే వాయిదాలు పడుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వేగంగా కేసుల పరిష్కారానికి తాజాగా మార్గదర్శకాలివ్వాలని ఆయన అభ్యర్థించారు. పలువురు ప్రజాప్రతినిధులు కోర్టుల్లో విచారణకు రావడమే లేదని.. వరుసగా రెండుసార్లు

మిగతా 14వ పేజీలో...

చిలుకూరు అర్చకుడిపై దాడి

- సీఎస్ రంగరాజన్‌పై రామ రాజ్యం సేన ఘాతుకం
- ప్రైవేటు సైన్యం ఏర్పాటుకు ఆర్థిక సాయానికి డిమాండ్
- ఆలయ బాధ్యతలను అప్పగించాలని దౌర్జన్యం
- ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి అరెస్టు
- మిగతా వారి కోసం గాలింపు

13

IIFL FINANCE
కల మీది. గోల్డ్ లోన్ మాది.
% తక్కువ వడ్డీ రేట్లు*
*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి
63 9111 9111

పారని పథకాలు

సంక్షేమమే విజయానికి వీసా కాదు!

- ఎన్ని సంక్షేమ పథకాలు తెచ్చినా.. ఓటమి తప్పించుకోలేని పార్టీలు
- ఏపీలో వైసీపీ.. తెలంగాణలో బీఆర్ఎస్.. తాజాగా ఢిల్లీలో ఆప్
- సంక్షేమానికి అభివృద్ధి తోడైతేనే ఆదరిస్తున్న ప్రజలు



ఒక్కసారి అధికారంలోకి వస్తే ముప్పై ఏళ్లు సీఎంగా కొనసాగుతానంటూ ప్రగల్భాలు పలికిన ఏపీ మాజీ సీఎం జగన్.. సంక్షేమ పథకాల రూపంలో జనానికి రూ.లక్షల కోట్లు పంచినా ఎందుకు ఓడిపోయానో అర్థం కాలేదని ఐదేళ్లు తిరక్కుండానే వాపోవాల్సిన పరిస్థితి! కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ నుంచి.. రైతు బంధు, దళిత బంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల దాకా.. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా అవేవీ కేసీఆర్‌ను ఓటమి కోరల నుంచి కాపాడలేకపోయాయి!! కేవలం సంక్షేమ పథకాలే ఓట్లు రాల్చవనే చేదు నిజం.. తాజాగా ఢిల్లీ ఎన్నికల ఫలితాల రూపంలో మరోసారి రుజువైంది. మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్తు, ఉచిత తాగు నీరు, మొహల్లా క్లినిక్‌ల వంటివేవీ కేజ్రీవాల్ ఓటమిని ఆపలేకపోయాయి. అలాగే.. 2018 నుంచి 2023 దాకా ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు రైతులు, మహిళల కోసం పలు సంక్షేమ పథకాలు అమలుచేసినా 2023 ఎన్నికల్లో అక్కడ బీజేపీ విజయపతాకం ఎగురవేసింది. కలర్‌టీవీలు, మిక్సీలు, గ్రైండర్లు.. ఇలా విచ్చలవిడిగా ఉచిత కానుకలు పంచడంతోపాటు, లెక్కకు మిక్కిలిగా సంక్షేమ పథకాలు అమలుచేసినా తమిళనాడులో ద్రవిడ పార్టీలకు అక్కడి ప్రజలు మార్చి మార్చి అధికారాన్ని కట్టబెట్టారే తప్ప ఏకధాటిగా ఏళ్ల తరబడి పాలనాపగ్గాలు అందించలేదు. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో ఉదాహరణలు. నిజానికి, ఓట్ల కోసమో ఓటు బ్యాంకు కోసమో ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను చాలా మంది ప్రతికూల ధోరణితో

మిగతా 2వ పేజీలో...

మోదీ అమెరికా నుంచి వచ్చాకే ఢిల్లీలో కొత్త ప్రభుత్వం!

- షాతో నడ్డా సమావేశం, సీఎం అభ్యర్థిపై చర్చ
- రేసులో ముందున్న పర్వేశ్ వర్మ
- ముఖ్యమంత్రి పదవికి అతిశీ రాజీనామా
- ఆప్ ఎమ్మెల్యేలతో అరవింద్ కేజ్రీవాల్ భేటీ

2



బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడిగా ఎన్నికైన దీపక్‌రెడ్డిని అభినందిస్తున్న కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్ విడిపోని దోస్తులు

- ఏళ్లుగా బహిరంగంగానే చెట్టాపట్టాలు
- వారి అనైతిక పొత్తుకు సాక్ష్యాలెన్నో
- కేజ్రీవాల్ ఓటమితో బీఆర్ఎస్‌లో కలవరం
- కాంగ్రెస్‌తో జట్టుకు మళ్లీ యత్నం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు
- ముస్లింలను బీసీల్లో ఎలా చేరుస్తారు?
- ఒవైసీతో రేవంత్ గ్యాంగ్ కుమ్మక్కు
- అర్బన్‌నక్సలైట్ల చేతుల్లో విద్యాశాఖ: బండి

హైదరాబాద్/సిటీ/బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'లిక్కర్ స్కామ్ భాగస్వామి' అయిన కేజ్రీవాల్ ఢిల్లీలో ఓడిపోవడంతో.. బీఆర్ఎస్‌లో కలవరం మొదలైనట్లుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. అందుకే పాత దోస్తు అయిన కాంగ్రెస్‌తో మళ్లీ జతకట్టేందుకు కేటీఆర్ బహిరంగ

మిగతా 13వ పేజీలో...



ప్రయాగ్‌రాజ్-ప్రతాప్‌గఢ్ హైవేపై నిలిచిపోయిన వాహనాలు

మహాకుంభమేళాకు వెళ్లే రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 9: మహాకుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తుతుంటంతో ప్రయాగ్‌రాజ్ చేరుకునే అన్ని రోడ్డు మార్గాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. 25 కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్థంభించిపోయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రయాగ్‌రాజ్‌కు దారి తీసే వారణాసి, లక్నో, కాన్పూర్, రేవా మార్గాలన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రయాగ్‌రాజ్‌కు దారితీసే ఏడు ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్‌ను 20 కిలోమీటర్ల ముందే నిలిపివేస్తున్నారు. దీంతో పుణ్యస్నానాలాచరించే సంగమ ప్రాంతానికి వెళ్లేందుకు భక్తులు కనీసం 20 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని తెలిసింది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు మధ్యప్రదేశ్‌లోనే వాహనాలను నిలిపివేస్తున్నారు. కనీసం 50 వేల వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. 48 గంటలుగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయామని భక్తులు చెబుతున్నారు. ట్రాఫిక్‌లో చిక్కుకున్న వారి కోసం అధికారులు తాగునీరు, ఆహారంతో పాటు తాత్కాలిక వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఫిబ్రవరి 14 వరకు ప్రయాగ్‌రాజ్ సంగం రైల్వేస్టేషన్‌ను మూసివేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

చీకటి పడ్డాకా మహిళను అరెస్టు చేయవచ్చు

▸▸ కారణాలు సహేతుకంగా ఉండాలి: మద్రాస్ హైకోర్టు

చెన్నై, ఫిబ్రవరి 9: చీకటి పడిన తరువాత కూడా మహిళలను అరెస్టు చేయవచ్చని, అయితే ఇందుకుగల హేతుబద్ధతను దర్యాప్తు అధికారి నిరూపించుకోవాల్సి ఉంటుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. సూర్యాస్తమయం తరువాత, సూర్యోదయానికి ముందు మహిళలను అరెస్టు చేయకూడదన్నది కేవలం మార్గదర్శనం చేసే సూచనలాంటిదని, చట్టబద్ధమైన నిబంధనేమీ కాదని తెలిపింది. దీన్ని ఉల్లంఘించినంత మాత్రాన అరెస్టు చట్టవిరుద్ధం కాబోదని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. అసాధారణ పరిస్థితుల్లో మినహాయిస్తే రాత్రి వేళ మహిళలను అరెస్టు చేయకూడదన్న సూచనలు ఉన్నాయి. ఒకవేళ అరెస్టు చేయాల్సి వస్తే అందుకు సంబంధిత మేజిస్ట్రేటు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే 'అసాధారణ పరిస్థితులు' అన్నదానిపై స్పష్టమైన నిర్వచనం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. రాత్రివేళ నిందితురాలిని అరెస్టు చేసిన మహిళా ఇన్‌స్పెక్టర్, మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్న ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. దీనిపై కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చిన మహిళా ఎస్.ఐ.పై చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలను మాత్రం సమర్థించింది.

న్యూజిలాండ్ 'గోల్డెన్ వీసా'లో మార్పులు

వెల్లింగ్టన్, ఫిబ్రవరి 9: సంపన్న వలసదారులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టేందుకు న్యూజిలాండ్ తన గోల్డెన్ వీసా కార్యక్రమాన్ని సరళీకృతం చేయనుంది. దీనిలో భాగంగా ఆంగ్ల భాష ఆవశ్యకతను తొలగించనుంది. ఏప్రిల్ 1 నుంచి యాక్టివ్ ఇన్వెస్టర్ ప్లస్ వీసాను కేవలం రెండు కేటగిరీలకు కుదించనున్నామని, ఆమోదయోగ్యమైన పెట్టుబడుల పరిమితిని విస్తరిస్తామని ఆ దేశ ఇమిగ్రేషన్ శాఖ మంత్రి ఎరికా స్టాన్‌ఫోర్డ్ తెలిపారు. పెట్టుబడుల కోసం న్యూజిలాండ్‌ను గమ్యస్థానంగా ఎంచుకొనేలా పెట్టుబడుదారులను ప్రోత్సహించేందుకు ఇన్వెస్టర్ వీసాను సులభతరం, మరింత సరళతరం చేస్తున్నామని ఆమె వివరించారు. కాగా, స్పెయిన్ తన గోల్డెన్ వీసా ప్రోగ్రామ్‌ను ఏప్రిల్ 3తో ముగించనుంది. యూకే, ఐర్లాండ్, నెదర్లాండ్స్, గ్రీస్, మాల్టా తమ గోల్డెన్ వీసా రూల్స్‌ను కఠినం చేశాయి. గోల్డెన్ వీసాల దుర్వినియోగం ఆరోపణలతో అనేక దేశాలు ఈ వీసాలను రద్దు చేస్తున్న సమయంలో న్యూజిలాండ్ తన ఇన్వెస్టర్ వీసా నిబంధనలను సడలిస్తుండటం గమనార్హం.

ప్రిన్స్ హ్యారీని అమెరికా నుంచి తిప్పిపంపం

▸▸ ఆయనకు ఇప్పటికే భార్యతో బోలెడు సమస్యలు: ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 9: కుటుంబ కారణాల నేపథ్యంలో ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న బ్రిటన్ రాకుమారుడు ప్రిన్స్ హ్యారీపై అధ్యక్షుడు ట్రంప్ ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. ఆయన వలస వచ్చిన విధానాన్ని సవాలు చేస్తూ కోర్టులో వివాదం నడుస్తున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓ వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ "హ్యారీపై ఎలాంటి చర్యలు తీసుకోను. ఆయనను ఒంటరిగా వదిలేయండి. భార్యతో ఇప్పటికే ఆయనకు చాలా సమస్యలు ఉన్నాయి. ఆమె చాలా టెరిబుల్" అని అన్నారు. తాను గతంలో మాదక ద్రవ్యాలను వినియోగించినట్టు ప్రిన్స్ హ్యారీ తన జీవిత కథలో రాసుకున్నారు. కానీ ఆ విషయాన్ని వీసా దరఖాస్తులో వెల్లడించలేదని, ఇది నిబంధనలకు వ్యతిరేకమని పేర్కొంటూ హెరిటేజ్ ఫౌండేషన్ అనే సంస్థ కేసు పెట్టింది. దీనిపైనే ట్రంప్‌ను ప్రశ్నించగా ఆయనను అమెరికా నుంచి తిప్పి పంపించేది లేదని చెప్పారు.

మెక్సికోలో బస్సును ఢీకొట్టిన ట్రక్కు

▸▸ మంటలు చెలరేగి 41 మంది సజీవ దహనం

మెక్సికో సిటీ, ఫిబ్రవరి 9: దక్షిణ మెక్సికోలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాంకున్ నుంచి టబాస్కోకు వెళ్తున్న ఓ బస్సును ట్రక్కు ఢీకొట్టింది. దాంతో బస్సులో మంటలు చెలరేగి 41 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మరికొందరు గాయాలతో బయటపడి ప్రాణాలు దక్కించుకున్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే స్థానిక అధికారులు హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 48 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా ఈ ఘటనలో చనిపోయినట్లు వారు తెలిపారు.

పారని పథకాలు

(మొదటి పేజీ తరువాయి)



చూస్తారుగానీ.. బడిపిల్లలకు మధ్యాహ్న భోజనం, బడికెళ్లే ఆడపిల్లలకు సైకిళ్ల పంపిణీ వంటి పథకాలు బడుగు, బలహీనవర్గాల్లో అక్షరాస్యత పెంచడానికి ఎంతగానో దోహదపడతాయనడంలో సందేహం లేదు. అలాగని సంక్షేమం పేరుతో అడ్డగోలుగా ప్రజల ఖాతాల్లోకి లక్షల కోట్ల రూపాయలు వేసేసినంతమాత్రాన.. ఎన్నికల్లో గెలవడానికి వీసా దొరికేసినట్టు కాదు! వాటికి ఒక పరిమితి.. అభివృద్ధికి, సంక్షేమానికి మధ్య సమతౌల్యం లేకపోవడమే అసలు సమస్య. ఈ విషయాన్ని అర్థం చేసుకోలేకపోవడం వల్లనే రాజకీయ పార్టీలు 'అతడి కంటె ఘనుడు ఆచంట మల్లన్న' అన్నట్టుగా.. ఒకదాన్ని మించి మరొకటి విచక్షణ రహితంగా హామీలు ఇచ్చుకుంటూ పోతున్నాయి. ఆ పథకాల అమలుకు దొడ్డిదోవన కార్పొరేషన్ల పేరుతో రూ.లక్షల కోట్లు అప్పులు తెస్తున్నాయి. బడ్జెట్ అప్పులను మాత్రమే లెక్కల్లో చూపుతూ.. బడ్జెటేతర అప్పుల్ని దాచేసి మాయ చేసే ప్రయత్నం చేస్తున్నాయి. తెచ్చిన అప్పులను సద్వినియోగం చేస్తున్నాయా అంటే.. అదీ లేదు. అభివృద్ధి మృగ్యమై అప్పులు మాత్రమే మిగలడంతో.. ఆ అప్పుల తాలూకూ అసలు, వడ్డీలు కట్టే దారి తెలియక, ప్రభుత్వ భూములు, ఆస్తులను తాకట్టు పెట్టే/తెగనమ్మే దుస్థితికి దిగజారుతున్నాయి. ఏపీలో జగన్ సర్కారు అలా ప్రభుత్వ భవనాలను తాకట్టు పెట్టిన సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలో ఏపీ రోడ్ల దుస్థితి గురించి చెప్పుకోనే అక్కర్లేదు. ఇటు తెలంగాణలోనూ అదే పరిస్థితి. కేసీఆర్ సర్కారు భూముల విక్రయం చేపట్టడం, ఓఆర్ఆర్‌ను 30 ఏళ్ల పాటు ఒక ప్రైవేటు సంస్థకు కేవలం రూ.7 వేల కోట్లకు లీజుకు కట్టబెట్టడం అందరికీ తెలిసిన విషయాలే! ఇలా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పులతో కుదేలైందని తెలిసినా.. ప్రత్యర్థి పార్టీలు మరిన్ని హామీలు గుప్పించి అధికారంలోకి రావడం, వాటిని నెరవేర్చే మార్గాలు కనిపించక నానా తిప్పలు పడుతుండడం అసలు విషాదం! ఢిల్లీలో సైతం ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు వాటికి అదనంగా మరిన్ని పథకాలు అమలు చేస్తామన్న బీజేపీ.. తన హామీలను ఎలా నిలబెట్టుకుంటుందో చూడాలి.

ఆశ.. కోపం.. సానుభూతి..

సంక్షేమ పథకాలే తమను మళ్లీ మళ్లీ అధికారపీఠంపై కూర్చోబెడతాయని చాలామంది రాజకీయ నాయకులు విశ్వసిస్తారుగానీ.. కేవలం సంక్షేమం.. కేవలం అభివృద్ధి.. ఇలా ఏదో ఒకదానికి మాత్రమే కట్టుబడే ప్రభుత్వాన్నీ ప్రజలు సహించలేరు. సంక్షేమానికి అభివృద్ధి తోడైన సందర్భాల్లో మాత్రమే అధికారంలో ఉన్న పార్టీకి మరో అవకాశాన్ని ఇస్తారని, ఎన్నికల్లో గెలుపోటములకు ఇంకా చాలా కారణాలు దోహదం చేస్తాయని చాలా సందర్భాల్లో వెల్లడైంది. డబ్బు కన్నా బలమైన.. ఆశ, కోపం, సానుభూతి వంటి భావోద్వేగాలు ఎన్నికల సమయంలో ప్రజల ఆలోచనధోరణిపై ప్రధానంగా ప్రభావం చూపుతాయంటారు రాజకీయ విశ్లేషకులు. ప్రస్తుత ప్రభుత్వ పాలన తీరుతెన్నులు, నాయకుల అవినీతి, అక్రమాలు, కబ్జాల వంటివాటిపై కోపం వంటివి ప్రజలను పోలింగ్‌బూత్‌లవైపు నడిపిస్తాయన్నది వారి విశ్లేషణ. ప్రతిపక్ష నేతలను అధికారపార్టీ అన్యాయంగా జైల్లో పెట్టిందన్న భావన ప్రజల్లో వచ్చినప్పుడు.. ఆ సానుభూతే విపక్షానికి ఆయుధమై అధికారపార్టీ పుట్టి ముంచిన ఉదాహరణలూ మన కళ్లముందు చాలానే ఉన్నాయి. నాయకుల అహంభావాన్ని ప్రజలు ఎక్కువ కాలం సహించలేరు. 2019లో ఏపీలో జగన్ గెలుపునకు ఆశ, సానుభూతి అనే బలమైన భావోద్వేగాలు ఎలా పనిచేశాయో.. 2024లో జగన్ సర్కారు అవినీతి, అక్రమాలు, భూకబ్జాల వంటివాటిపై ప్రజల్లో కోపం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ లేని నిర్బంధ వాతావరణంపై ఆగ్రహం అంతకన్నా ఎక్కువగా బలంగా పనిచేయడం వల్లే ఆ పార్టీ అంత ఘోరంగా ఓటమిపాలైంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కూడా ఆపార్టీ నాయకుల అహంకారపూరిత వైఖరి ఎంతో కొంత కారణమైందన్నది రాజకీయ నిపుణుల విశ్లేషణ. తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి కూడా ఈ భావోద్వేగాలే ప్రధాన కారణాలుగా నిలిచాయి. అవినీతిపై ఉద్యమంతో సీఎం పీఠం ఎక్కిన కేజ్రీవాల్ అవినీతి ఆరోపణలతోనే అధికారం కోల్పోయారు. **- సెంట్రల్ డెస్క్**

హామీల అమలు బీజేపీకి సవాలే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఢిల్లీలో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించింది. అయితే ఢిల్లీ ఆర్థిక వ్యవస్థ లోటులోకి జారుకొనే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఆ పార్టీకి సవాలుగా కనిపిస్తోంది. పేద మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు నెలకు రూ.2,500 పింఛను(70 ఏళ్లు దాటిన వృద్ధులకు రూ.3,000), గర్భిణులకు రూ.21 వేలు, పేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య వంటి హామీలను బీజేపీ ప్రకటించింది. అన్ని రంగాల్లో మార్పు తీసుకొస్తామని చెప్పింది. అయితే హామీల ఆర్థిక భారం ప్రస్తుతం ఢిల్లీ ఆర్థిక పరిస్థితిలో స్పష్టంగా కనిపిస్తోంది. 2024-25 సంవత్సరానికి అంచనా వేసిన పన్ను ఆదాయం రూ.58,750 కోట్లు ఉండగా.. మొత్తం బడ్జెట్ రూ.76 వేల కోట్లుగా ఉంది. అయితే, ప్రస్తుతం అర్హులకు అందుతున్న లబ్ధిని కొనసాగించడంతో పాటు ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వానికి అదనంగా ఏడాదికి రూ.25 వేల కోట్లు వరకు అవసరం అవుతుందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో హామీలు అమలు బీజేపీ పెద్ద సవాలు అని చెప్పవచ్చు. పేద మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలంటే ఏడాదికి రూ.11 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఒక అంచనా. ఇక ఢిల్లీలోని 24.4 లక్షల మంది వృద్ధులకు పింఛన్లు ఇవ్వాలంటే ఏడాదికి అదనంగా మరో రూ.4,100 కోట్లు అవసరం. అదేవిధంగా యమునా నది ప్రక్షాళనకే గత కొన్నేళ్లుగా దాదాపు రూ.8 వేల కోట్ల ఖర్చవుతోంది. ఇక ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయడానికి రూ.10,200 కోట్లు కావాలని అంచనా. అయితే కేంద్రం సాయం చేసేందుకు సిద్ధంగా ఉందని, నిధులు సమకూర్చుకుంటామని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర పేర్కొన్నారు.

లోకం తీరు



బీజేపీ 'కరువు' తీరింది!

ఢిల్లీలో దశాబ్దాలుగా గెలవని 12 స్థానాల్లో ఈసారి నాలుగింట విజయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత బీజేపీ విజయం అందుకుంది. అయితే ఇదే సమయంలో 1993 నుంచి గెలుపు అందని ద్రాక్షగా ఉన్న 9 నియోజకవర్గాలు, 2008 నుంచి విజయం దక్కని మూడు స్థానాలకుగానూ ఈసారి నాలుగింటిలో విజయకేతనం ఎగరవేసింది. ఈ పన్నెండు స్థానాల్లో 2008లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత న్యూఢిల్లీ, వికాస్‌పురి, కొండ్లి ఏర్పాటు కాగా, మిగతా తొమ్మిది స్థానాలు మటియా మహల్, బల్లీమారాన్, అంబేద్కర్ నగర్, సీలంపూర్, ఓక్లా, సుల్తాన్‌పూర్ మర్జా, మంగోల్‌పురి, జంగ్‌పుర, దియోలి. వీటిల్లో జంగ్‌పుర, న్యూఢిల్లీ, మంగోల్‌పురి, వికాస్‌పురి నియోజకవర్గాల్లో బీజేపీ ఈసారి ఎట్టకేలకు తన జెండా పాతింది.

డ్యాన్స్‌తో అతిశీ గెలుపు సంబరాలు

▸▸ సిగ్గుచేటన్న స్వాతి మలివాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కల్కాజీ నియోజకవర్గంలో విజయం సాధించిన ఢిల్లీ మాజీ సీఎం అతిశీ పార్టీ కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో సొంత పార్టీ ఘోర పరాజయం పాలైనన సమయంలో ఆమె తన గెలుపు పట్ల సంబరాలు చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆప్ సీనియర్ నాయకులంతా ఓడిపోతే అతిశీ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ అన్నారు. అతిశీ డ్యాన్స్ చేయడం ఆమె విజయానికి సంబరాలు మాత్రమే కాదని, ఆప్ సీనియర్ నాయకుల ఓటమి పట్ల ఆమె అంతర్గత సంతృప్తికి సంకేతమని అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. అతిశీ.. బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల తేడాతో గెలుపొందారు.

మోదీ అమెరికా నుంచి వచ్చాకే ఢిల్లీలో కొత్త ప్రభుత్వం!



వీకే సక్సేనాకు రాజీనామా పత్రాన్ని సమర్పిస్తున్న అతిశీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి9: ఢిల్లీలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యం కానుంది. ప్రధాని మోదీ అమెరికా పర్యటన ముగించుకుని వచ్చాకే కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. ఈ నెల 12, 13 తేదీల్లో ఆయన అమెరికాలో పర్యటించనున్నారు. 15వ తేదీన తిరిగిరానున్నారు. ఆ తర్వాతే నూతన ప్రభుత్వం ఏర్పడుతుందని బీజేపీ వర్గాలు చెప్పాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమయ్యారు. సీఎం అభ్యర్థిపై చర్చించినట్లు సమాచారం. రేసులో పర్వేశ్ వర్మ ముందున్నా పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఎంపీ బాన్సురి స్వరాజ్, మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మరోవైపు, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘోర పరాజయంతో సీఎం పదవికి అతిశీ రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు అందజేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 22 మంది ఎమ్మెల్యేలతో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఫిరోజ్ షా రోడ్డులోని తన నివాసంలో భేటీ అయ్యారు. ప్రజల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.



తేజస్‌లో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళాధిపతి ఏపీ సింగ్ ఆదివారం తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ప్రయాణించారు. ఇద్దరూ కలిసి 45 నిమిషాల పాటు యుద్ధ విమానంలో గాల్లో విహరించారు. రెండు రక్షణ దళాల అధిపతులు యుద్ధవిమానంలో ఇలా కలిసి విహరించడం ఇదే తొలిసారి. బెంగళూరులోని యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఇందుకు వేదికైంది. తన జీవితంలో ఇదో అద్భుత ఘట్టమని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. ఇదిలా ఉండగా, సోమవారం నుంచి యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఐదురోజుల పాటు ఏరో ఇండియా ప్రదర్శన జరగనుంది. ఇందులో భారత్‌తో పాటు అమెరికా అత్యాధునిక యుద్ధ విమానాలను ప్రదర్శించనున్నాయి.

హిందీ నేర్చుకుంటున్న కుమార స్వామి



బెంగళూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో కొనసాగిన కుమారస్వామి కేంద్రమంత్రిగా రాణించేందుకు సమగ్రంగా హిందీ నేర్చుకోదలిచారు. భాషా తరగతుల ద్వారా రోజూ 90 నిమిషాల పాటు హిందీ నేర్చుకుంటున్నారు. హిందీ బోధించే అధ్యాపకులను నియమించుకున్నారు. లోక్‌సభలో హిందీలో మాట్లాడేందుకు, తన అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు కష్టం అవుతున్న తరుణంలో కుమారస్వామి ఈ నిర్ణయం తీసుకున్నారు. 1996లో ప్రధానమంత్రిగా దేవేగౌడ హిందీ భాషా సమస్యను ఎదుర్కొన్నారు. '30రోజుల్లో హిందీ నేర్చుకోవడం ఎలా' అనే పుస్తకం ఎప్పుడూ ఆయన చేతుల్లో కనిపించేది. ఇందుకు సంబంధించి మీడియాలో కథనం హల్‌చల్ చేసింది.

మణిపూర్ సీఎం రాజీనామా

అమిత్‌షా, నడ్డాతో భేటీ అనంతరం గవర్నర్‌కు రాజీనామా సమర్పించిన బీరెన్ సింగ్



ఇంఫాల్, ఫిబ్రవరి 9: మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో జాతుల మధ్య ఘర్షణలను ఆయన ప్రేరేపించినట్లు లీకైన ఆడియోలోని గొంతుకు ఆయన గొంతుకు 93% సారూప్యత ఉందని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక ఇచ్చింది. ఆడియో లీక్ అంశంపై కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ సుప్రీం కోర్టును ఆశ్రయించగా విచారణ జరుగుతోంది. మరోవైపు బీరెన్‌పై అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ సిద్ధమైంది. సొంత పార్టీలోనే ఆయనపై వ్యతిరేకత ఉంది. 12 మంది సొంత ఎమ్మెల్యేలే ఆయనకు వ్యతిరేకంగా ఉండడంతో పాటు మరో ఆరుగురు కూడా ఆయనపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. అలాగే ఆయనకు, స్పీకర్‌కు పడటం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో బీరెన్‌సింగ్.. బీజేపీ సీనియర్ నాయకులను కలిసిన తర్వాత ఆదివారం తన రాజీనామా లేఖను గవర్నర్‌కు సమర్పించారు. అయితే, తదుపరి ఏర్పాట్లు జరిగే దాకా సీఎంగా కొనసాగాలని బీరెన్‌సింగ్‌ను గవర్నర్ కోరారు.

రెండేళ్లుగా అల్లర్లు

మణిపూర్‌లో రెండేళ్లుగా మైతేయి కుకీల మధ్య హింస చెలరేగుతూనే ఉంది. అందులో వందలాది మంది మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. అయితే అల్లర్లలో మైతేయిలను బీరెన్ సింగ్ ప్రేరేపిస్తున్నట్లు డిసెంబరులో ఓ ఆడియో లీకయింది. అందులో.. "ప్రభుత్వ కార్యాలయాల్లోని ఆయుధాలను లూటీ చేసేందుకు మైతేయిలకు అవకాశమివ్వండి" అని ఆయన ఆదేశించినట్లు ఉంది. ఆ ఆడియోలోని గొంతుకు బీరెన్ సింగ్ గొంతుకు 93% సారూప్యత ఉన్నట్లు హైదరాబాద్‌లోని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికను సుప్రీం కోర్టును సమర్పించి, బీరెన్‌పై తగు చర్యలు తీసుకోవాలని కుకీ సంస్థ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు. అయితే కేంద్రం, మణిపూర్ సర్కార్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసును మణిపూర్ హైకోర్టు విచారించాలని ఆయన పేర్కొనగా దీనిపై తదుపరి విచారణలో నిర్ణయం తీసుకుంటామని సుప్రీం తెలిపింది. ఈ ఆడియోపై కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఇప్పటికే ఆలస్యమైంది: కాంగ్రెస్

బీరెన్ సింగ్ రాజీనామా ఇప్పటికే ఆలస్యమైందని కాంగ్రెస్ పేర్కొంది. బీరెన్ రాజీనామాపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ.. తమ పార్టీ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైందని, పరిస్థితి గ్రహించిన బీరెన్ వెంటనే రాజీనామా చేశారని అన్నారు. తరచూ ప్రయాణాలు చేసే మోదీ మణిపూర్ ఎప్పుడు వస్తారని ఎదురుచూస్తున్నామని ఆయన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

రాజీనామాకు ముందు అమిత్‌తో భేటీ

రాజీనామా ముందు బీరెన్ సింగ్ కేంద్ర మంత్రి అమిత్ షాను కలిశారు. ఆదివారం ఉదయం ఢిల్లీకి వెళ్లి బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, షాలతో భేటీ అయ్యారు. సాయంత్రం ఇంఫాల్‌కు వచ్చి రాజ్ భవన్‌లో గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు తన రాజీనామా లేఖ సమర్పించారు. బీరెన్ సింగ్ రాజీనామా నేపథ్యంలో సోమవారం ప్రారంభం కావాల్సిన అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ అజయ్ కుమార్ భల్లా రద్దు చేశారు.

అడవిలో నెత్తుటేర్లు!

(మొదటి పేజీ తరువాయి)



నక్సలైట్ల మృతదేహాలను మోసుకెళ్తున్న జవాన్లు

రాయ్‌పూర్ ఆస్పత్రికి తరలించగా.. నరేశ్‌ధ్రువ, వసిత్ రౌతే చికిత్స పొందుతూ మృతిచెందారు. మిగతా ఇద్దరు జవాన్లకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.

ఒకేచోట.. 3 రాష్ట్రాల నక్సల్స్

గడిచిన ఏడాది కాలంగా వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టుల తరఫున భారీ నష్టం వాటిల్లింది. దీంతో.. ఉన్న క్యాడర్‌ను కాపాడుకుంటూ.. పునర్నిర్మాణంపై తెలంగాణ, మహారాష్ట్ర(గడ్చిరోలి కమిటీ), ఛత్తీస్‌గఢ్(నేషనల్ పార్క్ కమిటీ, మద్దేడు కమిటీ)కు చెందిన మావోయిస్టులు నేషనల్ పార్క్‌లో సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. ఛత్తీస్‌గఢ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేళ.. వీరు కీలక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. రాష్ట్రంలో పలు పంచాయతీలతో పాటు.. రాజధాని నగరం రాయ్‌పూర్ మునిసిపల్ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి వ్యూహాత్మకంగా నక్సల్స్‌ను చుట్టుముట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 650 మంది జవాన్లతో నాలుగు వైపుల నుంచి కూంబింగ్ ప్రారంభించారు. ఉదయం 8 గంటల సమయంలో నక్సల్స్ తారసపడడంతో.. ఇరువైపులా హోరాహోరీ కాల్పులు జరిగాయి. కాగా.. ఈ ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పెచ్చర్లకు చెందిన అడెల్లు అలియాస్ భాస్కర్, మందమర్రికి చెందిన ప్రశాశ్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, గతేడాది నుంచి మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బలు తగులుతున్నాయి. 2024లో 219 మంది నక్సల్స్ చనిపోగా.. వెయ్యి మంది వరకు లొంగిపోయారు. ఈ ఏడాది కూడా నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్‌తో కలిపి.. గడిచిన 40 రోజుల్లో మొత్తం 81 మంది నక్సలైట్లు మృతిచెందారు.

2026కల్లా నక్సలిజం అంతం: షా

దేశంలో నక్సలిజాన్ని 2026 మార్చి 31 నాటికి పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పునరుద్ఘాటించారు. బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి తర్వాత.. దేశంలో నక్సలిజం వల్ల ఏ ఒక్క పౌరుడి ప్రాణాలు కూడా పోకూడదని ఆకాంక్షించారు.

23 నెలల్లో 92 లక్షల మంది!

అమెరికాలో అక్రమ ప్రవేశాలకు యత్నం

వీరిలో 2.7 లక్షల మంది భారతీయులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) పరిధిలోని యూఎస్ బోర్డర్ అండ్ కస్టమ్స్ పెట్రోల్ (యూఎస్‌బీపీ), యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) గణాంకాల ప్రకారం 2022 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య 23 నెలల వ్యవధిలో 92 లక్షల మందికి పైగా అమెరికాలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించడానికి ప్రయత్నించారు. వీరిలో సరిహద్దుల్లో అరెస్టయినవారు, బహిష్కరణకు గురైనవారు, ప్రవేశానికి అనుమతి నిరాకరించిన వారు ఉన్నారు. 2021 నుంచి 2024 వరకూ మొత్తం 3,488 మంది భారతీయులను ఐసీఈ అరెస్టు చేసింది. మరోవైపు 2022 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నించిన 2,69,884 మంది భారతీయులను యూఎస్‌బీపీ అడ్డుకుంది.

క్షణమొక యుగం!



▸▸ అక్రమ వలసలపై ఉక్కుపాదంతో అమెరికాలో రెస్టారెంట్లలో సిబ్బంది తొలగింపు

▸▸ అక్కడి భారతీయ రెస్టారెంట్లలో పనిచేస్తున్న తెలుగు యువత ఆందోళన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

అమెరికాలోని భారత రెస్టారెంట్ల తలుపులు తడితే చాలు లోపల పని చేస్తున్న వారు వణికిపోతున్నారు. ఎప్పుడు ఏ క్షణాన ఇమ్మిగ్రేషన్ అధికారులు వచ్చి తనిఖీ చేస్తారో.. తాము ఏక్షణంలో పట్టుబడుతామోనని భయాందోళనలో క్షణమొక యుగంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా భయపడుతూ పనిచేస్తున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన యువత కూడా ఉండడం గమనార్హం. అమెరికాలో సుమారు 9వేల భారత రెస్టారెంట్లు ఉన్నట్లు అంచనా. గత దశాబ్ద కాలంగా దేశంలో పెద్ద సంఖ్యలో తెలుగు ప్రవాసీయులు రెస్టారెంట్లు ఏర్పాటు చేశారు. తెలుగు ప్రవాసీయులు అధికంగా ఉన్న టెక్సాస్ రాష్ట్రంలో తొలుత ఈ వ్యాపారం ప్రారంభమై ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించింది. తెలుగు వారు బృందాలుగా ఏర్పడి ఈ రంగంలో పుంజుకుంటున్నారు. తెలుగువారు స్థాపించిన రెస్టారెంట్లలో తెలుగు యువత ఎక్కువగా ఉపాధి పొందుతోంది. అమెరికాలో చదవడానికి వచ్చే భారతీయ విద్యార్థులను ఈ రెస్టారెంట్లలో నియమించుకుంటున్నారు. అయితే.. వీరిలో ఎక్కువగా సరిహద్దులు దాటి మెక్సికో నుంచి అక్రమంగా వచ్చిన వారే ఎక్కువగా ఉన్నారు. వాస్తవానికి ఇలా నియమించడం చట్టవిరుద్ధం. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు రెస్టారెంట్లు, ఇతర పని ప్రదేశాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో అనేక మంది భారతీయ రెస్టారెండ్ల నిర్వాహకులు పార్ట్ టైం పనులు కల్పించేందుకు స్వస్తి పలుకుతున్నారు. దీంతో ఆయా పనులపైనే ఆధారపడిన విద్యార్థుల పరిస్థితి డోలాయమానంలో పడింది. ఇమ్మిగ్రేషన్ అధికారుల తనిఖీల్లో అక్రమ వలసదారులు దొరికితే అది వారితో పాటు తమకు కూడా ఇబ్బందేనని రెస్టారెంట్ నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు విద్యార్థులకు ప్రాణసంకటంగా మారాయి. మరోవైపు.. తక్కువ వేతనానికి లభించే పనివారు వెళ్లిపోతే రెస్టారెంట్లపై ఆర్థిక భారం పెరుగుతుందని యజమానులు తలలు పట్టుకుంటున్నారు.

అరేబియా తీరాన రాజన్న కల్యాణం

మస్కట్‌లో వైభవంగా ఉత్సవం




శ్రీ రాజరాజేశ్వర స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు, హాజరైన ప్రవాస భక్త జనం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

అరేబియా సముద్ర తీరాన ఎములాడ రాజన్న కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కాశీ, చిదంబరం, శ్రీశైలం, కేదారేశ్వరాన్ని పావనం చేసి శివుడు దక్షిణ కాశీగా పేరొందిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ క్షేత్రానికి వస్తాడని పురాణ కథనం కాగా.. భక్తుల విశ్వాసం ఆ పరమ శివుడ్ని అరేబియా తీరానికి తెచ్చింది. ఎడారిలో ఒయాసిస్సుగా భావించే ఒమాన్ సముద్ర తీరంలో మస్కట్ నగర శివారులో ప్రకృతి రమణీయమైన బర్కా ప్రాంతం రాజన్న కల్యాణానికి వేదికైంది. ఓం నమశ్శివాయ అంటూ తెల్లవారు జాము నుంచి మొదలైన శ్రీరాజరాజేశ్వర స్వామి వారి కల్యాణం వేములవాడ నుంచి వచ్చిన ప్రత్యేక అర్చకుల బృందం, స్థానిక ప్రవాసీ బ్రాహ్మణ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కనుల పండువగా జరిగింది. ఒమాన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రాజన్న కల్యాణోత్సవంతో ప్రవాసీ భక్తులు పరవశించిపోయారు. వేదిక ప్రాంగణంలో నిర్వహించిన కోడె మొక్కులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కల్యాణోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, గౌరవ అతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిలు హాజరయ్యారు. రాజన్న కల్యాణోత్సవం వేములవాడ స్థాయిలో ఉందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. విదేశాల్లో సైతం ప్రవాసీలు హైందవ సంస్కృతిని పరిరక్షించడానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు.



వార్షిక ఆటల పోటీల్లో భాగంగా హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీఫ్ జస్టిస్ టీం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టీంల మధ్య క్రికెట్ పోటీలను ఆదివారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ క్రికెట్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో హైకోర్టు చీఫ్ జస్టిస్ టీం విజయం సాధించింది. పోటీల్లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి, జస్టిస్ సురేందర్, జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్, జస్టిస్ జే శ్రీనివాసరావు, జస్టిస్ నర్సింగ్‌రావు,. బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ సునీల్ గౌడ్, ప్రెసిడెంట్ రవీందర్‌రావు, కార్యదర్శులు శాంతిభూషణ్‌రావు, సంజీవ్ పాల్గొన్నారు.

వెల్జన్ ఇండస్ట్రీస్ అధినేత వీసీ జనార్దన్ రావు హత్య

ఆస్తి వివాదంలో మనవడి ఘాతుకం.. ఉన్మాదిలా మారి కత్తితో దాడి

- 70కి పైగా కత్తిపోట్లకు గురై జనార్దన్‌రావు మరణం
- పోలీసుల అదుపులో నిందితుడు కీర్తితేజ
- జనార్దన్ రావు రతన్‌టాటా సహాధ్యాయి
- వ్యాపారవేత్త, వితరణశీలిగా ప్రఖ్యాతి
- గుప్త దానాలు, సేవా కార్యక్రమాలు

పంజాగుట్ట, హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్ దెందులూరు, బాలానగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెల్జన్ గ్రూపు ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత వెలమాటి చంద్రశేఖర జనార్దన్ రావు(85) హత్యకు గురయ్యారు. ఆస్తి వివాదంలో జరిగిన ఘర్షణలో ఆయన మనవడు కీర్తితేజ(29)నే ఆయనపై కత్తితో దాడి చేసి హతమార్చాడు. గురువారం రాత్రి ఆయన నివాసంలోనే ఈ దారుణం జరిగింది. ఏపీలోని ఏలూరు జిల్లా కొవ్వలి గ్రామానికి చెందిన జనార్దనరావు.. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ప్రముఖ పారిశ్రామివేత్త రతన్‌టాటాకు సహాధ్యాయి అయిన వీసీ జనార్దన్ రావు 1969లో హైదరాబాద్‌లోని బాలానగర్‌లో వెల్జన్ పరిశ్రమలను స్థాపించారు. వెల్జన్ గ్రూపులో మొత్తం 16 పరిశ్రమలు ఉండగా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. బేగంపేటలో నివాసముండే జనార్దన్‌రావుకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు వెలమాటి గంగాధర్ శ్రీనివాస్ జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్నారు. రెండో కూతురు సరోజిని దేవి భర్తతో విభేదాలు రావడంతో కొంతకాలంగా తండ్రితోనే ఉంటున్నారు. సరోజిని దేవి కుమారుడు కిలారు కీర్తి తేజ విదేశాల్లో ఉన్నత విద్య అనంతరం 2018 నుంచి మణికొండలో నివాసముంటున్నాడు. ఆస్తి, హోదా, వ్యాపారాల్లో గుర్తింపు విషయాల్లో కీర్తితేజ కొంతకాలంగా తాత, తల్లితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీ రాత్రి జనార్దన్ రావు ఇంటికి వచ్చిన కీర్తితేజ వాగ్వాదానికి దిగాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో జనార్దన్ రావును ఇష్టమొచ్చినట్టు పొడిచాడు. జనార్దన్ రావు మెడపైనే 16 సార్లు వరకు పొడిచిన కీర్తితేజ.. మొత్తం 70కి పైగా కత్తిపోట్లు పొడిచాడు. దాడిని అడ్డుకోబోయిన తల్లి సరోజిని దేవిని దాదాపు 10 సార్లు పొడిచాడు. జనార్దన్‌రావు అక్కడికక్కడే మరణించగా సరోజిని దేవి ఆస్పత్రిపాలయ్యారు. కీర్తితేజను పోలీసులు ఎనిమిదో తేదీన అరెస్టు చేశారు. కీర్తితేజ మానసిక ఆరోగ్యంపై అనుమానాలు ఉండడంతో పోలీసులు మానసిక వైద్యుల అభిప్రాయం తీసుకుంటున్నారు. అలాగే మాదకద్రవ్యాలకు బానిస.. అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కీర్తితేజ గత ఏడాది జూన్‌లో సోమాజీగూడ పార్క్ హోటల్‌లో పిటా కేసులో పోలీసులకు దొరికాడు. కాగా, వీసీ జనార్దన్ రావు అంత్యక్రియలు పంజాగుట్ట మహాప్రస్థానంలో ఆదివారం పూర్తయ్యాయి. పలువురు పారిశ్రామిక, వ్యాపారవేత్తలు ఆయనకు నివాళులర్పించారు.



వీసీ జనార్దన్ రావు(ఫైల్)

గుప్త దాత, వితరణశీలి, ఆదర్శప్రాయుడు

రతన్‌టాటా సహాధ్యాయి అయిన వీసీ జనార్దన్ రావు.. సేవ కార్యక్రమాల్లోనూ రతన్‌టాటాను మరిపించారు. కోట్ల రూపాయాలను సేవా కార్యక్రమాలకు వెచ్చించారు. కానీ, తాను చేసిన సాయం రెండో కంటికి తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి పలు దఫాలుగా నగదు అందించారు. భక్తుల భోజన వసతుల అభివృద్ధికి టీటీడీకి రూ.50 కోట్లు, స్వగ్రామం కొవ్వలిలోని జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి రూ.5 కోట్లు అందించారు. అంతేకాక కొవ్వలిలో పశువుల ఆసుపత్రి, బీసీ హాస్టల్ అభివృద్ధితో పాటు ఆలయాన్ని కూడా నిర్మించారు. ఏపీ, తెలంగాణలోని పలు దేవాలయాలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు రూ.8కోట్లు వరకు విరాళాలు ఇచ్చారు. కరోనా సమయంలో తెలంగాణ ప్రభుత్వానికి, గతేడాది విజయవాడకు వరదలు వచ్చినప్పుడు ఏపీ ప్రభుత్వానికి విరాళాలు అందజేశారు. వైజాగ్, విజయవాడలోని అనాథ ఆశ్రమాల్లో అన్నదానానికి ఏటా రూ.30 లక్షలు ఇస్తున్నారు. తన సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికుల పిల్లల చదువులకు అవసరమైన ఆర్థిక సాయం చేసేవారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో తన తల్లి పేరిట ఓ బ్లాక్ ఏర్పాటు చేశారు.

జీబీఎస్‌తో సిద్దిపేట మహిళ మృతి


- జనవరిలో గులియన్ బారీ సిండ్రోమ్ బారిన
- తొలుత సిద్దిపేటలో చికిత్సచేసిన వైద్యులు
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు!
- 12రోజులు చికిత్స పొందుతూ కన్నుమూత

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారీ సిండ్రోమ్(జీబీఎస్) బారిన పడి.. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సిద్దిపేట మహిళ శనివారం మృతి చెందింది. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో పన్నెండు రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె మృత్యువుతో పోరాడి కన్నుమూసింది. ఆమెను బతికించుకోవడానికి కుటుంబ సభ్యుల చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సిద్దిపేట జిల్లా సీతారాంపల్లికి చెందిన గృహిణి (25)కి మూడోసారి గర్భం దాల్చడంతో... ప్రసవం కోసం సమీపగ్రామమైన లక్ష్మీదేవిపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. అక్కడ ఒక నర్సింగ్‌హోమ్‌లో డిసెంబరు 5న ఆమె ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆ తర్వాత కొద్దిరోజులకు.. ఆమె కాళ్లల్లో తిమ్మిర్లు మొదలయ్యాయి. తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఏ చికిత్స చేసినా ఉపయోగం లేకపోయింది. ఆమె కాళ్లు, చేతులు పనిచేయడం మానేశాయి. నడవలేక.. ఒంట్లో సత్తువ లేక.. తీవ్రంగా ఇబ్బందిపడుతున్న ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు ఆమెను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేశారు. అయినా ఉపయోగం లేకపోవడంతో ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు తరలించినా.. పరిస్థితి మెరుగుపడలేదు. చివరకు నిమ్స్‌కు తీసుకెళ్లారు. కానీ అప్పటికే పరిస్థితి చేయిదాటిపోవడంతో ఆమె శనివారం చనిపోయింది.

శత సహస్ర సూర్య నమస్కారాలు

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల మైదానంలో నిర్వహించిన శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన రికార్డు నెలకొల్పింది. లక్ష సూర్య నమస్కారాలు చేయడం లక్ష్యం కాగా **4,02,154** సూర్య నమస్కారాలు చేసి యోగ సాధకులు రికార్డు నెలకొల్పారు. వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్‌లో ఈ రికార్డు నమోదైంది. **1,484** మంది యోగ సాధకులు పాల్గొన్నారు. - సిద్దిపేట కల్చరల్





సత్కారం అందుకున్న కళాకారులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రముఖ వీణ విద్వాంసుడు శ్యామసుందర్ తదితరులు

‘దండమూడి’కి శత మృదంగ వాయిద్య నివాళి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మృదంగ విద్వాంసుడు దండమూడి రామమోహనరావు 95వ జయంతిని పురస్కరించుకుని కళాకారులు ‘శత మృదంగ వాయిద్య’ నివాళులర్పించారు. గాన విద్వాంసుల అత్యద్భుతమైన లయ విన్యాసం చేశారు. మృదంగ వాయిద్యంలో లయ సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ, ప్రతీ నాదస్వరూపం సంగీత ప్రియులకు వినసొంపుగా అంకితమైంది. స్థానిక సత్యనారాయణపురం ప్రభుత్వ సంగీత కళాశాలలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వీణ విద్వాంసుడు అయ్యగారి శ్యామసుందర్, అయ్యగారి జయలక్ష్మి, దండమూడి సుమతీ పాల్గొన్నారు. కార్యక్రమానికి హరగోపాల్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం మృదంగ విద్వాంసులు కామరాజు విష్ణుమూర్తి, వంకాయల వెంకట రమణమూర్తి, ధూళిపాల శ్రీరామమూర్తి, మండపాక నాగలక్ష్మి, బీవీఎస్ ప్రసాద్, కొమ్మాజోశ్యుల సద్గురుచరణ్, గుంటుకు వెంకటరావు, తిరునగరం ప్రభాకరరావు, పున్నమరాజు ఎన్‌వీ మురళీకృష్ణకు ఆత్మీయ సత్కారం చేశారు.

65 యుద్ధ నౌకలు... 80 యుద్ధ విమానాలు!

- ట్రోపెక్స్ మిలటరీ విన్యాసాల కోసం మోహరింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: హిందూ మహాసముద్రంలో భారత్ నిర్వహిస్తున్న మిలటరీ విన్యాసాలలో భారీ సంఖ్యలో యుద్ధ విమానాలు, నౌకలు, జలాంతర్గాములు పాల్గొననున్నాయి. మొన్న జనవరి నుంచి రానున్న మార్చి వరకూ మూడు నెలల పాటు జరిగే ఈ సైనిక విన్యాసాలను నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ట్రోపెక్స్ పేరిట చేపట్టిన ఈ విన్యాసాలలో త్రివిధ దళాలకు చెందిన 65 యుద్ధ నౌకలు, 80 యుద్ధ విమానాలు, తొమ్మిది జలాంతర్గాములు పాలుపంచుకోనున్నాయి. వీటిలో ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విశాఖ, ఐఎన్ఎస్ కోల్‌కతా, మిగ్ 29కే జెట్స్, నిఘా విమానాలు, వివిధ రకాల డ్రోన్లు, హెలికాప్టర్లు ఉన్నాయి. విన్యాసాల కోసం వీటన్నింటినీ హిందూ మహాసముద్రం పరిధిలోని వివిధ ప్రాంతాలలో మోహరించారు.

‘రైలు’ బాధితురాలికి రూ.3లక్షల సాయం

- తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా జోలార్‌పేట సమీపంలో కోయంబత్తూరు-తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో అత్యాచార యత్నం, దాడికి గురైన చిత్తూరు జిల్లాకు చెందిన మహిళ వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వం భరిస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. అలాగే బాధితురాలికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. గురువారం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మహిళా బోగీలో ఒంటరిగా ప్రయాణిస్తున్న నాలుగు నెలల గర్భిణిపై వేలూరు జిల్లా కేవీ కుప్పానికి చెందిన హేమరాజ్ అనే వ్యక్తి అత్యాచారానికి యత్నానికి పాల్పడగా, ఆమె ప్రతిఘటించడంతో ఆమెను రైలు నుంచి కిందకు తోసేశాడు. ఆ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని వేలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స అందించగా ఆమె గర్భంలోని నాలుగు మాసాల శిశువు మృతి చెందింది. ఈ ఘటనపై బాధితురాలి భర్త, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ మహిళ వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వం భరిస్తుందని స్టాలిన్ ఆదివారం ప్రకటించారు.

కొడుకుని కొట్టి చంపేశాడు

మద్యం మత్తులో తండ్రి ఘాతుకం.. ఇంటికి ఆలస్యంగా వచ్చాడని కుమారుడిపై దాడి

- ఆ దెబ్బలకు మరణించిన బాలుడు
- బాలుడి తల్లి ఫిర్యాదు.. తండ్రి పరారీ
- భువనగిరి జిల్లా ఆరెగూడెంలో ఘటన

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన తండ్రి.. పాఠశాల నుంచి ఇంటికి ఆలస్యంగా వచ్చిన కొడుకుని చావగొట్టాడు. భార్య వేడుకున్నా వినకుండా రెచ్చిపోయి చివరికి పిల్లాడి ఛాతీపై తన్నాడు. ఆ దెబ్బలకు ఆ బాలుడు ప్రాణం వదలగా.. కొడుకు అనారోగ్యంతో చనిపోయాడని నమ్మించి చేతులు కడుక్కునేందుకు విశ్వప్రయత్నం చేశాడా తండ్రి..!! యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన ఈ దారుణ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన కట్ట సైదులు.. భార్య నాగమణి, ముగ్గురు కుమారులతో కలిసి చౌటుప్పల్‌లో నివాసముంటున్నాడు. సైదులు చిన్నకొడుకు భాను (14) చౌటుప్పల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహించిన వీడ్కోలు(ఫేర్‌వెల్) వేడుకలో పాల్గొన్న భాను.. రాత్రి ఏడు గంటల తర్వాత ఇంటికి వచ్చాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సైదులు.. ఇంటికి ఎందుకు ఆలస్యంగా వచ్చావని ప్రశ్నిస్తూ భాను ను చితకబాదాడు. ఆవేశంలో ఛాతీపై తన్నా డు. దీంతో భాను కుప్పకూలిపోయినా సైదు లు ఆగలేదు. కుమారుడిని కొట్టవద్దని భార్య వేడుకున్నా దాడి ఆపలేదు. భాను అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా.. కాస్త తేరుకున్న సైదులు... రాత్రి కొడుకుని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు భాను అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు.



భాను (ఫైల్)

సాధారణ మృతిగా చిత్రీకరించే యత్నం

కొడుకు చావుని సాధారణ మృతిగా చిత్రీకరించేందుకు సైదులు తీవ్ర ప్రయత్నమే చేశాడు. తన కొడుకు అనారోగ్యంతో కుప్పకూలాడని వైద్యులకు లిఖితపూర్వకంగా సమాచారమిచ్చి భాను మృతదేహాన్ని స్వగ్రామం ఆరెగూడేనికి తరలించాడు. భార్యను బెదిరించి.. కొడుకు మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఆదివారం ఉదయం శ్మశాన వాటికకు తరలించాడు. అయితే, గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు అంత్యక్రియలను అడ్డుకుని భాను మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అయితే, కొడుకు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తీసుకెళ్లకుండా చేసేందుకు సైదులు.. పోలీసులతో వాగ్వాదానికి దిగి విఫలయత్నం చేశాడు. అనంతరం సైదులు పరారయ్యాడు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు భాను మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. సైదులు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓఆర్ఆర్‌పై అర్ధరాత్రి కార్లతో విన్యాసాలు!

- కేసు నమోదు చేసిన పోలీసులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)పై అర్ధరాత్రి వాహనాలతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. కార్లు, బైక్‌లను అతివేగంతో నడుపుతూ విన్యాసాలు చేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని తొండుపల్లి వద్ద రింగ్‌రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తులు రెండు కార్లతో విన్యాసాలు చేశారు. అతి వేగంతో వాహనాలను నడుపుతూ సడన్ బ్రేకులు వేసి గిరగిరా తిప్పారు. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లోనూ రికార్డయ్యాయి. దీనిపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్ల నంబర్ల ఆధారంగా బాధ్యులను గుర్తించే పనిలో ఉన్నారు. బైక్, కార్ల రేస్‌లకు ఓఆర్ఆర్‌ను అడ్డా కానివ్వద్దని.. ఇప్పటికైనా పోలీసులు, ఓఆర్ఆర్ నిర్వహణ సిబ్బంది కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రావెల్స్ బస్సులో రూ.25 లక్షల చోరీ

- నార్కట్‌పల్లి వద్ద ప్రయాణికుడి సంచి అపహరణ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఆదివారం ఉదయం చోరీ జరిగింది. రూ.25 లక్షల నగదు ఉన్న ఓ ప్రయాణికుడి సంచి అపహరణకు గురైంది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి శివారులో ఈ ఘటన జరిగింది. ఏపీలోని బాపట్లకు చెందిన వెంకటేశ్.. చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చేందుకు శనివారం రాత్రి శామసర్దార్ అనే ప్రైవేట్ బస్సు ఎక్కాడు. వెంకటేశ్ దగ్గర ఉన్న ఓ సంచిలో రూ.25లక్షల నగదు ఉంది. ఆదివారం ఉదయం బస్సును నార్కట్‌పల్లి శివారులోని పూజిత హోటల్ వద్ద డ్రైవర్ ఆపాడు. అల్పాహారం కోసం మిగిలిన ప్రయాణికులతోపాటే బస్సు దిగిన వెంకటేశ్... తిరిగి వచ్చేసరికి ఆ సంచి కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తి నేరుగా బస్సు ఎక్కి ఆ సంచి తీసుకుని పరారవ్వడాన్ని హోటల్ సీసీ కెమెరాల్లో గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ గుర్తు తెలియని వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

కస్టడీలో కొనసాగుతున్న గురుమూర్తి విచారణ

- మరో ముగ్గురు నిందితులపై వేధింపుల కేసు మాత్రమే

సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కట్టుకున్న భార్య వెంకటమాధవిని కిరాతకంగా హత్య చేసిన గురుమూర్తిని నాలుగు రోజుల కస్టడీకి తీసుకున్న మీర్‌పేట్ పోలీసులు.. రాచకొండ పరిధిలోని మరో పోలీసుస్టేషన్‌లో రహస్యంగా విచారణ జరుపుతున్నారు. విచారణ సందర్భంగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు నిందితుడు నింపాదిగా సమాధానం ఇస్తున్నాడని, అతడి ముఖంలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదని తెలిసింది. శనివారం మరోసారి గురుమూర్తిని మీర్‌పేట్ పెద్దచెరువు వద్దకు తీసుకువచ్చినట్టు తెలిసింది. వెంకటమాధవి హత్య కేసులో మరో ముగ్గురి ప్రమేయం ఉన్నదంటూ వస్తున్న వదంతులు నిజం కాదని, సదరు ముగ్గురిపై వేధింపుల కేసు(బీఎన్ఎస్ సెక్షన్ 85) మాత్రమే ఉన్నదని మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

అనంతపురంలో ధార్ గ్యాంగ్ అరెస్టు

- 59 తులాల బంగారం, 9.35 లక్షల నగదు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు, నగదు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వరుస దోపిడీలతో కలకలం సృష్టిస్తున్న ధార్ గ్యాంగ్‌ను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం నగర శివారులోని విల్లాల్లో ఈ ముఠా గతనెలలో రూ.2.13 కోట్లకుపైగా విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలను చోరీ చేసింది. దీంతో జిల్లా ఎస్పీ జగదీశ్ నేతృత్వంలో నాలుగు పోలీసు బృందాలు రంగంలోకి దిగి కేసును ఛేదించారు. ఆదివారం ఎస్పీ వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని దార్ జిల్లా టాండ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన నారూ పచావర్, సావన్, మహబత్, మోట్లు కలిసి గతనెల 16న ధార్ జిల్లా నుంచి బయలుదేరి తమిళనాడు సేలం చేరుకున్నారు. అక్కడినుంచి అనంతపురం వచ్చి రెక్కీ నిర్వహించారు. గతనెల 21న రాత్రి వెంకట శివారెడ్డి, రంజిత్‌రెడ్డి, శివశంకర్ నాయుడుకు చెందిన విల్లాల్లో చోరీ చేశారు. అనంతరం ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్ వెళ్లారు. చోరీ సొమ్మును వాటాలేసి పంచుకున్నారు. చోరీ సమయంలో మొబైల్ ఫోన్ లొకేషన్, ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు... అనంతపురం నగరం రాయల్‌నగర్‌లో ఉన్న పచావర్, సావన్, సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి 59 తులాల బంగారు ఆభరణాలు, రూ.19.35 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తులో తమ వాటాలతో స్వగ్రామానికి వెళ్లిపోయిన మహబత్, మోట్లను కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QR కోడ్ స్కాన్ చేయండి

రెగ్యులర్ / కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ / కాంట్రాక్టు ప్రాతిపదికన క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:


క్రమ సంఖ్య	పదవి పేరు	ఖాళీ	టైప్
ప్రకటన నం. CRPD/SCO/2024-25/29			
1	చీఫ్ ఆఫీసర్ (సెక్యూరిటీ)	01	కాంట్రాక్టు
ప్రకటన నం. CRPD/SCO/2024-25/27			
1	మేనేజర్ (డేటా సైంటిస్ట్)	12	రెగ్యులర్
2	డిప్యూటీ మేనేజర్ (డేటా సైంటిస్ట్)	28	

అర్హతా ప్రమాణాలు (వయసు, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ **https://bank.sbi/web/careers/current-openings** లో లాగిన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తుని నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలను నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏమైనా సందేహాలు ఉన్నచో, దయచేసి మాకు – **"CONTACT US" —> "Post Your Query"** లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ **(https://bank.sbi/web/careers/post-your-query)** లో లభించును.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : **01.02.2025** నుండి **24.02.2025** వరకు.

స్థలం: ముంబై
తేది: 01.02.2025
మహానిర్వహణాధికారి (ఆర్పీ & పీఎం)

అరేబియన్ తీరాన అక్షర కెరటాలు



జనవరి 22 నుంచి 26 వరకు కేరళ లిటరరీ ఫెస్టివల్ కోళికోడ్ (కాలికట్) నగరంలో సముద్రపు ఒడ్డున జరిగింది. ఈ ఉత్సవాన్ని ప్రముఖ మలయాళీ ప్రచురణకర్తలు డి.సి. బుక్స్ గత ఎనిమిదేళ్ళుగా నిర్వహిస్తున్నారు. ఈసారి అతిథి దేశంగా ఫ్రాన్స్‌ను ఆహ్వానించారు. సాహిత్యోత్సవంతో పాటుగా తొలిసారిగా ఈ ఏడాది ప్రచురణకర్తల సమావేశం (పబ్లిషర్ కాన్క్లేవ్) కూడా రెండు రోజుల పాటు ఏర్పాటు చేశారు. వారి ఆహ్వానం మేరకు, 'ఎలమి' ప్రచురణల నిర్వాహకురాలిగా నేను హాజరయ్యాను.

***

లిట్ ఫెస్ట్ అంటే– దేశీ విదేశీ రచయితలను, సాహిత్యకారులను, ప్రచురణకర్తలను, పాఠకులను కొన్ని రోజుల పాటు ఒక చోటకు తెచ్చే పుస్తకాల జాతర. పుస్తకాల అట్టల పైన పేరుగా మాత్రమే తెలిసిన రచయితలను పలకరించే అవకాశం ఇక్కడ కలుగుతుంది. ఎప్పటెప్పటి నుంచో తమ రచనల ద్వారా సోషల్ మీడియాలో 'ఫ్రెండ్స్'గా మారిన వారిని మొదటిసారి ఆలింగనం చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. తాజాగా అచ్చైన పుస్తకాలను ప్రమోట్ చేసుకోడానికి ఇవి మంచి వేదికలు.



కోటలు, హోటళ్ళు, ఐటీ పార్కులు, బీచులు – ఇలా రకరకాల ప్రాంగణాల్లో జరుగుతూ వేలల్లో, లక్షల్లో వచ్చే సందర్శకులని ఆకర్షిస్తాయి ఈ లిటరరీ ఫెస్టివల్స్. పుస్తకాలంటే ప్రాణం పెట్టే వారి సంఖ్య మరీ తక్కువేమీ కాదన్న సంగతిని గుర్తు చేస్తాయి. అన్ని లిటరరీ ఫెస్ట్‌లూ ఒకేలా అనిపించినా, ఆ హంగూ హడావిడీ కాస్త ఇబ్బంది కలిగించినా, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ప్రతి ఫెస్ట్‌కూ ఏదో ఒక ప్రత్యేకత ఉంది. 2012 నుంచి హైదరాబాద్, బెంగళూరు, జైపూర్ వంటి లిట్ ఫెస్టులకు వెళ్ళడం మామూలైపోయిన నన్ను ఈ కేరళ సాహిత్య ఉత్సవం కొన్ని విషయాల్లో అబ్బురపరిచింది.

"ఆసియాలో రెండో అతి పెద్ద లిటరరీ ఫెస్ట్" అన్న టాగ్‌లైన్‌కు తగినట్టే ఈ ఉత్సవానికి ఈ ఏడాది దాదాపు ఆరు లక్షల మంది సందర్శకులు వచ్చారు. అరేబియన్ సముద్రం ఒడ్డున ఇంతమంది సాహిత్యంలో పడిమునకలు వేయడాన్ని చూస్తే మనసు నిండిపోయింది. కేరళలో 1940లలో జరిగిన గ్రంథాలయోద్యమం వల్ల ఆ రాష్ట్రంలో పుస్తక పఠనం బలపడింది. ఇప్పుడు సామాన్యుల నుంచి సెలబ్రిటీల దాకా అందరూ పుస్తకాల పురుగులే. అందుకే అంతమంది జనం!

నన్ను బాగా ఆశ్చర్యపరచిన, ఆకట్టుకున్న విషయం మాత్రం అత్యధిక సెషన్లు మలయాళ భాష లోనే ఉండడం. మలయాళీ రచయితలకూ, పాఠకులకే ఇక్కడ పెద్ద పీట వేశారు. బుక్ స్టాల్‌లో కూడా 70 శాతం వరకూ మలయాళీ పుస్తకాలే ఉన్నాయి. పోస్టర్లు, పాంఫ్లెట్లు, వేదికల పేర్లు... ఇలా అన్ని చోట్లా మలయాళానిదే హవా! ఆఖరుకి అతిథులుగా వెళ్ళిన మాకు ఇచ్చిన గిఫ్ట్ హాంపర్‌లో కూడా ఇతర గిఫ్టులతో పాటు ఒక మలయాళంలో ఉన్న కాలెండరు, వార పత్రిక ఇచ్చారు.

ఇలాంటి సాహిత్య ఉత్సవాలకు విదేశీ రచయితలు రావడం పరిపాటే! ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నవారిని పిలుస్తారు. కేరళ లిట్ ఫెస్ట్‌కు జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, బల్గేరియా దేశాల నుంచి రచయితలతోపాటు, వారిని ఆంగ్లంలోకి అనువదించిన వారూ వచ్చారు. అంతేగాక ఆ రచయితలు రాసిన పుస్తకాల మలయాళ అనువాదాలను ఈ సభల్లో వారి సమక్షంలోనే విడుదల చేయడం గొప్పగా అనిపించింది. భారతీయ భాషల్లోకి విదేశీ రచనలు అనువాదం అవ్వడమే అరుదు. అలాంటిది ఆ రచయిత సమక్షంలోనే అనువాదం ఆవిష్కరణ జరగటం ఇంకా అపురూపం.

"ఆసియాలో రెండో అతి పెద్ద లిటరరీ ఫెస్ట్" అన్న టాగ్‌లైన్‌కు తగినట్టే కేరళ లిటరరీ ఫెస్టివల్‌కు ఈ ఏడాది దాదాపు ఆరు లక్షల మంది సందర్శకులు వచ్చారు. అరేబియన్ సముద్రం ఒడ్డున ఇంతమంది సాహిత్యంలో పడిమునకలు వేయడాన్ని చూస్తే మనసు నిండిపోయింది. కేరళలో 1940లలో జరిగిన గ్రంథాలయోద్యమం వల్ల ఆ రాష్ట్రంలో పుస్తక పఠనం బలపడింది. ఇప్పుడు సామాన్యుల నుంచి సెలబ్రిటీల దాకా అందరూ పుస్తకాల పురుగులే. అందుకే అంతమంది జనం!

***

ఈ ఫెస్టివల్లో భాగంగా 'ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ ఇండియా', 'ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫీసు' సంయుక్తంగా రెండు రోజులపాటు ప్రచురణకర్తల సమావేశాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఇండియాలో ఫ్రెంచ్ రాయబారి హెచ్.ఈ. థియరీ మథౌ; ప్రముఖ కవి, రచయిత కె. సచ్చిదానందన్; బుక్ బ్రహ్మ వ్యవస్థాపకులు సతీష్ చప్పరికె అతిథులుగా వచ్చారు. ఫ్రాన్స్ నుంచి గల్లీమార్డ్ వంటి పెద్ద సంస్థలు, లిటరరీ ఏజెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, మరాఠీ, ఇంగ్లీష్ భాషల ప్రచురణకర్తలు కూడా పాల్గొన్నారు.

మన దేశంలో పుస్తకాలకు, అనువాదాలకు ఎలాంటి మార్కెట్ ఉందన్న దానిపై ఈ సమావేశాల్లో చర్చ జరిగింది. ఇతర దక్షిణాది భాషలతో పోల్చుకుంటే తెలుగులో అమ్మకాలు తక్కువ గానే ఉన్నాయి. పుస్తకాల డిస్ట్రిబ్యూషన్ సమస్యలను దాదాపు అందరూ ప్రస్తావించినా ఒక్కో భాషలో ఆ సమస్యల తీవ్రత ఒక్కోలా ఉన్నది అనిపించింది. ప్రచురితమైన పుస్తకాలకు ఐ.ఎస్.బీ.ఎన్ కోడ్ ఉపయోగించకపోవడం వల్ల అసలు ఎన్ని పుస్తకాలు వెలువడుతున్నాయి అన్నది లెక్కలకు అందడం లేదు. అలానే, రచయితలకు ప్రచురణకర్తలకు మధ్య సరైన రాతపూర్వక అగ్రిమెంట్లు లేకపోవడంవల్ల అనువాదాలు చేయించేటప్పుడు వచ్చే గందరగోళాలు ప్రస్తావనకు వచ్చాయి.

ఫ్రాన్స్ వారు తమ దేశంలో పుస్తకాలు, అనువాద రచనల పరిస్థితి ఎలా ఉందో చెప్పుకొచ్చారు. మనతో పోల్చుకుంటే వారిది ఎక్కువ ఆర్గనైజ్డ్ మార్కెట్ అనిపించింది. ఉదాహరణకి– అక్కడ సెకండ్ హాండ్ పుస్తకాల అమ్మకాలు ఎంత పెద్ద మార్కెట్టో లెక్కలతో సహా చూపించారు. (ఇండియాలో పాత పుస్తకాల షాపుల విషయంలో ఇలాంటి గణాంకాలు అసాధ్యం.) వాళ్ళ పుస్తకాల అమ్మకాల సంఖ్య కూడా ఆశాజనకంగా ఉంది. ముఖ్యంగా అనువాద పుస్తకాలకు కూడా మార్కెట్ బాగుందని చెప్పారు.

***

తెలుగు నుంచి ఫ్రెంచ్ లోకి అనువాదాలు వెళ్ళాలన్నా, అక్కడ నుంచి ఇక్కడకి అనువాదాలు రావాలన్నా మనం – వ్యక్తులుగా, సంస్థలుగా – చేయవలసిన పనులు, గమనించుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి.

రచయితలు తమ పుస్తకాలను ప్రచురణకు ఇచ్చేటప్పుడు రాతపూర్వక అగ్రిమెంట్లు ఉండేటట్టు చూసుకోవాలి. వాటిలో తమ రచనల అనువాద హక్కులకు ఆయా ప్రచురణకర్తలు ప్రాతినిధ్యం వహించేలా అనుమతి ఇస్తే తెలుగు రచనలను ఇలాంటి వేదికలపైకి తీసుకువెళ్ళి మాట్లాడ్డానికి వీలవుతుంది. లిటరరీ ఫిక్షన్ ప్రచురించే ఫ్రెంచ్ ప్రచురణకర్తలు తమ పాఠకులకు తెలియని కొత్త రచయితను ప్రచురణకు ఎంచుకునేటప్పుడు వారి కథలను కాకుండా నవలలనే ఎంచుకుంటామని చెప్పారు. నవలల తోపాటు మహిళల జీవితాలను ప్రతిబింబించే ఆత్మకథనాలపై కూడా ఆసక్తి చూపారు. బాల సాహిత్యం (ముఖ్యంగా బొమ్మల పుస్తకాలు), యంగ్ అడల్ట్ ఫిక్షన్ కూడా వారు తీసుకోడానికి ఇష్టపడుతున్నారు.

ఈ సమావేశానికి తెలుగు నుంచి ఎలమి ప్రచురణలు, ఛాయా బుక్స్ హాజరయ్యాయి. పోయిన ఏడాది జరిగిన బుక్ బ్రహ్మ లిటరరీ ఫెస్టివల్లో కేవలం భారతీయ ప్రచురణకర్తలం మాత్రమే సమావేశమయ్యాం. ఈసారి అంతర్జాతీయ ప్రచురణ సంస్థలతో కలిసి మాట్లాడే అవకాశం చిక్కింది. మన సాహిత్యం వైపు ఈ ప్రచురణకర్తలు ఆశగా చూస్తున్నారని అర్థమైంది. మన రాజకీయ సామాజిక పరిస్థితులు, అందులోంచి పుట్టుకొస్తున్న సాహిత్యం గురించి చక్కగా 'పిచ్' చేయగలిగితే మనకీ అవకాశాలు వస్తాయి. వాళ్ళ పుస్తకాలను మనం అనువాదం చేయాలంటే కాపీరైట్లు, రాయల్టీ ఖర్చులు చూసుకోవాలి. కొన్ని ప్రాజెక్టులకు గ్రాంట్స్ ఉన్నాయి. అవి మంజూరు అయితే ప్రచురణకర్తలపై భారం తగ్గుతుంది.

ఇక భాషలు నేర్చుకునే ఆసక్తి ఉన్నవారు ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్ లాంటి యూరోపియన్ భాషలు నేర్చుకోగలిగితే అనువాద అవకాశాల్ని చేజిక్కించుకోవచ్చు. ప్రచురణకర్తలకు ఇచ్చే గ్రాంట్స్ కన్నా అనువాదకులకు గ్రాంట్స్ కాస్త ఎక్కువగా ఉన్నట్టు అనిపించాయి. మూల భాష నుంచి నేరుగా అనువాదం చేయగలిగే వారికి ఎప్పుడూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. అయితే, తెలుగు–ఫ్రెంచ్ లేదా ఫ్రెంచ్–తెలుగు నుంచి చేయదగిన పుస్తకాల సంఖ్యతో పోల్చుకుంటే ఈ రెండు భాషల్లో ప్రావీణ్యత ఉన్న అనువాదకులు తక్కువ కాబట్టి, మధ్యే మార్గాన ఇంగ్లీషు నుంచి చేసే అనువాదాల పట్ల కూడా ఈ ప్రచురణకర్తలు సుముఖంగానే ఉన్నారు.

"దేశ విదేశ భాషల్లో మన సాహిత్యం ఎందుకు వెళ్ళడం లేదు?" అంటూ ఆవేశపూరితమైన ప్రశ్నల దగ్గర ఆగిపోకుండా, ఎలాంటి అవకాశాలు ఉన్నాయో తెలుసుకుని, వాటి కోసమై రచయితలు, అనువాదకులు, ప్రచురణకర్తలు కలిసి పని జేస్తే ఫలితాలు కనిపించవచ్చు.

■ పూర్ణిమ తమ్మిరెడ్డి
purnimat07@gmail.com

ముద్దులు

ఏటొడ్డున గులాబి వన్నెలో పూసే సముద్ర పాలాకు పూలు. ఒంకిని గుంటలో విరిసే తెల్ల తామరలు నీకు ముద్దు.

తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతరలో
తీసిచ్చిన బంగారు చుక్కల నీలపు మట్టి గాజులు. నాయుడుపేటలో కొన్న రవ్వలంత అద్దాలు కుట్టిన చిలకపచ్చ రంగు కెంజాయ అంచు చున్నీ. తూపిలిపాళెం కడలొడ్డున అలలు మనల్ని దొర్లిస్తుండగా దొరికిన పాల తెలుపు చిన్న శంకు నీకు ముద్దు.

నా చేతిపైన మనిద్దరి పేర్ల తొలి అక్షరాల పచ్చబొట్టు. నా ఎడమ చెవికి పెట్టుకున్న తెల్లరాయి పుడక. జడల్లి పూలు పెట్టేదా అంటూ మెడదాకా పెంచుకున్న నా జుట్టులో వేళ్లు జొనిపి సుకుమారంగా గుంజడము. గూడూరు సుందరమహల్లో కలిసి చూసిన చంటి సినిమా ఇలా అప్పట్లో నీకు మన కలయికలోని ప్రతి ఒకటీ ముద్దు.

ఒక నా పుట్టినరోజు సాయంత్రం నుదుటన నువ్విచ్చిన చిన్నప్పటి మా అమ్మ ముద్దు. ఆ రాత్రి చీకటిలో ఏటి ఇసుకపైన నీ నిలువు పెదాలను నా పెదాలకు అప్పగించిన ముద్దు.

రేపట్నుంచి నీకు కనబడనంటూ వెక్కిళ్లతో – గుండెలు పగిలిన కట్టెకు నువ్విచ్చిన చితి కౌగిలి ముద్దు.

కలలన్నీ బూడిదై చివరికి మిగిలిన ఒంటూపిరి బతుక్కి. నీ తలపోతల తపనలే కన్నీటి జడిలో విరిసి మెరిసే వానవిల్లు ముద్దు.

■ ఫిరోజ్ చిగురుపాటి

స్త్రీని మించిన ఇతివృత్తం లేదు

తెలుగులో ఉత్తరాంధ్ర సాహిత్యానికి ప్రత్యేకమైన విభిన్నత ఉంటుంది. ఈ ప్రాంత భౌగోళికతకు, జీవన విధానానికి కొంత సంఘర్షణ ఎక్కువ. ఆ సంఘర్షణను, ఆర్తిని కవితా వాహికగా నిబద్ధతతో వెల్లడిస్తున్న రచయితల్లో **సాంబమూర్తి లండ** ఒకరు. కవిత్వం పట్ల ఆయన దృక్పథాన్ని, జీవితాన్ని యుద్ధానికి ఉపమానంగా వాడడం వెనుక ఉన్న భావనని ఆయన మాటల్లోనే తెలుసుకొందాం.



మీ కుటుంబ నేపథ్యం గురించి, సాహిత్య ప్రేరణల గురించి చెప్పండి?

నిజానికి మేం సముద్రం పిల్లలం (మత్స్యకార సామాజిక వర్గం). కానీ, నాన్నకు ముందు మూడు తరాలుగా మట్టితో అనుబంధం పెంచుకున్న దిగువ మధ్యతరగతి కుటుంబం. మార్క్స్‌ను చదివిన పోతన నాన్న. అప్పట్లో మాది రెండున్నర ఎకరాల జీడిమామిడి, కొబ్బరి, పనస, మునగ తోటల ఉద్యానవనం. టీచర్‌గా ఉద్యోగం వచ్చినా ఎమ్మెస్సీ చదువుకుంటానంటే కాదనలేనంత ఇష్టం నాన్నకు చదువు మీద.

బాల్యంలో లాంతరు వెలుగుల మధ్య నాన్న చదివి వినిపించిన కాల్పనిక సాహిత్యం నాలో అక్షరాల్ని విత్తాయి. ఆ విత్తనాలు ఉత్తరాంధ్ర బతుకు విధ్వంస ప్రతిఘటనకు దారి చూపాయి. అమ్మ మిగిల్చిపోయిన ఖాళీ తక్షణం నన్ను అక్షరంగా మలిచింది. 'గాజు రెక్కల తూనీగ', 'నాలుగు రెక్కల పిట్ట', 'ఆమెకు మిగలని ఆమె' కవితా సంపుటాలుగా ఇప్పటికి మూడు ఆకులు తొడిగాను. పగళ్లు స్కూల్లో పిల్లలకు పాఠాలు చెబుతూ... రాత్రులు కళ్ళల్లో దివిటీలు వెలిగించుకుని నన్ను నేను వాక్యాలుగా అనువదించుకోవడం మొదలై ఎనిమిదేళ్ళు.

కవిత్వాన్ని మీరు ఎలా నిర్వచించుకుంటారు?

నది ఇంకిన చోట ఒక తడి మేఘపు వాగ్దానం కవిత్వం. జడత్వం నిండిన కాలం ముఖం మీద నీళ్ళు కుమ్మరించి మేల్కొలిపే బాధ్యత. భయంతో నాలుకలన్నీ పిడచగట్టుకు పోయినపుడు నిశ్శబ్దాన్ని చీల్చుకుని మొలకెత్తే చైతన్యపు విత్తు. కవిత్వమంటే అదృశ్య సముద్రం మీద వేట. కనబడని అరణ్యంలో కావాలనే తప్పిపోయి, భుజానికి ఒక వాక్యాన్ని తగిలించుకుని ఇల్లు చేరడం.


మీ కవిత్వ శీర్షికలలో ఎక్కువగా 'రెక్కల' ప్రస్తావన ఎక్కువ ఉంటుంది, ఎందుకు?

బాల్యంలో ఇంటికీ బడికీ ఇంచుమించు కిలోమీటర్ దూరం. పదోతరగతి వరకూ కాళ్ళు దిగబడే ఇసుకదారిలో రోజుకు నాలుగుసార్లు నడవాల్సి వచ్చేది. అప్పుడంతా చేతుల్ని రెక్కల్లా ఊపుకుంటూ ఎగురుతున్నట్టు కలలొచ్చేవి. రెక్కలమీద ప్రేమ అలా మొదలైందేమో. రెక్కలు అన్నవి నా బాల్యం నాకిచ్చిన శైలీ ముద్ర అనుకోవచ్చేమో మరి.

మీ రచనల్లో జీవితం మీద యుద్ధం చెయ్యాలనే స్ఫూర్తి ఎక్కువగా కనపడటానికి కారణం మీరు టీచర్ కావటం అనుకోవచ్చా?

ఇప్పుడున్నదంతా సంక్షుభిత కాలం. వచ్చేది ఎడతెగని విధ్వంస రుతువు. మనుషుల మధ్య అనుబంధాలను చంపేస్తున్న గ్లోబలైజేషన్, వ్యక్తిగత జీవితాల్లోకి చొచ్చుకు వచ్చిన సోషల్ మీడియా, అన్నింటా పెరిగిన వేగం... వంటి అనూహ్యతల వల్ల మనిషి సహజ సున్నితత్వాన్ని కోల్పోయి అతి సున్నితత్వానికి చేరుకొంటున్నాడు. ఇది సున్నితత్వం లేకపోవడం కంటే ప్రమాదం. అటువంటపుడు ఎవరైనా యుద్ధాన్నే బోధించాలి. తెలంగాణాలో ఇంటర్ పిల్లల ఆత్మహత్యల నేపథ్యంలో 'ఇంకొంచెం యుద్ధాన్ని ప్రేమించు', చిన్నవిషయాలకే కలత చెందే నేటి అమ్మాయిలకు 'యుద్ధం నాకు కొత్తకాదు' వంటి కవితలు రాశాను. దీని వెనుక నాలోని టీచర్ కంటే మానసిక సన్నద్ధత కోసం అక్షరాల్ని వాడే రచయిత ప్రభావమే ఎక్కువ ఉందనుకొంటాను.

పొద్దున లేచిన్నుంచీ తిరిగి కళ్ళు మూతలు పడే దాకా ఎందరో స్త్రీలు కనుపాపల మీదుగా నడిచిపోతుంటారు. ఊరికే నడిచిపోరు. కనుపాపల మీద లోతైన గాయాలను మిగిల్చిపోతారు. అనేకానేక స్త్రీల ఒకానొక ప్రతిఫలనం 'ఆమెకు మిగలని ఆమె'. జీవితంలో ఇప్పటివరకూ నాకు తారసపడిన ప్రతి నీడకూ అక్షరాలతో బొమ్మ కట్టాలని చూసాను.



మీ మూడో కవితా సంపుటిగా వెలువరించిన 'ఆమెకు మిగలని ఆమె' గురించి చెప్పండి?

పొద్దున లేచిన్నుంచీ తిరిగి కళ్ళు మూతలు పడే దాకా ఎందరో స్త్రీలు కనుపాపల మీదుగా నడిచిపోతుంటారు. ఊరికే నడిచిపోరు. కనుపాపల మీద లోతైన గాయాలను మిగిల్చిపోతారు. అనేకానేక స్త్రీల ఒకానొక ప్రతిఫలనం 'ఆమెకు మిగలని ఆమె'. జీవితంలో ఇప్పటివరకూ నాకు తారసపడిన ప్రతి నీడకూ అక్షరాలతో బొమ్మ కట్టాలని చూసాను.

ఈ కవితా సంపుటి మొత్తం స్త్రీ కేంద్రంగా రాయడానికి కారణం?

ఏ స్థల కాలమాన పరిస్థితుల్లోనైనా ఆమె బాధిత. గాయాలతో అవమానాలతో అనుమానాలతో సంకెళ్ళతో వున్న ఆమె రూపం ప్రతిసారీ గుండెను ఛిద్రం చేస్తూనే వుంటుంది. ఎప్పుడూ ఆమెను ఓడించాలని చూసే ప్రపంచాన్ని ఎలా ఇష్టపడతాను? వాక్యాల్ని పట్టుకుని ఎదురు నిలబడ్డాను. ఆమె విషయంలో జరుగుతున్నదంతా అన్యాయమేనని చేస్తున్నదంతా నమ్మకద్రోహమేనని చెప్పాలనుకున్నాను.

జీవితంలో తారసపడ్డ స్త్రీలు నన్ను మరింత సున్నితంగా మార్చకపోతే బహుశా ఈ ప్రత్యేక సంపుటి లేదు. సమాజంలో ఇప్పటికీ ఆమె ద్వితీయ శ్రేణి పౌరురాలిగానే పరిగణించబడడాన్ని జీర్ణించుకోలేను. మొగ్గల నుండి రేపో మాపో రాలిపోయే పువ్వుల దాకా జరుగుతున్న లైంగికదాడులు, అత్యాచార పర్వాలు, నగ్న ఊరేగింపులు సిగ్గుతో తలదించుకునేలా చేస్తాయి. సమాజంలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలు నిర్ఘాంతపరుస్తాయి. స్త్రీని దేవతను చేసి కూర్చోబెట్టి రాజ్యాలను ఏలుకునే కుట్రలను బద్దలు కొట్టాలనిపిస్తుంది. కవిత్వంలో ఓల్గా, కొండేపూడి నిర్మల, మహెజబీన్‌ల నుండి అందుకున్న ప్రేరణ వుంది. స్త్రీకి మించిన విశాల ఇతివృత్తం లేదు.

ఉత్తరాంధ్ర కవిత్వ నేపథ్యంలో మీ కవిత్వాన్ని ఎలా చూస్తారు?

నా ముందూ నా తర్వాతా సాగే యుద్ధానికి మధ్యలో కొనసాగింపు కావాలి నేను. పదే పదే కట్లు తెంపుకుని చేను మీద పడుతున్న పశువుల మందతో ప్రమాదం ఎప్పుడూ పొంచే ఉంటుంది. బతుకుల్ని చెరిపేయడానికి ఒక తుఫాను ఎప్పుడూ ప్రణాళికలు రచిస్తూనే వుంటుంది. తీరంలో ప్రమాద హెచ్చరికలా నిలబడాలి. ఆ దిశగానే సాగుతున్నాను. ఈ ప్రయాణంలో ఒంటరిని కాదు. మా ముందుతరం దీపధారై నడుస్తోంది. ప్రతిభ, అధ్యయనం, సొంత గొంతూ వున్న వర్తమానతరం వారసత్వాన్ని రెండు చేతులతో అందుకుంది. ఉత్తరాంధ్ర కథకులు, కవులలో ప్రక్రియ, శైలీ, శిల్పం వేరు వేరు కావచ్చు. కానీ వారు చిత్రించే కళింగాంధ్ర సాహితీ ఆత్మ మాత్రం ఒక్కటే. ఈ నేలలో పుట్టిన ఏ కవీ కథకుడూ నిద్రపోవడానికి లేదు. నిరంతరం మెలకువగానే ఉండాలి.

ఇంటర్వ్యూ ■ సారిపల్లి నాగరాజు, బి. మదన మోహన్ రెడ్డి
✆ 80083 70326

ముగ్గురు కవుల సప్తతి సభలు

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో ఫిబ్రవరి 16 ఉదయం 10గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో కందుకూరి శ్రీరాములు, నందిని సిద్ధారెడ్డి, నాళేశ్వరం శంకరం... ఈ ముగ్గురు కవుల సప్తతి సభ జరుగుతుంది. ముఖ్య అతిథి దేశపతి శ్రీనివాస్. సభలో కొండపల్లి నీహారిణి, బైస దేవదాస్, మామిడి హరికృష్ణ, దేవి ప్రసాద్ నరేష్ చారి తదితరులు పాల్గొంటారు.

బెల్లంకొండ సంపత్ కుమార్.

భూతపురి సాహిత్య పురస్కారం

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 88వ జయంతి సందర్భంగా 23వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఫిబ్రవరి 16 ఉదయం 10 గంటలకు సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో జరుగుతుంది. పురస్కార గ్రహీత పుత్తా పుల్లారెడ్డి రూ.10,116 నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను స్వీకరిస్తారు. సభకు అధ్యక్షుడు జి. విశ్వనాథ కుమార్, ముఖ్య అతిథి కె. కృష్ణారెడ్డి, ప్రధానవక్త శలాక రఘునాథ శర్మ

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి

కళింగాంధ్ర కవితలకు ఆహ్వానం

కళింగాంధ్ర కవుల కవిత్వంతో సిక్కోలు బుక్ ట్రస్ట్ తెస్తున్న వార్షిక సంచిక కోసం ప్రింట్ లేదా ఆన్‌లైన్ పత్రికలలో 2024లో ప్రచురితమైన తమ కవితలలో నచ్చిన రెండు కవితలను ఈమెయిల్: sikkolu books@gmail.com లేదా వాట్సాప్: 99892 65444కు ఫిబ్రవరి 20 లోగా పంపాలి. వార్షిక కవితా సంకలనంతో పాటు కళింగాంధ్ర కవుల డైరక్టరీని కూడా ప్రచురిస్తున్నందున వర్తమాన కళింగాంధ్ర కవులు పేరు, ఫోన్ నెంబర్లను నమోదు చేసుకోవలసిందిగా విజ్ఞప్తి.

సిక్కోలు బుక్ ట్రస్ట్

కథలకు ఆహ్వానం

నవమల్లెతీగ సాహిత్య మాసపత్రిక 18వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా తెస్తున్న కథల ప్రత్యేక సంచిక కోసం ఎ4 సైజులో 3–4 పేజీల కథలను ఫిబ్రవరి 27లోపు యూనికోడ్ లేదా డీటీపీతో పంపాలి. ఈమెయిల్: malleteega@gmail.com, చిరునామా: నవమల్లెతీగ మాసపత్రిక, 6164, టి.ఎఫ్–1, శుభశ్రీ టవర్స్, ఉయ్యూరు జమీందారు స్ట్రీట్, గాంధీనగర్, విజయవాడ–520003. ఫోన్: 92464 15150.

కలిమిశ్రీ

ఇవి హృదయం లెక్కలు



తాటిశెట్టి రాజు గారి 'ఏకాంతం' కవితను ఇటీవలి నా ప్రియపద్యంగా విశ్లేషణకు ఎంచుకున్నాను. ప్రేమలో ఉండే స్వచ్ఛత, నిజాయితీతో కూడిన కవి భావ ప్రకటన... అదే ఈ కవిత ఆకట్టుకోడానికి ముఖ్య కారణం. ఈ కవితలో మొదటి మూడు స్టాంజాలు మూడ్‌ని రిఫ్లెక్ట్ చేసే వాతావరణాన్ని వర్ణిస్తే, తర్వాతి పేరాలు కవి భావనని తెలియ జేస్తాయి. మన మనసుని బట్టే చుట్టూ వాతావరణం కనిపిస్తుంది. నిజానికి ఏది చీకటి? ఏది వెలుగు? ప్రతీదీ మన భాష్యమే! ప్రతీదీ మన అన్వయమే! మన అనుభూతులు మనతో ఆడుకునే ఆటల దృశ్యాలే అన్నీ!

ప్రేమ ఒక వరము, ఒక శాపము. ఆశించడం, ఆక్రోశించడం జీవితంలో భాగాలు. ప్రేమతో నిండిన హృదయానికి, బండబారినపోయిన లోకం తీరు, దాని లెక్కలు ఒక మింగుడుపడని విషయం. అందుకే ప్రేమలో ఓడిపోయినా సరే, హృదయానికే పెద్ద స్థానమిచ్చి, ఓడినా ప్రేమదే గెలుపని చెప్పాడు కవి. ప్రేమ కలిగిన మనసు స్వచ్ఛమైనది. ఆ మనసు నుండీ పుట్టే దుఃఖాలు, వ్యథలు, కన్నీళ్ళు, కవిత్వాలు ఏవైనా సరే స్వచ్ఛమైనవీ, అర్థవంతమైనవీ, విలువైనవి!

బంధం రెండు హృదయాలను కలిపే వంతెన. అది విఫలమై, ఒంటరైన హృదయంలో ప్రేమ అనాథ, బిచ్చగత్తె! లేదా లాభనష్టాల బేరీజు లోకంలో ప్రేమ దిక్కులేని అనాథ! రెండు హృదయాల మధ్య తాళ గతులు తప్పితే పొసగని బంధాలలో ప్రేమ అనాథ! మనిషి చుట్టూ ఉండే రకరకాల పరిస్థితులతో, ప్రేమకివ్వలేని విలువతో ప్రేమ అనాథ!

ప్రేమను కోల్పోయాక మళ్ళీ ప్రేమ కోసమే పరితపిస్తాడు మనిషి. అలా ప్రేమ వెతుకులాటలో మనుషుల స్వభావాల గురించి గమనింపులేనితనంలోనో, లేదా రెండు మనసుల మధ్య సామరస్యం కుదరకో పొలమారటం, పోగొట్టుకోవటం జరిగిపోతాయి. తిరిగి మరో ప్రేమ కోసమో, భరోసా కోసమో వెతుకులాట మొదలవుతుంది.

అంతులేనంత ప్రేమతో ఈ ప్రపంచం నిండి ఉంది. ఎన్నో బంధాలు మనిషిని పెనవేసుకునే ఉన్నాయి. అయినప్పటికీ తనకి తాను మాత్రమే మిగిలే ఒంటరితనం మనిషిని వెంటాడుతూనే ఉంటుంది, చివరికి ఆ ఒంటరితనమే మిగులుతుంది చాలాసార్లు. ఇదే తాత్వికతతో ఈ కవిత ముగుస్తుంది.

■ రాళ్ళబండి శశిశ్రీ
✆ 74163 99396



ప్రియ పద్యం

ఏకాంతం

కిటికీ లోంచి వచ్చి పడుతున్న చీకటితో
గదిలో గుడ్డిదీపం తగాదా పడుతోంది

దూరంగా ఎక్కడో కురుస్తున్న వర్షాన్ని
వెక్కిరింతగా మా ఊరికి ఉరుమి చెప్తోంది నింగి
పగటిపోరాటంలో గెలవలేని ఓ బక్కకుక్క
రాత్రి చీకట్లో పౌరుషంగా రంకెలేస్తోంది
వీధిలో ఒంటరిగా

లాభనష్టాలు లోకం లెక్కలు
ప్రేమ – విరహం హృదయానివి

ప్రేమలో ఓడిపోనీ
అది లోకంలో విజయాలన్నిటి కంటే విలువైనది


ఒట్టి వ్యథ, దుఃఖం, కన్నీళ్ళు, కవిత్వం
ప్రేమ వల్ల అర్థవంతమయ్యాయి

ప్రేమకోసం లోకంలో వెతుకుతున్నావా?
పాపం అది ప్రేమలో అనాథ బిచ్చగత్తె

పొలమారి గొంతు అడ్డం పడ్డప్పుడు
అన్నీ నీళ్ళ కుండలుగానే తోస్తాయి
లోపల ప్రేమ పొలమారినప్పుడే
మనసు మరో మనసు కోసం తడుముకుంటుంది

వచ్చిపోయే వలసపక్షుల గుడారం–చెట్టుకి
దాని నీడ మాత్రమే తన శాశ్వత తోడని
ఎవరూ చెప్పనక్కర్లేదు

■ తాటిశెట్టి రాజు





కాళేశ్వరంలో యాగశాలలో హోమం నిర్వహిస్తున్న దేవ పండితులు, ఆలయ గోపురంపై పూజలు చేస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి

హర హర.. మహాదేవా.. శంభో శంకర.. అని దిక్కులు పిక్కటిల్లాయి. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం పరిసరాలు భక్తుల జయ జయ ధ్వానాలతో మారుమోగాయి. నాలుగు దశాబ్దాల తర్వాత జరిగిన మహా కుంభాభిషేకం కన్నుల పండువగా సాగింది. మూడురోజుల పాటు సాగిన ఈ మహా క్రతువు అత్యంత భక్తి శ్రద్ధలతో సాగింది. చివరి రోజు ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని తుని శృంగేరి పీఠానికి సంబంధించిన తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా ప్రధాన ఘట్టం జరిగింది. ఆలయ గోపురంపై గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమం జలాలతో వేద పండితుల మంత్రోచ్ఛరణాల నడుమ అభిషేకం నిర్వహించారు. ఈ మహా ఘట్టానికి మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు, రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హాజరయ్యారు. పెద్దఎత్తున భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు.

- మహదేవపూర్(ఆంధ్రజ్యోతి)



కుంభాభిషేకానికి పవిత్ర జలాన్ని తీసుకెళ్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి శర్మ

హరోం హర..

కాళేశ్వరాలయంలో వైభవంగా మహా కుంభాభిషేకం

- మూడు రోజులపాటు కన్నుల పండువగా వేడుకలు
- ఆదివారం ప్రధాన ఘట్టంతో ముగింపు
- శృంగేరి తపోవన పీఠాధిపతి సచ్చిదానందతో మహా క్రతువు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- హాజరైన మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్
- శివనామస్మరణతో మార్మోగిన దేవాలయ ప్రాంగణం

7



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రూ.వెయ్యి కోట్లతో 'స్టేషన్‌ఘనపూర్' అభివృద్ధి

- రూ.800కోట్ల నిధులు ఇప్పటికే మంజూరు
- పరిశీలనలో రూ.200కోట్ల పనులకు ప్రతిపాదనలు
- కోడ్ ముగియగానే సీఎంతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- చేతగానివారు నాపై విమర్శలు చేస్తున్నారు..
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7

బీసీలకు అన్యాయం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభాను తగ్గించి బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. అదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మత్రి కేటీఆర్ నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వినయ్‌బాస్కర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు. అనంతరం దాస్యం వినయ్‌బాస్కర్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు బొంగు అశోక్‌యాదవ్, చెన్నం మధు, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినికాంత్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, ఉడుతల సారంగపాణి, సీనియర్ నాయకులు సుంచు కృష్ణ, నార్లగిరి రమేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మో'డల్' బస్టాండ్!

హనుమకొండ మల్టీపర్పస్ మోడల్ బస్‌స్టేషన్ పనుల ఊసేది?

6

శవాలపై వసూళ్లు!

ఎంజీఎం మార్చురీలో పైసల వేట



- మరణాన్ని బట్టి రేటు నిర్ణయిస్తున్నవైనం
- ముక్కుపిండి వసూలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది
- అనాథ శవాల అవయవాలను వి క్రయిస్తున్నట్లు ఆరోపణలు
- వైద్య ఉన్నతాధికారులు పట్టించుకోవాలని బాధితుల విజ్ఞప్తి

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో మృతదేహాలకు పరీక్షలు నిర్వహించే పోస్టుమార్టం ప్రక్రియలో పైసల వేట యథేచ్ఛగా కొనసాగుతోంది. రోడ్డు ప్రమాదాల నుంచి మొదలుకొని ఆత్మహత్యలకు పాల్పడే వారి మృతదేహాలకు చట్టప్రకారం ఈ పరీక్షలు తప్పనిసరి. ఇదే ఇక్కడి సిబ్బందికి వరంగా మారింది. ఇంకేముందీ.. కేసుకో రేటు చొప్పున వసూలు చేస్తూ బంధువులను పీడిస్తున్నారు. ఈ క్రమంలో పోస్టుమార్టం సిబ్బంది చేస్తున్న వసూళ్ల పర్వంపై ఆంధ్రజ్యోతి 'ప్రత్యేక పోస్టుమార్టం'.

కేసుకో రేటు

వరంల్ నగరం చుట్టుపక్కల ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా.. ఆత్మహత్యలు జరిగానా.. హత్యలు, అనుమానాస్పద మరణాలు జరిగినా అలాంటి మృతదేహాలకు పోస్టుమార్టం తప్పనిసరి. చట్ట ప్రకారం పోలీసులు పోస్టుమార్టం నివేదికను పరిగణలోకి తీసుకుని కేసును విచారిస్తారు. అయితే మార్చురీ సిబ్బంది, వైద్యులు దీనినే అవకాశంగా తీసుకుంటున్నారు. మృతుల ఏడుపులు, పెడబొబ్బలు, కేకలు వారికి కనబడవు. వారికి ఆ ఘటన తాలూకూ 'మూల్యం' కావాలి. ఇలాంటి కేసులను బట్టి రేటును నిర్ణయిస్తుంటారు. ఉరేసుకుంటే వేయి రూపాయలు, అనుమానాస్పద స్థితిలో మరణిస్తే రూ.2వేలు, మర్డర్ కేసుల్లో రూ.5వేలు, రోడ్డు ప్రమాదాల కేసులకు రూ.3వేల చొప్పున డాక్టర్‌కు ఇవ్వాలంటూ సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎదుటివారి ఆపదే ఇక్కడికి సిబ్బందికి ఆయుధంగా మారి కాసుల వేటకు కదం తొక్కుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అడిగినంత డబ్బు ఇవ్వకపోతే చుక్కలు చూపెడుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

అనాథ శవాలైతే అంతే..

అనాథ శవాల గుర్తింపు కోసం 75 గంటల పాటు ఫ్రీజర్‌లో భద్రపరుస్తారు. ఆ తర్వాత పోలీసుల పంచనామా అనంతరం ఖననం చేస్తారు. ఇక ఖననం చేసే సమయంలో పోలీసులు లేకపోతే ఆ శవాన్ని మాయం చేస్తారు. ప్రయివేట్ కళాశాలలకు రూ.50 నుంచి 60 వేలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ వెంట పోలీసులు ఉండి ఖననం చేయిస్తే మూడు నెలల తర్వాత ఆ గుంతను తోడి ఎముక గూళ్లను ప్రయివేట్ ఆస్పత్రులకు రూ.12వేలకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక మహిళల మృతదేహాల వెంట్రులను సైతం ముందే కత్తిరించి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. చనిపోయిన వ్యక్తుల దుస్తులు, ఇతర వస్తువులు క్షుద్రపూజలు చేసేవారు కూడా కొనుగోలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పాలసీలు ఉంటే భలే గిరాకీ

పాలసీలు ఉండి పోస్టుమార్టంకు వచ్చే మృతదేహాలతో వైద్యులు, సిబ్బందికి భలే గిరాకీ ఉంటున్నట్లు తెలుస్తోంది. రోడ్డు ప్రమాదంలో చనిపోయినప్పుడు.. ఒకవేళ చనిపోయిన వ్యక్తి ఆల్కహాల్ తీసుకొని ఉంటే ఇన్సూరెన్స్ వర్తించదు. కాబట్టి ఇన్సూరెన్స్ కోసం చాలామంది నాన్ ఆల్కహాలిక్ రాయమని ఇక్కడి సిబ్బందిని కోరుతారు. ముడుపులిస్తే రిపోర్టు మారుస్తామంటూ అభయహస్తం ఇస్తారు. ఐదు నుంచి పది వేల రూపాయల వరకు తీసుకొని నాన్ ఆల్కహాలిక్‌గా మారుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోస్టుమార్టం గదిలో కంపు

పోస్టుమార్టం ఆవరణలో మామూళ్ల కంపుతోపాటు శవాల కంపు కూడా విపరీతంగా కొడుతోంది. ఇక్కడ ఉన్న ఆరు ఫ్రీజర్లలో 11 మృతదేహాలను ఒకే సమయంలో భద్రపరిచే అవకాశం ఉంది. కానీ ఈ ఫ్రీజర్లన్నీ పనిచేయకపోవడంతో శవాలన్నీ కంపు కొడుతున్నాయి. మొత్తానికి మృతదేహాల కంపుతోపాటు మామూళ్ల కంపు కొడుతున్న పోస్టుమార్టంను ఉన్నతాధికారులు వెంటనే పోస్టుమార్టం చేసి పేద బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తుపాకులు మాయం

పోస్టుమార్టం అనుబంధంగా వైద్య విద్యార్థుల కోసం ఫోరెన్సిక్ మ్యూజియం ఉంటుంది. ఇందులో శరీరంలోని అవయవాలు, పోలీసు అనుమతితో ఉన్న తుపాకులు, బుల్లెట్లు ఉంచారు. ఆరు నెలల కిందట రెండు తుపాకులు, ఒక పిస్టల్, రెండు బోర్‌గన్స్ మాయమైనట్లు సమాచారం. అదే విధంగా వైద్య విద్య కోసం నిలువ చేసిన పిండాలు కూడా అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. ఇవన్నీ ఇటీవల వెలసిన ప్రైవేటు వైద్య కళాశాలలకు అమ్ముకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు ఆదివారం జాతరకు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. వివిధ జిల్లాల నుంచి భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన భక్తుల రాక ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు, కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకం జరిపారు. భక్తులు నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముతైదు సామగ్రిని ముట్టచెప్పారు. మరికొందరు మొక్కుల్లో భాగంగా రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవ విగ్రహాలను పెట్టి ఆలయం చుట్టూ లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మొక్కుల్లో భాగంగా రథం లాగుతున్న భక్తులు

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించను న్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

వరంగల్ కలెక్టరేట్ ప్రజావాణి రద్దు

వరంగల్ కలెక్టరేట్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, పరిపాలన పరమైన కారణాలతో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా ప్రజలు ఈ విషయం గమనించాలని కోరారు.

మాఢ వీదులకు ముహూర్తం

- భద్రకాళి చెరువులో ప్రారంభమైన రోడ్ల నిర్మాణం
- ఆలయాన్ని సందర్శించిన స్థపతులు, ప్లానర్ కన్సల్టెంట్లు
- పనులపై దృష్టి సారించిన కుడా అధికారులు

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువులో మాఢవీదుల పనులు ప్రారంభమయ్యాయి. నీటిని తొలగించిన అనంతరం గుడి వెనుక ప్రాంతం నుంచి గణపతి దేవాలయం కింది భాగంలో మట్టి తీసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భద్రకాళి అమ్మవారి మాఢ వీదులు, రాజగోపురాల నిర్మాణాలతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకోసం ప్రణాళికలను రూపొందించారు.

చేపట్టనున్న నిర్మాణాలు ఇవే..

లడ్డూ ప్రసాదం తయారు చేసే పోటు భవనం, దేవస్థానం పాలన విభాగం కార్యాలయం, భద్రకాళి చెరువులో ధ్యాన మందిరం, శ్రీభద్రకాళి వేద పాఠశాల, భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, చెరువు మధ్యలో భద్రకాళి హైల్యాండ్ నిర్మాణం, బోటింగ్ ఏర్పాటు, నిత్య అన్నదాన సత్రం, భక్తుల కోసం వసతి గృహాలు, వాహనాల పార్కింగ్, రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం మాఢ వీదులు, రాజగోపురాలతోపాటు ఇతర నిర్మాణాలను దేవాదాయ శాఖకు చెందిన స్థపతులు, ఉప స్థపతులు, ప్లానర్ కన్సల్టెంట్లు ఆలయాన్ని సందర్శించి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. ఈ విషయంలో కుడా అధికారులు సైతం దృష్టి సారించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కుడా చైర్మన్ ఆదేశాల మేరకు పనులు వేగవంతం చేయడానికి కసరత్తు చేస్తున్నారు.



భద్రకాళి చెరువులో మట్టిని రోడ్డు నిర్మాణం కోసం తీసుకొస్తున్న ట్రాక్టర్లు

రాష్ట్రంలో ఇదే మొదటిది..

రాష్ట్రంలో నాలుగు మాఢవీదులు, రాజగోపురాలు కలిగిన ఏకైక ఆలయంగా భద్రకాళి అమ్మవారి దేవాలయం చరిత్రలో నిలిచిపోనుంది. ఇప్పటి వరకు నాలుగు మాఢ వీదులు కలిగి ఉన్నది తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం మాత్రమే. నిత్యం కైంకర్యాలతో వాహన సేవలతో ఊరేగే శ్రీవారి ఉత్సవమూర్తుల వేడుకలను భక్తులు తిలకించి తన్మయత్వం పొందుతారు. అదే అనుభూతిని ఇక్కడ భక్తులకు అందించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కుడా నేతృత్వంలో మాఢ వీదులు, రాజగోపురాలు నిర్మాణానికి అనుమతులిచ్చి పనులు ప్రారంభించడానికి పచ్చ జెండా ఊపింది. రూ.30 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank

సమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

[illegible] ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) [illegible] ఫిబ్రవరి 20, 2025న ఇ-వేలం [illegible] ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం - https://gold.samil.in [illegible] మ.12:30 గం. నుండి మ.3:30 గం. [illegible]

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: [illegible]	
220062001396	[illegible]
220062001397	[illegible]
220062002039	[illegible]
220062002047	[illegible]
శాఖ పేరు: [illegible]	
069562011234	[illegible]
069562012491	[illegible]
శాఖ పేరు: [illegible]	
279962002367	అల్లాడి శ్రీధర గౌడ్
శాఖ పేరు: [illegible]	
220262000811	[illegible]
శాఖ పేరు: [illegible]	
221862002744	[illegible] చంద్రశేఖర్ రెడ్డి
221862002777	[illegible] చంద్రశేఖర్ రెడ్డి
శాఖ పేరు: [illegible]	
092062003317	[illegible]
092062010694	శంకర్ లాల్ చౌదరి
092062015019	[illegible]
శాఖ పేరు: [illegible]	
774162000060	[illegible]
శాఖ పేరు: [illegible]	
362962005774	[illegible] రంజిత్ కుమార్
362962005363	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్-[illegible]	
197462001232	[illegible]
శాఖ పేరు:హైదరాబాద్- [illegible] రోడ్	
720462000623	[illegible]

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: హైదరాబాద్ ప్రగతి నగర్ II	
457262000175	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- [illegible] నగర్	
111962002533	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్-[illegible]	
037062008351	[illegible]
శాఖ పేరు: [illegible]	
280062008615	[illegible]
శాఖ పేరు: [illegible]	
070362016792	[illegible]
శాఖ పేరు: [illegible]	
069662018529	[illegible]
శాఖ పేరు: [illegible]	
220562001048	[illegible]
శాఖ పేరు: [illegible]	
180562003754	[illegible]
శాఖ పేరు: [illegible]	
068962032445	[illegible]
068962032449	[illegible]
శాఖ పేరు: [illegible]	
220805001573	[illegible] చంద్రశేఖర్
శాఖ పేరు: [illegible]	
749262002342	[illegible] సదానందం యాదవ్
శాఖ పేరు: [illegible]	
068362016493	[illegible]
068362018250	[illegible]

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: రామచంద్రాపురం-మెదక్	
279505002507	ఎం సోమేశ్వర రావు
శాఖ పేరు: [illegible]	
069162022839	[illegible]
శాఖ పేరు: [illegible]	
221162001701	శ్రీకాంత్ రామగిరి
శాఖ పేరు: [illegible]	
363262001985	[illegible]
శాఖ పేరు: [illegible]	
280762000123	[illegible]
శాఖ పేరు: [illegible]	
132062003097	[illegible]
132062003248	[illegible]
శాఖ పేరు: [illegible]	
222462001102	[illegible] భీమరాయుడు
222462001154	[illegible] భీమరాయుడు
శాఖ పేరు: [illegible]	
131105014632	[illegible]
131162008754	[illegible]
131162020656	[illegible]
131105021425	[illegible]
131162022968	[illegible]
శాఖ పేరు: [illegible]	
164962000559	[illegible]
శాఖ పేరు: [illegible]	
253062001704	[illegible]

తేదీ:10.02.2025
ప్రదేశము : మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సూర్యాపేట, జనగాం, హన్మకొండ, జయశంకర్ (భూపాలపల్లి), మహబూబాబాద్, సిద్దిపేట్, సంగారెడ్డి, హైదరాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న (సిరిసిల్ల), జగిత్యాల, మహబూబ్‌నగర్, జోగులాంబ (గద్వాల్), నాగర్‌కర్నూల్, వనపర్తి, నిజామాబాద్, కామారెడ్డి.

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

నేటి నుంచి 21 వరకు పలు రైళ్లు రద్దు

కాజీపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నేపథ్యంలో విజయవాడ సెక్షన్‌లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 10 నుంచి 20 వరకు కాజీపేట-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ, భద్రాచలం రోడ్-విజయవాడ ప్యాసింజర్ రైళ్ల అప్ అండ్ డౌన్ రద్దుచేశారు. ఈనెల 11 నుంచి 21 వరకు సికింద్రాబాద్ - గుంటూరు(17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్, సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్(17233) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 21 వరకు అప్ అండ్ డౌన్, గుంటూరు-సికింద్రాబాద్(12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 10, 11, 15, 18, 19, 20 వరకు, విజయవాడ-సికింద్రాబాద్(12713) శాతవాహన ఎక్స్‌ప్రెస్ 11, 14, 16, 18, 19, 20 వరకు అప్ అండ్ డౌన్ రద్దు చేశారు. అనంతరం ఈ రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు చెప్పారు. ఇదిలా ఉండగా పలు రైళ్లను దారిమళ్లించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

20 నుంచి ఎస్డీఎల్‌సీఈ జర్నలిజం పరీక్షలు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ దూర విద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు తెలిపారు. ఫిబ్రవరి 20, 22, 24, 27, మార్చి 1, 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

మార్చి 4 నుంచి సైకాలజీ సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఎస్సీ సైకాలజీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మార్చి 4, 6, 10, 12వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు .అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు మార్చి 15, 16, 17, 18, 19,20 తేదీల్లో బ్యాచ్‌ల వారికీగా జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

20 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఏ, ఎంకామ్, ఎంహెచ్‌ఆర్‌ఎం కోర్సుల పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ, ఎంకామ్ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ 2023-24 ఏడాది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి అధికారులు తెలిపారు. ఎంఏ ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంకామ్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. పరీక్షలు ఫిబ్రవరి 20, 22, 24, 27, మార్చి 1, 2, 3వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడలని కోరారు.

15 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



వరంగల్ రైల్వే పోలీసులు పట్టుకున్న గంజాయి (ముసుగులో నిందితుడు)

గిర్మాజిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ రైల్వే పోలీసులు ఆదివారం మధ్యాహ్నం భారీ స్థాయిలో గంజాయిని పట్టుకుని నిందితుడిని రిమాండ్ చేశారు. జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రం భద్రక్ జిల్లా భద్రక్ మండలం ముళ్ళసాహి గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి సమన్ ఖాద్రీ అక్కడ గంజాయి కొనుగోలు చేసి ముంబయికి బయలుదేరాడు. భువనేశ్వర్ నుంచి రైల్లో వచ్చి వరంగల్‌లో దిగాడు. ఇక్కడి నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు రైలు కోసం చూస్తుండగా ఆర్‌పీఎఫ్ ఎస్సై జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు అతడిని అనుమానించి బ్యాగులను తనిఖీ చేశారు. సుమారు రూ.3.90లక్షల విలువైన 15.631 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడుతో పాటు గంజాయిని కాజిపేట రైల్వేకోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.



WANTED
★ Wanted Telecallers & Administrator at SK's ACADEMY, Naim Nagar, Hanumakonda. Contact : 9912020759, 9912020963
AJW-00

PLOT FOR SALE
★ Open Plot for Sale 150 Sq.Yards, LRS Clear West Facing, Near Ramalayam Temple, Revenue Colony, Hnk. Cont : 9849828875.
AJW-226391

WANTED PHARMACISTS
★ హన్మకొండ రీపిస్‌పురలో గల మెడికల్ షాపులో ఫార్మాసిస్ట్‌లుగా చేయుటకు అనుభవం గలవారు మరియు ఫ్రెషర్స్ కావలెను. సంప్రదించండి : 9000505091 మరియు లేడీ రిసెప్షనిస్ట్ : 9393113929 (WhatsApp)
AJW-7639

HOUSE FOR SALE
★ వరంగల్ మట్టెవాడలోని రేతులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq.Yrds పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మబడును. సం॥ప్ర॥ 8331888842
AJW-226425

సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్ వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్‌లోని షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్, రెస్టారెంట్స్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్స్ కావలెను. జీతం : 12000–16000 సం॥ప్ర॥ 9000463426
AJW-226393

TO - LET
★ హన్మకొండ కాకాజి కాలనీ, వీణా మెడికేర్ ఎదురుగా మెయిన్ రోడ్‌కు 25x12 Feets గల షట్టర్ కిరాయికి ఇవ్వబడును. వివరాలకై సం॥ప్ర॥ 8341436060
AJW-226482

వాచ్‌మెన్ కావలెను
★ వాచ్‌మెన్ కావలెను. భార్యా భర్తలైన పరవాలేదు. వయస్సు : 50 సం॥ల లోపు ఉండాలి. రూం సౌకర్యం కలదు. స్టేషన్ రోడ్, వరంగల్. సం॥ప్ర॥ 9849018258, 8106307480
AJW-5768

LOSS OF PASSPORT
★ I, KUNCHALA ANJANEYULU, S/o. K. VENKATESHWARLU, H.No 31-3-2125, Venkateshwara Colony, TNGO's Phase-II, Hanumakonda, T.G. have lost my Original Passport bearing No: K4763400. While travelling from NGO's Colony to Sumangali Function Hall of Hanumakonda by Auto on 05-02-2025. If anybody found please Contact : 9000746555
AJW-226206

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

మో‘డల్’ బస్టాండ్!

- హనుమకొండ మల్టీపర్పస్ మోడల్ బస్‌స్టేషన్ పనుల్లో నిర్లక్ష్యం
- మొదలు కాని పనులు.. కానరాని పురోగతి
- ఇరుకుగా ప్రస్తుత బస్‌స్టేషన్.. ఇబ్బందుల్లో ప్రయాణికులు
- ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు



హనుమకొండ బస్‌స్టేషన్

హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో కీలకమైన హనుమకొండలో అన్ని హంగులతో నిర్మించతలపెట్టిన మల్టీపర్పస్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో కదలిక కనిపించడం లేదు. ఓ వైపు రూ.70కోట్ల వ్యయంతో సకల సౌకర్యాలతో వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతుండగా.. మరోవైపు కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో బస్‌స్టాండ్ నిర్మాణానికి చకచకా అడుగులు పడుతున్నాయి. కానీ హనుమకొండ మల్టీపర్పస్ మోడల్ బస్‌స్టేషన్ పనులు మాత్రం అడుగు కూడా ముందుకు పడడం లేదు. ప్రస్తుతం ఉన్న పాత బస్‌స్టేషన్ స్థానే కార్పొరేట్ స్థాయిలో మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి బ్లూప్రింట్ ఇది వరకే తయారైంది. ఎటొచ్చీ నిధులు విడుదల కాకనే పనులు మొదలు కావటం లేదు.



హనుమకొండ బస్‌స్టేషన్ ప్రధాన ద్వారం

చాలా కాలం నుంచి..

హనుమకొండ బస్టేషన్‌ను అధునాతన సౌకర్యాలతో అద్భుతంగా నిర్మించాలన్న ప్రతిపాదన చాలా కాలం నాటిది. వరంగల్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణానికన్నా ముందు తెరమీదికి వచ్చింది. అప్పటి నుంచి కసరత్తు జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడున్న హనుమకొండ బస్‌స్టేషన్ నిర్మాణం జరిగి 40 ఏళ్లకుపైగా అవుతుంది. మాజీ కేంద్ర మంత్రి దివంగత కమాలొద్దీన్ అహ్మద్ ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఈ బస్‌స్టేషన్‌కు అవసరమైన స్థలాన్ని సేకరించి ఇచ్చారు. 13 ఎకరాల విస్తీర్ణంలో అప్పటి జనాభా, బస్సు సంఖ్య, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించారు. ఆ తర్వాత కాలంలో నగర జనాభా గణనీయంగా పెరిగింది. నగరం విస్తరించింది. ప్రయాణికుల సంఖ్య కూడా బాగా పెరిగింది. బస్సు సంఖ్య కూడా గతంలో కన్నా ఎన్నో రెట్లు పెరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏర్పాటైన మొదటి బస్‌స్టేషన్ ఇదే. తదనంతర కాలంలో ఉమ్మడి జిల్లాలో 9 బస్సు డిపోలు ఏర్పాటయ్యాయి. ఇక్కడి నుంచే ఈ డిపోలకు నిత్యం వందలాది బస్సులు నడుస్తున్నాయి. వివిధ జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచే బస్సులు నడుస్తున్నాయి. వేలాది మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రస్తుత హనుమకొండ బస్‌స్టేషన్ సరిపోవడం లేదు.

ఇరుగ్గా.. ఇబ్బందిగా..

భవనం కూడా పాతబడి పోయింది. బస్‌స్టేషన్ లోతట్టున ఉండడంతో ఏ చిన్న వర్షం వచ్చినా.. నీరంతా బస్‌స్టేషన్‌లోనే నిలుస్తోంది. చిన్న పాటి చెరువుగా మారుతోంది. బస్సురాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. బస్సులు ఆగడానికి చాలినన్ని ప్లాట్ ఫారాలు లేవు. పైగా ఆర్టీసీ అధికారుల అన్ని కార్యాలయాలు ఇందులో ఉన్నాయి. కనీస సౌకర్యాలు లేవు. ప్రయాణికులకు వెయిటింగ్ హాల్ లేదు. టాయిలెట్లు సరిగా లేవు. తాగునీటి సరఫరా కూడా అంతంత మాత్రమే. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం వస్తే హనుమకొండ ప్రయాణికుల ప్రాంగణం చెరువులా మారుతోంది. కాకాజీ కాలనీ, చుట్టు పక్కల ఉన్న ఇతర ప్రాంతాల నుంచి వరద నీరంతా ఈ బస్‌స్టేషన్‌లోకి వచ్చి చేరుతుంది. నీళ్లలోంచి వెళ్లలేక ప్రయాణికులు నానా ఇక్కట్లు పడాల్సివస్తోంది. అర్ధరాత్రి సమయంలో పలువురు నీళ్లలో పడి ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి.

నిత్యం రద్దీ

హనుమకొండ బస్‌స్టేషన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. చారిత్రక నగరం కావడం, ముఖ్యంగా పర్యాటక ప్రదేశం కావడంతో ఎక్కువ మంది ఇక్కడకు వస్తుంటారు. ప్రతీ రోజు లక్ష మంది దాకా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. 900కుపైగా ఆర్టీసీ బస్సు సర్వీసులు తిరుగుతుంటాయి. ఈ ప్రయాణ ప్రాంగణంలోనే ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం, వరంగల్ 1, వరంగల్ 2 డిపోలు, పెట్రోల్ బంక్, కార్గో సర్వీస్ కేంద్రం, ఆర్టీసీ కార్మికుల ఆస్పత్రి మొదలైనవి ఇందులోనే ఉన్నాయి. బస్‌స్టేషన్ ప్రాంగణం అంతా గుంతలమయంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్‌స్టేషన్ ప్రధాన ద్వారం ఇరుగ్గా ఉండడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రయాణికులు ప్రమాదానికి గురవుతున్నారు. కొద్ది రోజుల కిందట ఒక మహిళా ప్రయాణికురాలు బసు ఎక్కబోయి టైర్ల కింద పడి చనిపోయింది. ఈ పరిస్థితుల్లో బస్‌స్టేషన్‌ను కూలగొట్టి దాని స్థానే అన్ని హంగులతో కూడిన అత్యాధునిక మోడల్ బస్ స్టేషన్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. గత కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బస్‌స్టేషన్ నిర్మాణంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. నిర్మాణానికి ఆయన కొంత మేరకు చొరవ తీసుకున్నారు.

రూ.80 కోట్లతో..

విమానాశ్రయం తలపించే రీతిలో టీఎస్‌ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించి రూ.80కోట్ల వ్యయంతో బస్‌స్టేషన్‌ను నిర్మించేందుకు మూడు నాలుగు నమూనాలను వారం రోజుల్లో తయారు చేయాల్సిందిగా కూడా అధికారులను కోరారు. నమూనా ఖరారు అయిన తర్వాత 15-20 రోజుల్లో డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను తయారు చేయవలసిందిగా కోరారు. స్మార్ట్ సిటీ పథకం కింద నిర్మించే ఈ బస్ స్టేషన్ రాష్ట్రంలోని మిగతా బస్‌స్టేషన్లకు ఆదర్శంగా నిలిచేలా ఉండాలని సూచించారు. ఆ మేరకు కూడా అధికారులు నమూనా తయారు చేశారు. 13 ఎకరాల స్థలంలో ఐదంతస్తులతో సువిశాలమైన భవన సముదాయంలో ఆర్‌ఎం కార్యాలయం, ఇతర అధికారుల చాంబర్లు, సినిమా హాల్, షాపింగ్ కాంప్లెక్స్, హోటల్స్, డార్మెటరీతో పాటు వేయిటింగ్ హాల్, వీఐపీ లాంజ్ తదితర వాటిని నిర్మించేలా ప్లాన్‌ను తయారు చేశారు. కలెక్టర్ దీనిని ఆమోదించారు. రూ.80కోట్ల మంజూరుకి ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు. కాగా, బస్‌స్టేషన్ నిర్మాణం జరుగుతుందనుకుంటున్న తరుణంలో ఆర్టీసీ అధికారులు మెలిక పెట్టినట్టు తెలిసింది. బస్‌స్టేషన్ నిర్మాణంపై చర్చల సందర్భంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు భవనాన్ని తామే నిర్మించుకుంటామని చెప్పటంతో కూడా అధికారులు వెనక్కి తగ్గారు. నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకున్నట్టు సమాచారం.

చెరువులో పడి ఒకరి మృతి



నాగేందర్ (ఫైల్)

మహదేవపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన ఎం.నాగేందర్(46) మద్యానికి బానిసై ఊర్ల వెంట తిరుగున్నాడు. మహదేవపూర్‌కు వచ్చిన అతడు తాగిన మైకంలో ఎర్రచెరువులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

హసన్‌పర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం బైరాన్‌పల్లిలో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకారం... మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన సంగనబోయిన రాజయ్య(58) కొంతకాలంగా షుగర్, బీపీతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే కాలివేలు తొలగించగా ఇన్‌ఫెక్షన్ కావడంతో నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు వెల్లడించారు. మృతుడి కుమారుడు సంగనబోయిన రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



బైక్ పైనుంచి కిందపడి గాయపడిన వ్యక్తి

మడికొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బైక్ నడుపుతూ అదుపు తప్పి కింద పడిన వ్యక్తికి గాయాలైన ఘటన మడికొండలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం బైక్‌పై ధర్మసాగర్ వైపు నుంచి కాజీపేట వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మడికొండలోని పాత పోస్టాఫీస్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో వాహనదారుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

ప్రొఫెసర్లకు కలిసొచ్చిన ‘కాలం’



రిటైర్‌మెంట్ వయస్సు పెంపుతో ప్రయోజనాలు
ఐదేళ్ల పెంపుతో కేయూలో 77 మందికి ప్రయోజనం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 57 నుంచి 62 ఏళ్లకు పెంచడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న సుమారు 200 మంది ప్రొఫెసర్లకు అదృష్టం కలిసొచ్చింది. ఎన్నో ఏళ్లుగా వర్సిటీ ప్రొఫెసర్ల రిటైర్డుమెంట్ వయస్సు పెంచాలని డిమాండ్‌లు వచ్చాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని శాఖల్లోని ఉద్యోగుల రిటైర్డు వయస్సును పెంచినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రొఫెసర్లకు వర్తింప చేయాలనే డిమాండ్‌కు ఊపు వచ్చింది. అందరికీ పెంచి తమకు పెంచకపోవడంపై వర్సిటీల్లో పని చేసే ప్రొఫెసర్ల నిరసనలకు దిగారు. ముఖ్యమంత్రిని మొదలుకుని మంత్రులు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు వినతిపత్రాలను అందచేసి తమ రిటైర్డుమెంట్ వయస్సును పెంచాలని తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న సెంట్రల్ వర్సిటీల్లో ప్రొఫెసర్ల రిటైర్డుమెంట్ వయస్సు 65 వరకు ఉండటంతో తమకు కూడా వర్తింపచేయాలని డిమాండ్ వచ్చాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ల రిటైర్డుమెంట్ వయస్సు పెంచుతామని ప్రకటించారు. దానికి అనుగుణంగా జనవరి 28న జీవో వెలువరించడంతో వర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో పనిచేసే ఓ సీనియర్ ప్రొఫెసర్ జనవరి 31న జరిగే రిటైర్డుమెంట్ ఫంక్షన్ వాయిదా వేసి వయస్సు పెంచడంతో వర్సిటీలో పెద్దఎత్తున టపాసులు కాల్చి సంబురాలు చేశారు.

రీసెర్చ్ విద్యార్థులకు మంచి అవకాశం

వర్సిటీల్లో పనిచేసే ప్రొఫెసర్లు ఒక్కొక్కరు వారి పర్యవేక్షణలో 8 మందికి పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇచ్చే వెలుసుబాటు ఉంది. రిటైర్డుమెంట్ పొందే ప్రొఫెసర్ల వద్ద రెండేళ్లకు ముందే రీసెర్చ్ స్కాలర్లను తీసుకునే అవకాశం కోల్పోతారు. గతంలో 57 ఏళ్ల సర్వీస్ ఉండగా, 54 ఏళ్ల వరకే రీసెర్చ్ స్కాలర్లను తీసుకునే వారు. ఇప్పుడు తాజా పెంపుతో ఒక్కో ప్రొఫెసర్ 65 ఏళ్ల వరకు పరిశోధనలకు పరవేక్షకులుగా వ్యవహరించే అవకాశం ఉంది. దీంతో అన్ని విభాగాల్లో వందల సంఖ్యలో విద్యార్థులకు రీసెర్చ్ చేసే అవకాశం లబిస్తుంది.

ఆర్థిక ప్రయోజనాలు

కాకతీయ యూనివర్సిటీలో ప్రస్తుతం 77 మంది అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల కేటగిరీ రెగ్యులర్‌గా విధుల్లో ఉన్నారు. ఐదేళ్ల పెంపుతో ఒక్కొక్కరికీ ఏటేటా ఇంక్రిమెంట్, 2026లో ప్రకటించే పీఆర్‌సీ ఆర్థిక ప్రయోజనం, సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్లకు అర్హత లభించనుంది. దీంతో పాటు 10 ఏళ్ల ప్రొఫెసర్ అనుభవం వస్తుంది. 10 ఏళ్ల ప్రొఫెసర్ అనుభవంతో భవిష్యత్‌లో వర్సిటీలకు వైస్‌చాన్స్‌లర్లుగా నియమితులయ్యే జాక్‌పాట్లను కొట్టేసే ఉజ్వల అవకాశం కలిసివచ్చినట్లయింది. వయస్సు పెంపు నిర్ణయం ప్రొఫెసర్లకు వీసీకి పదవికి రాజబాటలు వేసిందని చెప్పవచ్చు.

వర్సిటీల్లో టీచింగ్.. రీసెర్చ్‌కు అనుకూలం..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో ప్రొఫెసర్లు రిటైర్డుమెంట్‌కు దగ్గరల్లో ఉన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో టీచింగ్ అవసరాల రిత్యా కాంట్రాక్టు, పార్టుటైమ్ పద్ధతిలో బోధన సిబ్బందిని వర్సిటీల్లో నియమించి బోధనను నడిపిస్తున్నారు. అయితే రీసెర్చ్ సూపర్‌వైజర్లుగా కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకులకు అనుమతు లేవు. యూజీసీ నిబంధనల మేరకు రెగ్యులర్ అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లకే రీసెర్చ్ గైడ్‌షిప్‌కు అవకాశం ఉంది. దీంతో అన్ని వర్సిటీల్లో అనేక విభాగాల్లో ప్రొఫెసర్లు రిటైర్డుమెంట్ కావడంతో యువ పరిశోధకులకు రీసెర్చ్ చేసే అవకాశం లేకుండా పోయింది. కాకతీయ యూనివర్సిటీలో సోషల్ సైన్స్ విభాగాల్లో రాజనీతిశాస్త్రం, లైఫ్ సైన్స్ విభాగాల్లో బాటనీ ఒక్కరూ కూడా రెగ్యులర్ ప్రొఫెసర్లు లేక రీసెర్చ్ గైడ్ల కొరత ఏర్పడుతోంది. ఆయా విభాగాల్లో పీహెచ్‌డీ చేసే అవకాశం లేదు. వయస్సు పెంచకపోతే అన్ని విభాగాల్లోనూ అదే పరిస్థితి నెలకొనే దుస్థితి ఉండేది. ప్రొఫెసర్ల రిటైర్డు వయస్సు 62కు పెంచడంతో యూజీసీ నిబంధనల మేరకు వారంతా 65 ఏళ్లవరకు పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌షిప్ చేసే వెసులు బాటు కలిసి వచ్చింది. గైడ్‌షిప్‌తో వర్సిటీల్లో అనేక మంది విద్యార్థులకు రీసెర్చ్ చేసే మంచి అవకాశం లభించినట్లయింది. అలాగే జాతీయ స్థాయి ఫెల్లోషిప్‌లు సాధిస్తే వారికి కొంత ఆర్థిక వెలుసుబాటు కూడా లభించే అవకాశం ఉంది.

అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో వర్సిటీకి బలం

వర్సిటీల్లో 2010 తర్వాత రెగ్యులర్ ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టలేదు. వర్సిటీలో ఇప్పటివరకు పోయే వారే తప్ప వచ్చేవారు లేరు. వర్సిటీల్లో పనిచేసే కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకులకు తగిన బోధన, పరిపాలన అనుభవం రెగ్యులర్ వాళ్లతో పోలిస్తే తక్కువ. అనుకుని విపత్కర పరిస్థితుల్లో వర్సిటీల్లో అనుభవజ్ఞులైన సీనియర్ ప్రొఫెసర్లు అవసరం. చాకచక్యంగా వర్సిటీల్లోని సమస్యలను పరిష్కరించే అనుభవం సీనియర్లకు ఉంటుంది. అలాగే న్యాక్ గ్రేడింగ్, యూజీసీ రీసెర్చ్ ప్రాజెక్టులు, రుసా పనులు తదితర కీలకమైన అంశాల్లో నిధులు రావాలంటే అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు కీలకం. వారిచ్చే నూతన ప్రతిపాదనలతో నిధులు వచ్చి వర్సిటీ పరిపుష్టి సాధించే అవకాశాలున్నాయి.

వయస్సు పెంపుతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

వర్సిటీల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ, పీడీఎఫ్, నెట్, స్లెట్, జేఆర్‌ఎఫ్, సీఎస్‌ఐఆర్‌తో పాటు తదితర అత్యున్నత డిగ్రీలు సాధించిన నిరుద్యోగులకు ప్రొఫెసర్ల వయస్సు పెంపుతో వారి ఉద్యోగ ఆశలపై నీళ్ళు చల్లినట్లయింది. అయితే వర్సిటీల్లో ఏటేటా నియామకాలు చేపట్టకోవడంతో పాటు అనేక కోర్టు కేసులతో వర్సిటీ బోధన సిబ్బంది భర్తీపై నీలినీడలు కమ్ముకున్నాయి. అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటనలు చేస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. ఈ దఫా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్సిటీ భర్తీపై దృష్టి సారించింది. వర్సిటీల్లో బోధన సిబ్బంది భర్తీ వెంటనే చేపడితే వర్సిటీలు బోధన, రీసెర్చ్‌కి బలం చేకూరుతోంది.

12న మాదకద్రవ్యాల నిర్మూలనకు 2కే రన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనాథ్

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఈ నెల 12వ తేదీన నిర్వహించే 2కే రన్ పోస్టర్‌ను జూనియర్ డాక్టర్స్ అధ్యక్షుడు శ్రీనాథ్ ఆదివారం కేఎంసీలో ఆవిష్కరించారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో సే నో టు డ్రగ్ నిర్మూలనపై వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి కేఎంసీ వరకు అవగాహన ర్యాలీని నిర్వహించనున్నారు.

ఇంగ్లీష్‌లో ప్రవీణకు డాక్టరేట్



కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకురాలు ఎం.ప్రవీణ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆదివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌కు డాక్టరేట్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ 'ఇంగ్లీష్ లాంగ్వేజ్ అక్వ్యూసిషన్ త్రో పర్పస్ ఫుల్ అక్టీవిటీస్ ఫర్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ఇంగ్లీష్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.దామోదర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. హైదరాబాద్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ప్రవీణ పలు అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన ప్రవీణను పలువురు అభినందించారు.

బీసీలకు 56 శాతం సీట్లు కేటాయించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మట్టెవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 56 శాతం సీట్లు కేటాయించాలని బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ మట్టెవాడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల వాటా కోసం బీసీలందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. పూర్తిస్థాయిలో మరోసారి బీసీ కులగణన సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎంబీసీ, సంచారజాతుల్లో ఇంతవరకు అవకాశం రాని వారికి స్థానిక ఎన్నికల్లో సీట్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం విజయ్‌కుమార్, కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నూతనకంటి ఆనందం తదితరులు పాల్గొన్నారు.



బాలలకు బలం బాలామృతం

వర్ధన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో బలహీనత, రక్తహీనత, పోషణ లోపాలను నివారించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతాన్ని పంపిణీ చేస్తోంది. ఏడు నెలల వయసు నుంచి మూడేళ్ల వయసు వరకు పిల్లలకు ప్రతి నెలా 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్‌ను అందిస్తున్నారు. ఎంతో బలవర్ధకమైన బాలామృతం గురించి అవగాహన లేని అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు తినిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో బాలామృతం గేదెలకు సైతం పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తప్పనిసరిగా తినిపించాలి

పిల్లల ఆరోగ్యానికి ఎంతోమేలు చేసే బాలామృతాన్ని తప్పనిసరిగా తినిపించాలని శిశు సంక్షేమశాఖ అధికారులతోపాటు వైద్యులు సైతం సూచిస్తున్నారు. మరోవైపు బలహీనంగా ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్‌ను సైతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాదికాలంగా పంపిణీ చేస్తున్నారు. బాలామృతం ప్లస్‌లో పోషకాల శాతం కొద్దిమేర ఎక్కువగా ఉంటుంది.

ఉండే పదార్థాలు

బాలామృతం, బాలామృతం ప్లస్‌లో వేయించిన గోధుమలు, శనగపప్పు, పాలపొడి, పల్లీలు, చక్కర, నూనెతో పాటు కాల్షియం, ఐరన్, విటమిన్ ఏ, బీ1, బీ2, బీ12, సీ, ఫోలిక్ యాసిడ్, నియాసిన్,, జింక్‌లుసైతం ఉంటాయి.

కలిగే ప్రయోజనాలు

పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. పిల్లల్లో ఆకలిని పెంచుతుంది. రక్త హీనత, బలహీనతను నివారిస్తుంది. కంటిచూపు మెరుగు పడుతుంది.

హరోం హర..

కాళేశ్వరాలయంలో వైభవంగా మహా కుంభాభిషేకం
శృంగేరి తపోవన పీఠాధిపతి సచ్చిదానందతో మహా క్రతువు
మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, పొన్నం హాజరు
శివనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం


ప్రవచనాలు వింటున్న మంత్రులు ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ

మహదేవపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ప్రాచీన పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మహాకుంభాభిషేకం మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కనులపండువగా సాగిన ఈ వేడుక ఆదివారం ముగిసింది. చివరి రోజు మహా క్రతువును భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తుని శృంగేరి పీఠానికి సంబంధించిన తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా ప్రధాన ఘట్టం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు.

గోదావరి ప్రాణహిత సరస్వతి నదుల త్రివేణి సంగమం ఒడ్డున కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవం 43 ఏళ్ల తర్వాత జరిగింది. 1982 తర్వాత మళ్లీ ఇప్పుడు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభామేళా జరుగుతున్న తరుణంలోనే కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో మహా కుంభాభిషేకాన్ని మూడు రోజుల పాటు (శుక్ర, శని, ఆదివారాలు) నిర్వహించారు. ఆదివారం ఉదయం సరిగ్గా 10.42 గంటలకు ప్రధాన ఘట్టం జరిగింది.

శత చండీ పారాయణం, సహస్ర ఘట్టాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి సహస్ర ఘట్టాలతో విశేష అభిషేకాన్ని ఘనంగా జరిపారు. వేద పండితులు, మంత్రోచ్ఛరణ మధ్య శృంగేరి తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. త్రివేణి సంగమం గోదావరి వద్ద పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ ఈవో మహేష్, అర్చకులు పణకంటి నగేష్‌శర్మ, కృష్ణమూర్తి శర్మ, వేద పండితుడు పాండే సుబ్రహ్మణ్యం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హాజరైన మంత్రులు

మహాకుంభాభిషేకం వేడుకకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కాగా, కాళేశ్వరాలయంలో వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామికి పండ్లు, పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి ప్రవచనాలను ఎంత భక్తిశ్రద్ధలతో ఆలకించారు. ఎమ్మెల్సీ ఎన్నికలత కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రులెవరూ మాట్లాడలేదు. ఎన్నికల అధికారి అనుమతి మేరకు దర్శనానికి మాత్రమే తాము హాజరైనట్లు వారు తెలిపారు.

భక్తులకు కృతజ్ఞతలు

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన మహా కుంభాభిషేకం విజయ వంతంగా నిర్వహించడం పట్ల


కలశాల వద్ద పూజలు చేస్తున్న స్వామీజీ, భక్తులు

కలెక్టర్ రాహుల్‌శర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ మహోత్సవంలో భాగస్వాములైన విశేష సేవలు అందించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించారని తెలిపారు. కుంభాభిషేకంపై ప్రచారం కల్పించిన పాత్రికేయులకు, జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనలు పాటిస్తూ సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే పానపట్టంపై రెండు లింగాలు

కాళేశ్వరాలయం ఎంతో పవిత్రమైనదని, ఒకే పానవట్టంపై రెండు లింగాలు ఉండడం విశేషమని తపోవన సచ్చిదానంద సరస్వతి స్వామి తెలిపారు. మూడు నదుల సంగమం వద్ద ఉన్న దేవాలయం ఎంతో విశిష్టమైనదని తెలిపారమహా కుంభాభిషేకం సందర్భంగా ఆయన ప్రవచనాలు చేశారు. శివుడు లయకారుడన్నారు. శివుడిని పూజిస్తే సకల పాపాలు హరిస్తాయని పేర్కొన్నారు. మహా కుంభాభిషేకం ద్వారా ఆలయ ప్రతిష్ట మరింత పెరుగుతుందని తెలిపారు. యంత్రశక్తి, మంత్రశక్తి తోడుగా దేవుడి అనుగ్రహం ఉంటుందన్నారు. భక్తుల కల్పతరువుగా కాళేశ్వరం విరజిల్లుతోందన్నారు.


ఆలయ గోపురం పైన పూజలు చేస్తున్న పూజారులు


గోపురం వద్ద పూజలో మంత్రులు


బలి ప్రదానం చేస్తున్న అర్చకులు

రూ.వెయ్యి కోట్లతో స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి

కోడ్ ముగియగానే సీఎంతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు : ఎమ్మెల్యే శ్రీహరి

హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఏడాదికాలంలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాన్ని రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ రూ.1000 కోట్లలో రూ.800 కోట్ల వరకు నిధులు మంజూరు అయ్యాయని, మరో రూ.200కోట్ల పనుల ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనుల వివరాలను ఆయన గణాంకాలతో సహా వివరించారు.

ప్రధానంగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయించగలిగానని, జఫర్‌గడ్ మండలం కోనాయచలంలో రూ.200కోట్ల వ్యయంతో నిర్మాణం కానున్న ఈ పాఠశాలలో భాగంగా ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం నాలుగు గురుకులాలు ఏర్పాటవుతాయని శ్రీహరి తెలిపారు. నియోజకవర్గం ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించానని, జాతీయ రహదారి పక్కన గతంలో ఆర్టీసీ బస్సు డిపో కోసం ప్రతిపాదించిన నాలుగు ఎకరాల స్థలంలో ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం రూ.40.40కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. 22 ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా తెలంగాణలో మొదటిసారిగా నియోజకవర్గం కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ మంజూరైందని, 50వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.26కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. దేవాదుల రెండోదశ ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు అందించేందుకు ఆర్‌ఎస్ ఘన్‌పూర్ మెయిన్ కెనాల్ కాలువకు, డిస్ట్రిబ్యూటరీలకు సిమెంట్ లైనింగ్ పనులు మంజూరయ్యాయని, రూ.148.76కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు టెండర్లు పిలవడం పూర్తయిందన్నారు.

నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైందని, ప్రస్తుతం ఉన్న జూనియర్ కళాశాల భవనంలో ఈ 2025-26 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, డిగ్రీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

కళాశాల భవన నిర్మాణానికి రూ.30కోట్లు విడుదలయ్యాయని కడియం తెలిపారు. రూ.53కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లు, ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.కోటి వ్యయంతో డివిజనల్ ఆఫీసు భవనం నిర్మాణానికి టెండర్లు పిలవడం పూర్తయిందని, అలాగే రఘునాథపల్లి మండలం కురుచపల్లి, జఫర్‌గడ్ మండలం సాగరం, చిల్పూర్ మండలం కొండాపూర్‌లో రూ.10కోట్లతో మూడు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగనున్నట్టు చెప్పారు. రూ.25 కోట్లతో ఉపాధి హామీ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, విద్యా తది తర శాఖల ఆధ్వర్యంలో వివిధ పనులు మంజూరు పురోగతిలో ఉన్నాయన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లతో పాటు అదనంగా మరో 1500 మంజూరు చేయించానని, రూ. 250 కోట్లతో నిర్మించనున్న ఈ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పా రదర్శకంగా పంపిణీ చేస్తామన్నారు. రూ. 15 కోట్ల ఎంపీ లాడ్స్, ఎన్ ఆర్‌ఈజీ ఎస్ నిధు లతో కమ్యూనిటీ హాళ్ల, గ్రామ పంచాయతీ, అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రూ.180కోట్ల వ్యయంతో పంచాయతీ రాజ్ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించానని ఎమ్మెల్యే తెలిపారు. ఘనపూర్, శివుని పల్లె, చాగల్లు గ్రామాలను కలిపి ఘనపూర్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిందని, ఇటీవలే పనిచేయడం ప్రారంభమైందని వెల్లడించారు. నియోజకవర్గం పరిధిలోని ఇనుపరాతి గుట్టలను (దేవునూరి గుట్టలు) ఎకో టూరిజం పార్కుగా తీర్చిదిద్దే పెద్ద ప్రాజెక్టు త్వరలో చేపట్టనున్నట్టు తెలిపారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా ధర్మసాగర్ చెరువు బండ్‌ను ఆధునీకరించడంతో పాటు ఈ కట్ట నుంచి గుట్టల వరకు లక్నవరం తరహాలో సస్పెన్షన్ బ్రిడ్జిని నిర్మిస్తారని, పార్కులో సైకిల్ ట్రాక్, ట్రెక్కింగ్, చెరువులో బోటింగ్ తదితర సౌకర్యాలను కల్పిస్తారని వివరించారు. ఎకో టూరిజం పార్కు డీపీఆర్‌ను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు శ్రీహరి చెప్పారు. ఎమ్మెల్సీ కోడ్ అయిపోగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయిస్తామని తెలిపారు. మంజూరైన పనులన్నీ 18 నెలల్లో పూర్తి చేయిస్తామని శ్రీహరి ప్రకటించారు.

చేతగానివారు విమర్శించడమా ?

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న తనను చేతగానివారు, అవినీతిపరులు విమర్శిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్యపై కడియం శ్రీహరి పరోక్షంగా ధ్వజమెత్తారు. ఈ పనులన్నీ గతంలోనే మంజూరయ్యాయని చెప్పడాన్ని ఖండించారు. ఏడాది కాలంలోనే మంజూరయ్యాయడానికి సాక్ష్యంగా జీవోలు, తేదీలతో సహా వివరించారు. 15 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉండి ఏం చేయలేని వ్యక్తి.. తనపై చౌకబారు విమర్శలు చేయడాన్ని మానుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి, స్టేషన్‌ఘనపూర్ మునిసిపాలిటీగా స్థాయి పెంపు వంటి చిన్న పనులపై దృష్టిపెడితే అయ్యేవని, కానీ అదేం పట్టించుకోలేదన్నారు. ఆయనకు వేరే సోకులు ఉండేవి అంటూ ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 20 ఏళ్ల తర్వాత తిరిగి ఎమ్మెల్యే అయిన తాను స్టేషన్‌ఘనపూర్ నియోజకర్గ అభివృద్ధికి శక్తిమేరకు కృషి చేస్తున్నానని కడియం పునరుద్ఘాటించారు.


ముస్తాబైన పగిడిద్దరాజు ఆలయం

19 నుంచి పగిడిద్దరాజు జాతర

పూనుగొండ్లలో ముస్తాబైన ఆలయం
3 రోజులు మొక్కులు చెల్లించుకోనున్న భక్తులు

గంగారం(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గంగారం మండలంలోని పూనుగొండ్లలో కొలువై ఉన్న గిరిజనుల ఆరాధ్యదైవం సమ్మక్క భర్త పగిడిద్దరాజు మిని జాతరకు దేవాలయం ముస్తాబైంది. మేడారం సమ్మక్క, సారక్క ఆలయ కమిటీ నుంచి నిధు లు రావటంతో ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. ఈ నెల 12వ తేదీన మేడారంలో జరిగే విుని జాతరకి పెండ్లి కుమారుడిగా పగిడిద్దరాజు ముస్తాబై వెళ్లి వచ్చిన తర్వాత.. 19న పూనుగొండ్లలో జాతర ప్రారంభమవుతుందని అర్చకుడు పెనక రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. ఈ జాతర మూడు రోజులు జరుగుతుందని వివరించారు. పూనుగొండ్లలో జరిగే ఈ జాతరకు పెనక వంశస్థులతో పాటు గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెనక పురుషోత్తం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రధాన పూజారి పెనక రాజేశ్వర్


గంగారం మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజు ఆలయం

టాయ్ కాదు.. టీచర్

- గుడ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పే 'సంస్కార్' బొమ్మ
- ఇప్పటివరకు 65 వేల మంది విద్యార్థులకు అవగాహన
- ఏడు భాషల్లో మాట్లాడేలా తయారీ
- ఆవిష్కరించిన వరంగల్ వాసి గణేష్
- ప్రశంసించిన ప్రధాని నరేంద్ర మోదీ

మామునూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకూ ఆడపిల్లలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. అభంశుభం తెలియని చిన్నారులను సైతం కామాంధులు వదిలిపెట్టడం లేదు. ఇలాంటి సంఘటనలు మనం రోజూ చూస్తూనే ఉన్నాం. అనేక సందర్భాల్లో తెలిసిన వాళ్ళే ఈ దుశ్చర్యకు ఒడిగడుతున్నారు. ఏ ఉద్దేశంతో అమ్మాయిలను తాకుతున్నారో చిన్నపిల్లలు గుర్తించలేరు. ఈ నేపథ్యంలో మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి పిల్లలకు అవగాహన కల్పించడం అవసరం. అయితే తల్లిదండ్రులు ఇలాంటి విషయాలు పిల్లలతో మాట్లాడటానికి సాధారణంగా ఇష్టపడరు. ఈ సమస్యను గమనించిన వరంగల్‌కు చెందిన ఓ యువకుడు పరిష్కార మార్గాన్ని కనుగొన్నాడు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి పిల్లలతో మాట్లాడటానికి ఓ బొమ్మను తయారు చేశాడు. దానికి 'సంస్కార్ ఆద్య' అని పేరు పెట్టాడు. పాఠశాలల్లో ఆడపిల్లలకు చదువుతో పాటు

30కి పైగా ఆవిష్కరణలు

వరంగల్ జిల్లా నందనం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన యాకర గణేష్ సైన్స్ అండ్ టెక్నాలజీలో అయిదు ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్ అందుకున్నాడు. గణేష్ ఘనత గురించి 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసించారు. కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్న తన తల్లి కష్టం చూడలేక పదకొండేళ్ల వయసులో హ్యాండ్ ఫ్యాన్ తయారు చేశాడు. ఇలా నాటి నుంచి నేటి వరకు 30కి పైగా వివిధ పరికరాలను ఆవిష్కరించారు. అందులోంచి పుట్టిందే సంస్కార్ బొమ్మ. దాని పేరు ఆద్య.



బొమ్మలతో అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, గణేష్, అధికారులు


సంస్కార్ బొమ్మ(ఆద్య)ను ఆవిష్కరిస్తున్న ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పిస్తున్నాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే సంస్కార్ ఆద్య అనేది మాట్లాడే బొమ్మ. ఆద్యను ఛాతి ప్రాంతంలో తాకితే అక్కడ తాకకూడదు అంటూ హెచ్చరిస్తుంది. ఇలా శరీరంలో ఎక్కడ ప్రైవేట్ పార్ట్స్‌ను తాకినా వెంటనే అరుస్తుంది. అంతేకాదు ఆపదలో ఉన్నప్పుడు ఏం చేయాలో కూడా చెపుతుంది. హెల్ప్‌లైన్ నంబర్లను సైతం చెప్పేస్తుంది. సైబర్‌క్రైం గురించి, డ్రగ్స్ గురించి హెచ్చరిస్తుంది. ఇందులో బాయ్ వర్షన్ కూడా ఉంది. దాని పేరు ఆదిత్య. అబ్బాయిలకు ఆడపిల్లలతో ఎలా మసలుకోవాలో చెపుతుంది. అంతే గాకుండా వినికిడి, చూపు లేని పిల్లలను సైతం గైడ్ చేస్తుంది. లైంగిక వేధింపులు, బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. వీటిని ప్రతీ జిల్లాలో పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, బాలికల వసతి గృహాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, షాపింగ్ మాల్స్, ప్రధాన కూడళ్ల వద్ద శాశ్వతంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రోబో తయారు చేస్తా..

వై. గణేష్, సంస్కార్ బొమ్మ రూపకర్త



చిన్నప్పటి నుంచి నాకు సైన్స్ అండ్ టెక్నాలజీ అంటే ఇష్టం. దీనికి సంబంధించి నాకు ఫార్మల్ ఎడ్యుకేషన్ ఏమీ లేదు. యూట్యూబ్ చూసే నేర్చుకున్నాను. ఇన్నోవేటివ్ మైండ్ సెట్ ఉన్నవాళ్లకు ఓ ప్లాట్ ఫామ్ తయారు చేయాలన్నదే నా లక్ష్యం. ఫ్యూచర్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఒక రోబో తయారు చేసి దానితో పిల్లలకు మరింత అడ్వాన్స్ నాలెడ్జ్ అందజేస్తా. అందుకే సంస్కార్ ఎలక్ట్రానిక్స్ అనే స్టార్టప్ పెట్టాను.

వేలాది మందికి అవగాహన

గణేష్ రూపొందించిన సంస్కార్ బొమ్మ ఇప్పటి వరకు 65 వేల మంది విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి అవగాహణ కల్పించింది. ఈ బొమ్మను ఉపయోగించడం చాలా సులువు. ఎవరైనా బొమ్మ ప్రైవేట్ భాగాలపై చేతులు ఉంచితే అది వెంటనే ముట్టుకోవద్దు అని అరుస్తుంది. సంస్కార్ బొమ్మ ఇచ్చే ఆడియో సిగ్నల్స్ కోసం గణేష్ తనస్నేహితులతో పాటు వేర్వేరు వ్యక్తుల వాయిస్‌లను రికార్డ్ చేశారు. ప్రస్తుత కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సైతం వాయిస్ ఇచ్చారు. దీన్ని మొదట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ బొమ్మ తెలుగుతో పాటు ఇంగ్లిష్, హిందీ, తమిళం, కన్నడ మళయాలం, కొంకణీ భాషలలో మాట్లాడగలదు.




సంస్కార్ ఆద్య, ఆదిత్య బొమ్మలు


విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పిస్తున్న గణేష్



గణేష్ అందుకున్న మెడల్స్

ఆన్‌లైన్‌లో ఎవరైనా బుక్ చేసుకోవచ్చు


సంస్కార్ బొమ్మ కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ధర రూ.3500 చెల్లిస్తే ఇంటివద్దకే కొరియర్ లో వస్తుంది.

ఆడపిల్లలకు అవగాహన తప్పనిసరి

ఎస్పీ పూజ, మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్



గుడ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన ఉండాలి. ఈ విషయంపై స్కూల్లో టీచర్లతో పాటు ఇంట్లో తల్లిదండ్రులు కూడా వారికి వివరించాలి. గణేష్ తయారు చేసిన సంస్కార్ బొమ్మ బాగుంది. ఆడపిల్లలకు ఎంతో ఉపయోగపడుతుంది. సమాజంలో పిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



తరాలపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మడికొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ తరాలపల్లిలో స్థానిక నాయకులు సింగారపు నాగరాజ్, ఇల్లందుల సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో హనుమకొండ కాకాజీ కాలనీలోని శ్రీబాలాజీ హాస్పిటల్ డాక్టర్ సంపత్‌రావు వైద్య బృందం సుమారు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ అరూరి రంజిత్, జేరిపోతుల కృష్ణంరాజు, అ రూరి డేవిడ్, అ రూరి కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎర్రగట్టుగుట్ట మున్నూరుకాపు సంఘం కమిటీ

హసన్‌పర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టుగుట్ట మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ఎర్రగట్టు దేవస్థానం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా తోట నాగరాజు, అధ్యక్షుడిగా నంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోట రాకేష్, కోశాధికారిగా ఉప్పుల సంపత్, ఉపాధ్యక్షుడిగా బండారి యాదగిరి, సహాయ కార్యదర్శిగా గుండపు సుధాకర్, సహాయ కోశాధికారిగా గంట రాజయ్య, కార్యవర్గ సభ్యులుగా కోడెల ప్రవీణ్, ఆకుతోట చిరంజీవి, అవుదరి సురేష్, తోట నాగరాజు, హరిశంకర్‌లు నియామకమైనట్లు కమిటీ ప్రకటించింది.

కేయూసీ పోలీసు స్టేషన్‌లో శ్రమదానం


శ్రమదానం చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పోలీసు సిబ్బంది

హసన్‌పర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శ్రమదానం చేశారు. పోలీసుస్టేషన్ ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు మరింతి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం పోలీసులు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. త్వరలోనే పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కల పెంపకం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి

▸▸ వాకర్స్ ఇంటర్నేషనల్-2025 అధ్యక్షురాలు ప్రభావతి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎం.ప్రభావతి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ ప్రజలను చైతన్యపరిచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని వాకర్స్ ఇంటర్నేషనల్-2025 అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ - 303 గవర్నర్‌గా కూరాకుల భారతితో పాటు 19 జిల్లాల క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రభావతి మాట్లాడుతూ.. నడక వలన బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రతీ ఒక్కరు ఉదయం, సాయంత్రం వేళల్లో క్రమం తప్పకుండా నడకను అలవాటు చేసుకోవాలని అన్నారు. నడకతోపాటు యోగా, మెడిటేషన్ ద్వారా వ్యాధులు దరిచేరకుండా ఉండడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తడక కుమారస్వామి గౌడ్, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు డాక్టర్ నల్లాని శ్రీనివాస్, బూర రాంచందర్, గాంధీ ,సీఎస్. నారాయణ, పులిచెంట్ల అనంత్‌కుమార్, దేశిని లక్ష్మీనారాయణ,కోండ్ర నర్సింహరావు, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ సైకాలజిస్టు , డాక్టర్ బరుపాటి గోపి, ఆరోగ్యవంతమైన జీవనానికి సంబంధించి చిట్కాలను వివరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వాకర్స్ ఇంటర్నేషనల్-303 వరంగల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో తన్వి నేచురోపతి క్లీనిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత అక్యూపంక్చర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ అక్యూపంక్చర్ థెరపిస్టు, డైరెక్టర్ అండ్ ట్రైనర్, తన్వీ నేచురోపతి క్లీనిక్ వ్యవస్థాపకులు అనిల్ కుమార్ తెంబరేని, డాక్టర్ అన్వేష్ కందగట్ల, సీనియర్ సిటిజన్లకు ఉచితంగా ఆక్యూపంక్చర్ వైద్య పరీక్షలను నిర్వహించారు. అక్యూపంక్చర్ థెరపిస్టులు రవీందర్, ఉమాపతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకం : ఏసీపీ


శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల పాత్ర కీలకమని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ అన్నారు. ఇటీవల పూజారి హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడటంలో కీలకపాత్ర పోషించిన మట్టెవాడ పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఆదివారం తన కార్యాలయంలో మట్టెవాడ సీఐ తుమ్మ శ్రీధర్‌తో కలిసి ఏసీపీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులకు న్యాయస్థానాలకు మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తున్న కోర్టు కానిస్టేబుల్ విధులు చాలా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మట్టెవాడ ఎస్ఐలు నవీన్ కుమార్, సాంబయ్య, మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం, మట్టెవాడ పోలీసులు పాల్గొన్నారు.

'మలేరియా'లో అక్రమ వసూళ్లు

- నెలకు రూ.500 ఇవ్వాలని కార్మికులకు హుకుం
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది
- పట్టించుకోని బల్దియా ఉన్నతాధికారులు



వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ మలేరియా విభాగంలో కొందరు సిబ్బంది వసూళ్లకు తెగబడుతున్నారు. కింది స్థాయి ఉద్యోగులు, దినసరి కార్మికులను డబ్బుల కోసం వేధిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఫీల్డ్ వర్కర్లు నెల జీతంలో ఒక్కొక్కరు రూ.500 ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో అధికారుల వేధింపుల కారణంగా పనిచేయలేమని ఫీల్డ్‌వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొందరు నెలవారిగా ఇచ్చే డబ్బులతో పాటు రోజు వారిగా ఫాగింగ్ మిషన్‌లో నింపుకునే డీజిల్‌లో సైతం వాటా ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు తెలిపారు. దీంతో నగరంలోని పలు డివిజన్‌లలో సాయంత్రం సమయంలో ఫాగింగ్ చేయాల్సిన సిబ్బంది సరిగా పనిచేయడం లేదని తెలిపారు.

విధులు..

బల్దియా పరిధిలోని 66 డివిజన్‌లలో మలేరియా సిబ్బంది మలాథిన్ మందుతో కూడిన ఫాగింగ్, డ్రైనేజీలలో ఫైరిత్రిన్ స్ప్రే చేయడంతో పాటు నీరు నిలువ ఉండే చిన్నపాటి కుంటలలో గంబూషియా చేపలు వేసి క్రిమికీటకాల నివారణ చేపట్టాలి. వీరు కమిషనర్ ఆదేశాల మేరకు బయాలజిస్ట్ పర్యవేక్షణలో పనులు చేస్తారు. కానీ ఇందులో ఓ ఇద్దరు అధికారులు ధనార్జనే ధ్యేయంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అడిగిన డబ్బులు ఇవ్వని వారిని వేధించడంతో పాటు ఫాగింగ్ మిషన్‌లలో డీజిల్, పెట్రోల్ పోయడంలో కోత విధించడంతో పాటు మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు.

బయోమెట్రిక్ హాజరులో గోల్‌మాల్

బల్దియా పరిధిలోని డివిజన్లు గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న సుమారు 200 మంది సిబ్బందికి నగరంలో రెండు చోట్ల బయోమెట్రిక్ హాజరు తీసుకుంటారు. వరంగల్ పోచమ్మమైదాన్, హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో హాజరు తీసుకుని విధులకు తరలిస్తున్నారు. అయితే కొందరు విధులకు హాజరుకాకపోయిన్నటికీ ఇద్దరు అధికారులు మ్యానువల్ పద్ధతిలో హాజరు వేసి నెలవారిగా పెద్దమొత్తంలో దండుకుని జీతాలు చేస్తున్నట్టు తెలిసింది. ప్రధానంగా ఆరెపల్లి, మామునూరు, సింగారం, వరంగల్, కొత్తపేట గ్రామాలకు చెందిన సిబ్బంది కిందిస్థాయి కార్మికులను డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు ఆజమాయిషీ చెల్లాయిస్తున్నట్టు వాపోయారు. ఇక్కడి అధికారుల అక్రమ వసూళ్లను తట్టుకోలేక ఇటీవల ఓ హెల్త్ అసిస్టెంట్ శానిటేషన్ విభాగానికి బదిలీపై వెళ్లినట్టు తెలిసింది.

అడ్డదారిలో నియామకాలు

బల్దియా మలేరియా విభాగంలో అడ్డదారిలో పదోన్నతులు జరిగినట్టు విశ్వసనీయ సమాచారం. కొందరు ప్రభుత్వ ఫీల్డ్ వర్కర్లు సీనియర్లు ఉన్నతాధికారిని కలిసి పదోన్నతి కల్పించాలని కోరడంతో ఐదుగురి నుంచి రూ.40వేల చొప్పున ఓ అధికారి దండుకుని ఇన్‌చార్జి హెల్త్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు సమాచారం. ఇంకా ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వద్ద డబ్బులు దండుకుని హెల్త్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించడంపై తోటి సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా మలేరియా విభాగంపై ఓ కన్నేసి ఉంచకపోతే రూ.కోట్ల నిధులు అక్రమార్కుల పాలవుతాయనే విమర్శలు లేకపోలేదు.

రూ.500 డిమాండ్ నా దృష్టికి రాలేదు..
బల్దియా బయాలజిస్ట్, మాధవరెడ్డి

మలేరియాలో సిబ్బందిని కొందరు ఉద్యోగులు నెలకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. డీజిల్‌లో కుంభకోణం జరుగకుండా ప్రత్యేక బృందాలను పెట్రోల్‌పంపు వద్ద ఉంచాం. ఇటీవల కొందరు ఉద్యోగులపై ఆరోపణలు రావడంతో వారిని హెచ్చరించి పక్కకు పెట్టాం. సిబ్బందికి, కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తాం.

సెయింట్ గ్యాబ్రియల్ గ్రౌండ్‌లో హెలికాప్టర్ ల్యాండింగ్

కాజీపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ఓ హెలికాప్టర్ ఆగింది. ఆదివారం, సోమవారం రెండురోజుల పాటు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్‌తో పాటు ఇతర జిల్లాలో భూముల సర్వేకోసం కేంద్ర బృందం సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం సర్వే అనంతరం రాత్రి కూడా సెయింట్ గ్యాబ్రియల్ గ్రౌండ్‌లో ల్యాండైంది. సోమవారం సైతం సర్వే అనంతరం తిరిగి హెలికాప్టర్ బృందం ఢిల్లీ వెళ్లనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు తెలిపేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్‌లో ల్యాండైన హెలికాప్టర్ దగ్గరికి స్థానికులు వెళ్లేందుకు ప్రయత్నించగా ఏవియేషన్ అధికారులు అనుమతించలేదు. బ్రిడ్జి మీదుగా వెళ్లే వారు తమ సెల్ ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు.


సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌లో ల్యాండైన హెలికాప్టర్


మడికొండలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి

గేటెడ్ కమ్యూనిటీ బ్రోచర్ ఆవిష్కరణ

మడికొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వెలుపల తెలంగాణాలోనే మొట్టమొదటిసారి నిర్వి షికార ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హైలక్స్ ఫుల్లీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌ను నిర్మిస్తోంది. వరంగల్ నగరానికి ముఖద్వారంగా ఉన్న మడికొండలో జాతీయ రహదారిని ఆనుకుని 8 ఎకరాల సువిశాల స్థలంలో 45వేల చదరపు అడుగుల అత్యాధునిక వసతులతో కూడిన 50 పైగా లైఫ్‌స్టైల్ సౌకర్యాలతో 6 రెసిడెన్షియల్ టవర్స్ నిర్మిస్తున్నారు. ఒక్కో టవర్‌లో 15 అంతస్తులు ఉంటాయని, ఒక ఎకరం విస్తీర్ణంలో కమర్షియల్ టవర్ నిర్మిస్తున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా ఆదివారం అపార్ట్‌మెంట్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను క్రెడాయ్ అధ్యక్షులు ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షులు సీహెచ్. జగన్‌మోహన్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎ. తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు అమరలింగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి జె. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా అంతర్గత రోడ్లు

▸▸ క్యూరింగ్ లేక ఎండిపోతున్న వైనం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న అంతర్గత సీసీ రోడ్లు ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఎర్రగట్టుగుట్ట మంత్రపురి కాలనీ, హసన్‌పర్తి యాదవనగర్ కాలనీతో పాటు పలు కాలనీలలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు నాసిరకంగా వేయడమే కాకుండా క్యూరింగ్ చేయకుండా వదిలేసినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు క్యూరింగ్ కోసం కట్టలు నిర్మించి క్యూరింగ్ చేయాలని స్థానికులు అడిగితే ఎవరి ఇంటి ఎదుట వారే క్యూరింగ్ కోసం నీళ్లు పట్టుకోవాలని సదరు కాంట్రాక్టర్ ఉచిత సలహాలివ్వడంపై కాలనీవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు సదరు కాంట్రాక్టర్ నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను పర్యవేక్షించి నాసిరకంగా నిర్మిస్తున్న సీసీలను పరిశీలించి ప్రజాధనం వృథాకాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


క్యూరింగ్ లేక ఎండిపోతున్న సీసీ రోడ్డు

దివ్యాంగ కళాకారుల ప్రతిభను ప్రోత్సహిద్దాం..


జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న అధికారి జయంతి, తదితరులు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న దివ్యాంగులు

జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జయంతి

హనుమకొండ కల్చరల్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని అంబేద్కర్ భవన్ వేదికగా ఆదివారం రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సాంస్కృతిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్లా మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సంక్షేమ శాఖ అధికారి జె.జయంతి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండేలా వారి ప్రతిభను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కలలు సమాజానికి తెలిసే విధంగా దివ్యాంగులతో కార్యక్రమాలను నిర్వహింపచేస్తున్న విద్య ఫౌండేషన్ సేవలు అభినందనీయన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ బన్న ఐలయ్య మాట్లాడుతూ.. దివ్యాంగులలో అద్భుతమైన కలలు దాగి ఉన్నాయని, వాటిని వెలికితీసే విధంగా ఫౌండేషన్ ప్రోత్సాహం అభినందనీయమని అన్నారు. రెడ్‌క్రాస్ పక్షాన పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, ఈవీ శ్రీనివాస్‌రావులు మాట్లాడుతూ.. దివ్యాంగులకు రెడ్‌క్రాస్ పక్షాన తమ వంతు చేయూతను అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపడం, వారి కలలను సమాజానికి పరిచయం చేయడం, దివ్యాంగులలో ఆత్మస్థైర్యం కల్పించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తోందని బిల్లా మహేందర్ అన్నారు.

కాగా, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 50 మందికి పైగా దివ్యాంగ కళాకారులు భిన్నఅంశాల్లో ప్రదర్శించిన అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కళాకారులైన దివ్యాంగులను ఘనంగా సత్కారించారు. గురిజాల తిరుతిరెడ్డి, కె.మాధవిరెడ్డి, పి.అనితారెడ్డి, ఎస్.ప్రభాకర్, ప్రవీణ్‌రావు, అబిద్‌మియా తదితరులు ఆహ్వానితులుగా పాల్గొన్నారు. మల్లికాంబ మనోవికాస కేంద్రం నుంచి రామలీల, కల్యాణ్, టీటీడీ బధితుల పాఠశాల నుంచి శరత్‌కళ, ఒరసిస్ నుంచి ప్రకాశ్, స్పందన ఆశ్రమం నుంచి సుచరిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.నరేందర్, శ్రీనివాస్, బిల్లా సరిత, గట్టు రాధిక, కరుణశ్రీ, ఉషారాణి, స్వరూపరాణి, వాణిరాణి తదితరులు పాల్గొన్నారు.

అరూరికి పలువురి పరామర్శ


అరూరి వెంకటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలశౌరెడ్డి

జఫర్‌గడ్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను ఆదివారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్ ఉడుముల బాలశౌరెడ్డి, ప్రతినిధి కరుణాకర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్, తదితరులు పరామర్శించారు. రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల మరణించడంతో ఉప్పుగల్లు లో ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. వారితో పాటు బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు జువారి రమేశ్, నేతలు యాకూబ్ పాషా, పెండ్యాల సమ్మయ్య, జాఫర్, వివిధ పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. అరూరి రమేశ్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

• హసన్‌పర్తి : మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, పీఏ సీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, రాజేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు అనిల్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మదన్‌గౌడ్ పాల్గొన్నారు.


అరూరి వెంకటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

విద్యాశాఖపై కలెక్టర్ నజర్

- వరంగల్ డీఈవోపై ఫిర్యాదులతో చర్యలు
- ఇద్దరు సిబ్బందిని కార్యాలయం నుంచి తప్పించిన వైనం
- జిల్లా కలెక్టర్ చర్యలతో కార్యాలయం ఉద్యోగుల్లో దడ


వరంగల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా విద్యాశాఖలో వింత వింత పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద స్పందించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను అక్కడి నుంచి పంపించాల్సిందిగా డీఈవోకు నోటీసులు జారీ చేశారు. ఇది రాష్ట్ర విద్యాశాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

కలెక్టర్ సీరియస్

వరంగల్ డీఈవో కార్యాలయంలో జరుగుతున్న అక్రమాల తతంగాన్ని వివిధ ఉపాధ్యాయ సంఘాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా గత నెల 31న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, డీఈవో, ఉపాధ్యాయ సంఘాల నేతలతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈవో కార్యాలయంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని ఆమె ప్రస్తావించినట్లు తెలిసింది. కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో డీఈవోతోపాటు సిబ్బందిపై ఆమె అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆఫీస్‌లో అందరూ వారికి కేటాయించిన పనులు నిర్వర్తించాలని, లేదంటే మరో డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే డీఈవో కార్యాలయం పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిందిగా డీఆర్వో విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

ఇద్దరు ఉద్యోగులను మార్చాలంటూ నోటీసులు

డీఈవో కార్యాలయంలో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కలెక్టర్ సత్యశారద స్పందించి వారిద్దరిని డీఈవో కార్యాలయం నుంచి మార్చాల్సిందిగా డీఈవోకు నోటీసులు జారీ చేశారు. తొలుత ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదుతో ఏపీవోగా పనిచేస్తున్న ఎస్టీటీ ఉపాధ్యాయుడు రాజగోపాల్‌రెడ్డిని మార్చాల్సిందిగా నోటీసులు అందజేయగా, అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ అదే కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఆమె.. శుక్రవారం ఎస్బీ శ్రీనివాస్ అనే సీనియర్ అసిస్టెంట్‌ను కార్యాలయం నుంచి మార్చాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. దీంతో విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వెన్నులో వనుకు వణుకు మొదలైనట్లు వారిలో వారే చర్చించుకుంటున్నారు.

ప్రక్షాళన కానుందా...?

వరంగల్ డీఈవో కార్యాలయం ప్రక్షాళన కానుందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి విద్యాశాఖ వర్గాల నుంచి. విద్యాశాఖ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్ కొరడా ఝులిపిస్తుంటే, నిఘా వర్గాలు దృష్టి సారించినట్లు తెలిసింది. నెల రోజుల్లో విద్యాశాఖలో సమూల మార్పులు కానున్నాయనే అభిప్రాయాలను అధికారులు సైతం ధృవీకరిస్తున్నారు. మొత్తంగా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించడంతో విద్యాశాఖ గాడిలో పడనుందనే అభిప్రాయాలు ఉపాధ్యాయ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

విజ్ఞానంతోనే అభివృద్ధి సాధ్యం

ఖిలావరంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యతో విజ్ఞానం.. విజ్ఞానంతో అభివృద్ధి సాధ్యమవుతుందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్‌కుమార్, సీపీఐ జిల్లాకార్యదర్శి మేకల రవి అన్నారు. ఆదివారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గకరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి దళితులకు సమాన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. భవిష్యత్‌లో రాజ్యాంగాన్ని రద్దు చేయాలని మనువాదులు కుట్ర పన్నుతున్నారని, అందులో భాగంగానే ఇటీవల ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో సుప్రంకోర్టు తీర్పు చెప్పిందని అన్నారు. రాజ్యాం గాన్ని కాపాడుకోవడానికి దళితులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.





ఈ వారమే విడుదల

ఈ సోమవారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు


ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
సర్వైవింగ్ బ్లాక్ హాక్ డౌన్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 10
కథలిక్క నేరమిల్లై	తమిళచిత్రం	ఫిబ్రవరి 10
ది విచ్చ	యానిమేషన్ మూవీ	ఫిబ్రవరి 11
ది కోబ్రా కై 6	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 13
డాగ్ డేస్ అవుట్	యానిమేషన్ సిరీస్	ఫిబ్రవరి 13
ధూమ్‌ధామ్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 14
ఐ యామ్ మారీడ్...బట్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 14
మెలో మూవీ	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 14
అమెజాన్ ప్రైమ్		
మై ఫాల్ట్: లండన్	హాలీవుడ్ మూవీ (తెలుగులో)	ఫిబ్రవరి 13
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
బాబీ ఔర్ రిషీ కీ లవ్ స్టోరీ	హిందీ చిత్రం	ఫిబ్రవరి 11
జీ 5		
ప్యార్ టెస్టింగ్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 14
సోనీ లివ్		
మార్కో	మలయాళ చిత్రం	ఫిబ్రవరి 14
ఆహా...		
మధురై పయనం చెన్నై పొన్నుం	తమిళ చిత్రం	ఫిబ్రవరి 14

చార్లీ ఆచూకీ తెలిసిందా?



వీర్ ఖురానా, కోయల్ చద్దాలది పెద్దల కుదుర్చిన పెళ్లి. పెళ్లయిన మొదటి రోజే వారిపై ఓ క్రిమినల్ గ్యాంగ్ దాడి చేస్తుంది. 'ధూమ్ ధామ్'గా పెళ్లి చేసుకొని ఎంతో ఆనందంగా హనీమూన్‌కు సిద్ధమైన ఆ దంపతుల తొలి రాత్రే కాళరాత్రి అవుతుంది. అనుకోని ఆపద వారి జీవితాలను ఎలాంటి ప్రమాదంలోకి నెట్టింది? దాని నుంచి బయటపడేందుకు వారు చేసిన ప్రయత్నాలేంటి? ఈ నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగే చిత్రం 'ధూమ్‌ధామ్'. 'చార్లీ ఆచూకీ చెప్పండి' అంటూ వేధిస్తున్న గ్యాంగ్‌లోని కొందరు కథానాయిక చేతిలో చావు దెబ్బలు తిని, భంగపడతారు. ఇక అప్పటినుంచి హీరో, హీరోయిన్లు, విలన్ గ్యాంగ్ మధ్య వచ్చే సన్నివేశాలు ఆద్యంతం నవ్వుల్లో ముంచెత్తుతాయి. ఈ చిత్రాన్ని రిషబ్‌సేత్ దర్శకత్వంలో జియో స్టూడియోస్ నిర్మించింది. యామీ గౌతమ్, ప్రతీక్ గాంధీ, పవిత్రా సర్కార్ ప్రధాన తారాగణం.

విభిన్నం



మనసుతో మాయ చేస్తుంది

మహిళలు అరుదుగా కనిపించే ఇంద్రజాల రంగాన్ని ఎంచుకొని... అందులో రాణించి, 27 ఏళ్లుగా మెంటలిస్ట్‌గా, ఇల్యూజనిస్ట్‌గా, మెజీషియన్‌గా సత్తా చాటుతున్నారు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన సుహానీ షా. తాజాగా హైదరాబాద్ ఫిక్కీ ఫ్లో మహిళా సంస్థ ఆధ్వర్యంలో, మ్యాజిక్ ఆఫ్ మెంటలిజం కార్యక్రమంలో పాల్గొన్న సుహానీను 'నవ్య' పలకరించింది. ఆ విశేషాలు...

"ఆరేళ్ల వయసులోనే ఇంద్రజాలం పట్ల ఆసక్తి ఏర్పడింది. ఆ రోజు నాకిప్పటికీ గుర్తే! అది ఆదివారం. టీవీలో ఒక స్థానిక ఇంద్రజాలికుడి ప్రదర్శన చూస్తున్నాను. అతను ప్రదర్శించిన ఒక చిన్న మ్యాజిక్ నన్ను విపరీతంగా ఆకర్షించేసింది. చాలా మంది పిల్లలు ఇంద్రజాలాన్ని చూసి సంతోషిస్తారు. కానీ నేను ఇంద్రజాలాన్ని చూడడం కాదు, ప్రదర్శించాలని తపన పడ్డాను. ఈ విషయాన్ని నాన్నతో చెప్పి, ఇంద్రజాలికురాలిగా ఎదగాలని ఉందని చెప్పాను. నాన్న నా మాటలను కొట్టిపారేయకుండా, ఆ విద్యను నేర్పే వ్యక్తి కోసం వెతకడం మొదలుపెట్టారు. ఆ క్రమంలో ఇంద్రజాలికుల కోసం తీవ్రంగా అన్వేషించారు. అయితే చాలా కాలం తర్వాత అహ్మదాబాద్‌లోని, కలోల్ అనే గ్రామంలో నివసిస్తున్న ఒక కుటుంబం గురించి తెలిసింది. వాళ్ల ప్రదర్శనల్లో ఇంద్రజాలికులకు సహాయకులుగా వ్యవహరిస్తూ ఉంటారు. నాకు ఆ విద్య నేర్పించమని మా అమ్మానాన్న వాళ్లను ఒప్పించారు. సాధారణంగా ఇంద్రజాలికులు, సహాయకులకు ఇంద్రజాలాన్ని నేర్పిస్తూ ఉంటారు. నా విషయంలో ఆ సహాయకులే నాకు ఇంద్రజాలాన్ని నేర్పించడం జరిగింది. వాళ్ల దగ్గర ఆ విద్య నేర్చుకుని, పూర్తి స్థాయిలో ప్రదర్శన ఇవ్వడానికి నాకు 10 నెలలు పట్టింది. 1997, అక్టోబరు 22న ఆరేళ్ల వయసులో నేను నా మొదటి ప్రదర్శన ఇచ్చాను. అలా దేశవిదేశాల్లో ప్రదర్శనలిస్తూ వస్తున్నాను. ఇప్పటి వరకూ ఈ 27 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఐదు వేల ప్రదర్శనలిచ్చాను.

జీవితమే నేర్పింది

ఇంద్రజాలం నేర్పిస్తే నేర్చుకోగలిగే వీలున్న విద్య. కానీ మైండ్ రీడింగ్ కోసం నేను పూర్తిగా పుస్తకాల మీదే ఆధారపడ్డాను. మానసిక శాస్త్రం, మానవ ప్రవర్తనల గురించి లోతుగా అధ్యయనం చేశాను. వీటికి సంబంధించి పుస్తకాలు కూడా రాశాను. అలా ఒక సమయంలో మానసిక శాస్త్రం, మానవ ప్రవర్తనల పట్ల నాకున్న పరిజ్ఞానాన్ని ఇంద్రజాలంతో ముడిపెట్టాలని నిర్ణయించుకున్నాను. ఆ విధంగా మెంటలిస్ట్ (ఇతరుల మనసులో ఉన్న విషయాలను చెప్పగలిగే కళాకారుడు)ను అయ్యాను. ఒకటో తరగతిలోనే చదువుకు స్వస్తి చెప్పినా, రోజువారీ అనుభవాలు, వ్యక్తుల నుంచి కొత్త విషయాలు నిరంతరంగా నేర్చుకుంటూనే ఎదిగాను. చదువు మానేసినందుకు నాకు బాధ లేదు. మిగతా పిల్లల కంటే మెరుగ్గా బాల్యాన్ని గడపగలిగాననే సంతృప్తి ఉంది. నేర్పించేవారెవరూ లేరు కాబట్టి అన్నీ స్వయంగా నేర్చుకునే అలవాటు మరింత మెరుగుపడింది. నేర్చుకోవాలనుకునేవారు ఎప్పటికీ నేర్చుకుంటూనే ఉంటారని అమ్మ అంటూ ఉంటుంది. అది అక్షరాలా నిజం. నేర్చుకోవాలనే కోరిక లేని పిల్లలను ఎంత మంచి బడిలో వేసినా రాణించలేరు.

నకిలీ బాబాల గురించి కళ్లు తెరిపిస్తూ...

మెంటలిజం అన్నది అతీంద్రియ విద్య కాదు. అదొక నైపుణ్యం, ఒక కళ. కానీ దీనికి దైవత్వాన్ని ఆపాదించి, అతీంద్రియ శక్తుల్లా ప్రదర్శిస్తూ, అమాయకులను మోసం చేసి పబ్బం గడుపుకునే నకిలీ బాబాలు, సన్యాసులను ఎంతోమందిని మనం చూస్తున్నాం. గారడీ విద్యలు ప్రదర్శించే ఇలాంటి వాళ్లను చూసి మోసపోకుండా ప్రజలను చైతన్యవంతం చేయడానికి నా ఇంద్రజాలం ఉపయోగపడుతుందనే భావిస్తున్నా. మెంటలిజంతో మూఢనమ్మకాలను పారదోలాలన్నది నా లక్ష్యం. కాబట్టే నా ప్రదర్శనల్లో ఇంద్రజాల విద్య పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తూ ఉంటాను. ఎంతో మంది నా దగ్గరకు వచ్చి, వాళ్ల కష్టాలను నా ఇంద్రజాల శక్తితో మాయం చేయమని, సమస్యలను పరిష్కరించమని అడుగుతూ ఉంటారు. ప్రజల విశ్వాసమే అతి పెద్ద ఇంద్రజాలం. మనల్ని మనం నమ్మగలిగితే మనమే ఒక ఇంద్రజాలంలా మారిపోయి జీవితాలను మెరుగు పరుచుకోగలుగుతాం! ప్రజల భయాలనే కొందరు వ్యాపారాలుగా మలుచుకుంటూ ఉంటారు. కానీ వాళ్ల చేతుల్లో మోసపోకుండా ఉండాలంటే ప్రజలు మెలకువగా వ్యవహరిస్తూ, స్వయంస్వావలంబన సాధించాలి.



ఎవరైనా నేర్చుకోవచ్చు

ఇంద్రజాలం అన్నది పూర్తిగా భిన్నమైన రహస్య కళ. మెజీషియన్, మెంటలిస్ట్, ఇల్యూజనిస్ట్ ఇవన్నీ భిన్నమైన నైపుణ్యాల్లా కనిపించినా మొత్తం ఇంద్రజాలం కోవకే చెందుతాయి. సాధారణంగా ఈ రంగంలోకి రావడానికి అమ్మాయిలెవరూ ఇష్టపడరు. కానీ ఆసక్తి ఉంటే అమ్మాయిలు రాణించలేని రంగమంటూ ఏదీ లేదు. ఇంద్రజాలం పట్ల ఆసక్తి ఉన్నవాళ్లు యూట్యూబ్ చూసి చిన్నచిన్న ట్రిక్స్ నేర్చుకోవచ్చు. వాటిని సమర్థంగా ప్రదర్శించే స్థాయికి చేరుకున్న తర్వాత, ఆ ప్రయాణంలో ఇంద్రజాలంలో ఏ జోనర్ వాళ్లకు సరైనదో గ్రహించి ఆ దిశగా ప్రయాణించవచ్చు. ఇంద్రజాలాన్ని నేర్పించే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిని కూడా సద్వినియోగం చేసుకోవచ్చు. ఇప్పటి తరం ఎంతో తెలివైనది. వాళ్లకు కొత్తగా దేన్నీ నేర్పించవలసిన అవసరం లేదు. అయితే ప్రపంచానికి దయ, ప్రేమ, కరుణ, ఆనందాల అవసరం ఉంది. కాబట్టి వాటిని నచ్చిన మార్గంలో ఈ ప్రపంచానికి అందించమని నేటి తరాన్ని నేను కోరుకుంటున్నాను."

• గోగుమళ్ల కవిత

ముత్యాలతో మురిపెంగా...

కొత్త ఫ్యాషన్లు ఎన్ని వచ్చినా... ముత్యాల నగలపై మహిళలకుండే మక్కువ తగ్గదు. సాధారణంగా ఉంటూ చూడగానే ఆకట్టుకునే ముత్యాల ఆభరణాలు అన్ని వయసులవారికీ అందంగా నప్పుతాయి. రోజువారీ పెట్టుకోవడానికి వీలుగా ఉండే ట్రెండీ 'ముత్యాల నగలు' ఇవే...



లాకెట్: తెల్లని సీజెడ్ రాయికి అంత కన్నా పెద్ద సైజు ముత్యాన్ని జోడించి లాకెట్‌లా రూపొందిస్తారు. దీనిని సన్నని బంగారు గొలుసుకి అమరుస్తారు. ఈ ముత్యం గొలుసు మెడ వరకు వస్తుంది. అన్ని రకాల దుస్తుల మీద చక్కగా అమరుతుంది. టీషర్ట్, జీన్స్ లాంటి మోడరన్ దుస్తులు ధరించే యువతులకు బాగుంటుంది.



బ్రాస్‌లెట్: అంత చిన్నవి కాకుండా కొద్దిగా పెద్ద ముత్యాలను మందపాటి దారంతో కూర్చి బ్రాస్‌లెట్‌ను తయారు చేస్తారు. ఈ ముత్యాల బ్రాస్‌లెట్‌ను చేతికి పెట్టుకుంటే ధరించిన డ్రెస్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. నేవీ బ్లూ, ముదురు గులాబీ, లావెండర్ రంగు దుస్తుల మీద హుందాగా ఉంటుంది. దీనిని ఉద్యోగినులు ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు.



ఉంగరం: శ్వేత వర్ణంలో మెరిసే ముత్యాన్ని బంగారు ఉంగరంలో అమరుస్తారు. ఈ ముత్యపు ఉంగరం సంప్రదాయ దుస్తులతోపాటు ఆధునిక దుస్తుల మీద కూడా రాయల్‌గా కనిపిస్తుంది. కాలేజీ యువతుల నుంచి మధ్య వయసు మహిళల వరకు అందరూ ఈ ఉంగరాన్ని ఎంపిక చేసుకుంటున్నారు.



కమ్మలు: ముత్యాలతో రూపొందించిన వివిధ రకాల డ్రాప్స్, స్టడ్స్, హూప్స్ రింగ్స్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగినులతోపాటు గృహిణులు, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు వీటిని పెట్టుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఎలాంటి ముఖాకృతికైనా ఈ ముత్యాల కమ్మలు సొగసును అందిస్తాయి.

మేని మెరుపు కోసం...

చర్మం మృదువుగా మంచి ఛాయతో మెరవాలని రకరకాల క్రీమ్‌లు, లోషన్లు వాడుతూ ఉంటారు. వీటిలోని రసాయనాల వల్ల చర్మానికి హాని కలుగవచ్చు. ఆరోగ్యవంతమైన చర్మంతో ముఖం కళకళలాడాలంటే.. నిపుణులు సూచిస్తున్న ఈ జాగ్రత్తలు పాటించవచ్చు.

- కొంతమంది ముఖానికి వేసుకున్న మేకప్‌ను తొలగించకుండా అలాగే నిద్రిస్తుంటారు. దీనివల్ల చర్మం పొడారిపోయి నిర్జీవంగా కనిపిస్తుంది. పడుకోనేముందు మేకప్ అంతటినీ టిష్యూ పేపర్ లేదా పలుచని గుడ్డతో మెల్లగా తుడిచేయాలి. చల్లని నీళ్ల చిలకరించుకుంటూ ముఖాన్ని కడుక్కోవాలి. అప్పుడే చర్మ రంధ్రాలు శుభ్రమై తేమతో నిండుతాయి. ముఖం సహజంగా కాంతులీనుతుంది.
- ముఖం జిడ్డుగా ఉందని వేడి నీళ్లతో కడగడంవల్ల చర్మంపై సహజ నూనె ఉత్పత్తి తగ్గిపోతుంది. తేమ నిలవక చర్మం ఎండినట్లయి కళావిహీనంగా మారుతుంది. ముఖాన్ని ఎప్పుడూ గోరువెచ్చని లేదా చల్లని నీళ్లతో మాత్రమే కడుక్కోవాలి.
- ముఖాన్ని గట్టిగా రుద్దుతూ కడగకూడదు. అలా చేస్తే చర్మం మీద ముడుతలు వచ్చే ప్రమాదం ఉంటుంది. ముఖం మీద నీళ్లు చల్లుకుంటూ సున్నితంగా శుభ్రం చేసుకోవాలి. ముఖాన్ని మెత్తని తువాలుతో అద్దుతూ మెల్లగా తుడుచుకోవాలి.
- మొటిమలు వచ్చినప్పుడు వాటిని గిల్లడం, ఒత్తడం చేయకూడదు. ముఖాన్ని సున్నిపిండితో శుభ్రం చేసుకోవాలి. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తినాలి. తరచూ మంచినీరు తాగాలి. అయినా మొటిమల తీవ్రత తగ్గకపోతే వైద్యుని సూచన ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలి.



- బయటికి వెళ్లే ముందు ముఖానికి సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. దీనివల్ల సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల నుంచి చర్మానికి రక్షణ లభిస్తుంది. చర్మం నల్లబడకుండా ఉంటుంది.
- నిత్యం వ్యాయామం చేస్తూ ఉంటే చర్మంలోని వ్యర్థ పదార్థాలన్నీ చెమట రూపంలో బయటికి వెళ్లిపోతాయి. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం యోగా, ధ్యానం, నడక అలవాటు చేసుకుంటే మనసు ప్రశాంతంగా మారుతుంది. హార్మోన్ల పనితీరు సక్రమంగా ఉంటుంది. ముఖ వర్చస్సు పెరుగుతుంది.

వ్యర్థాలను వదిలించారు...

ఆదాయ మార్గం చూపించారు!

ఆదాయాన్నిచ్చే సాగుని మానుకోలేక, వ్యర్థాల్ని వదిలించుకోలేక సతమతమవుతున్న రైతులను కొత్తదారిలో నడిపించారు అనసూయ జెనా. భర్తతో కలిసి ఆమె చేసిన ప్రయత్నం... అరటి వ్యర్థాలను ఆదాయ మార్గంగా మార్చింది. వెయ్యికి పైగా రైతు కుటుంబాల ఆర్థిక సుస్థిరతకు దోహదం చేసింది. "నిబద్ధతతో, కలిసికట్టుగా పని చేయడమే మంచి ఫలితాలు సాధించే మార్గం" అంటున్న అనసూయ కథ ఆమె మాటల్లోనే...

"అరటి చెట్ల నుంచి గెలలు తీసేసిన తరువాత.... నరికిన చెట్లను తోటలలోంచి తొలగించడం శ్రమతోనే కాదు, ఖర్చుతో కూడా కూడుకున్న వ్యవహారం. కూలీలకు రోజుకు రెండువేల రూపాయల వరకూ ఇవ్వాలి. సాధారణ రైతులు ఈ ఖర్చు భరించలేరు. దాంతో తమ తోటల పక్కనే వాటిని పడేసి, ఎండిపోయిన తరువాత కాల్చేసేవారు. ఆ పొగ చుట్టు పక్కల ప్రాంతాల్లో వ్యాపించేది. ఇక మరికొందరు రైతులు ఆ వ్యర్థాలను ఊరి బయట పారబోసేవారు. ఆ కుప్పలు పెద్ద గుట్టల్లా ఉండేవి. ఎండకు ఎండి, వానకు తడిసి, కుళ్లిపోవడంతో.. ఆ వైపు వెళ్లలేనంత దుర్వాసన. ఈ వాతావరణ కాలుష్యం ప్రభావం సమీప గ్రామాల్లో కూడా తీవ్రంగానే ఉండేది. కొన్నేళ్ల క్రితం మాకు ప్రతిరోజూ ఎదురయ్యే దృశ్యాలివి.

వాటికి అర్థం కల్పించేందుకు...

మాది ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లాలోని బలిపట్న. మా జిల్లాలో సాగుచేసే వాణిజ్య పంటల్లో అరటి ప్రధానమైనది. ముఖ్యంగా మాకు దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బనమాలిపూర్ అరటి పంటకు ప్రసిద్ధి. దాదాపు ప్రతి ఇంటి పెరట్లోనూ అరటి మొక్కలు ఉంటాయి. రైతులకు ఆ పంట జీవనాధారమైతే, దాని ద్వారా వచ్చే వ్యర్థాలు తీవ్ర అనారోగ్యానికి కారణమయ్యేవి. నా భర్త కాశీనాథ్ జెనా గత ముప్ఫయ్యేళ్ల నుంచి రూరల్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు, అణగారిన వర్గాలకు జీవనోపాధి కల్పించడం లాంటి కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండేవారు. తరచుగా మేము బనమాలిపురా మీదుగా ప్రయాణించేవాళ్లం. అప్పుడు అరటి వ్యర్థాల సమస్యే మా సంభాషణల్లో ప్రధానంగా ఉండేది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే... రాబోయే రోజుల్లో దుష్ప్రభావాలు మరింత పెరిగిపోతాయనే ఆందోళన కలిగింది. కొందరు రైతులతో మాట్లాడినప్పుడు... పంట కోత తరువాత వ్యర్థాల్ని వదిలించుకోవడమే వారి ప్రధాన సమస్య అని గ్రహించాం. దీన్ని ఇతర ప్రాంతాల్లో ఎలా పరిష్కరిస్తున్నారో తెలుసుకోడానికి నా భర్త ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రల్లో పర్యటించారు. అరటి బెరళ్ళ నుంచి నారు తీసి వస్త్రాలు నేయడం, ఉత్పత్తుల తయారీ లాంటివి గమనించారు. ఈ విధంగా వ్యర్థాలకు ఒక అర్థం కల్పించవచ్చనిపించింది. ఎన్నో నెలలపాటు పరిశోధన చేసిన తరువాత... 2021లో 'జయదేవ్ బనానా ఫార్మర్స్ అండ్ ఆర్టిసన్స్ అసోసియేషన్'ను ఏర్పాటు చేశాం.





మూడు విభాగాల్లో...

ఆ తరువాత ఒక ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసి, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఇ) మంత్రిత్వశాఖకు అందజేశాం. 'స్పెషల్ పర్పస్ వెహికిల్' (ఎస్‌పీవీ)గా ఈ సంఘాన్ని పరిగణిస్తూ... గ్రామీణ ఉపాధి, ఆర్థికాభివృద్ధి కోసం సహకరించడానికి ఆ శాఖ అంగీకరించింది. తొలి విడతగా, 350 మంది రైతులు మాతో చేరారు. ఆ సంఖ్య క్రమంగా పెరిగి ఇప్పుడు వెయ్యి దాటిపోయింది. అలాగే దాదాపు 40 మంది యువతకు, మహిళలకు ఉద్యోగాలను మా కల్పించాం. ఉత్పత్తుల విషయానికి వస్తే... వాటిని ఆహారం, వ్యవసాయం, ఉపయుక్తమైన వస్తువులు అనే మూడు విభాగాల్లో తయారు చేస్తున్నాం. అరటి దవ్వ పచ్చడి, జామ్, మురబ్బా, జ్యూస్, వడియాల్లాంటి ఆహార ఉత్పత్తులు, భూమి సారాన్ని పెంచే సూక్ష్మ పోషకాలు ఉన్న 'జీవసార', అలాగే అరటి నారతో బ్యాగ్‌లు, కోస్టర్లు, బాస్కెట్లు, గిఫ్ట్ బాక్సులు, టేబుల్ మ్యాట్స్.. ఇలా అనేక ఉత్పత్తులను తయారు చేయించి విక్రయిస్తున్నాం. ఇంతకుముందు రైతుల వద్దకు మేమే వెళ్లి.. వ్యర్థాలను సేకరించేవాళ్లం, ఇప్పుడు వారే నేరుగా మా కేంద్రానికి వచ్చి విక్రయిస్తున్నారు. ఎలాంటి ఖర్చు లేకుండానే వారి పొలాలు తదుపరి పంట కోసం శుభ్రంగా మారుతున్నాయి. ఉత్పత్తుల తయారీ ద్వారా లాభాలు కూడా దక్కుతున్నాయి.

పురస్కారాలు... ప్రశంసలు



ఖుర్దాతోపాటు కటక్, పూరీ జిల్లాల రైతులు కూడా మా సంఘంలో భాగస్వాములయ్యారు. వారు తమ పంట దిగుబడి వల్ల వచ్చే మొత్తంతో పాటు ఈ వ్యర్థాల ద్వారా సగటున రూ.7 వేల నుంచి రూ.10 వేల మధ్య ఆదాయం పొందుతున్నారు. మా కార్యక్రమాలకు గుర్తింపుగా... రెండేళ్ల నుంచి ఎన్నో పురస్కారాలు లభించాయి. అలాగే దేశంలోని పలుచోట్ల మేము ఏర్పాటు చేసిన ప్రదర్శనలకు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మా ప్రాంతంలో అరటి వ్యర్థాలను తగులబెట్టడం, కుప్పలుగా పోయడం లాంటి దృశ్యాలు కనిపించడం లేదు. మరోవైపు రైతులకు అదనపు ఆదాయం కూడా లభిస్తోంది. ఒక సమస్య పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా నిలబడి, నిబద్ధతతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయనడానికి మా సంస్థ ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఇంతకన్నా సంతోషం, సంతృప్తి ఇంకేం ఉంటుంది?"

ఆలుగడ్డలు నిల్వ ఉండాలంటే...

బజారు నుంచి తెచ్చిన ఆలుగడ్డలు కొద్ది రోజులకే మొలకెత్తడం చూస్తుంటాం. ఇలా మొలకలు వచ్చిన ఆలుగడ్డను తినడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఆలుగడ్డలను ఎక్కువ రోజులు తాజాగా ఉంచుకోవచ్చు.



- ఆలుగడ్డలను గాలి తగిలేలా ఉంచాలి. నేరుగా సూర్యకాంతి పడకుండా చూసుకోవాలి. ఎండ తగిలితే ఆకుపచ్చ రంగులోకి మారి చేదుగా అవుతాయి. చీకటి ప్రదేశాల్లో ఉంచితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.
- తేమ తగిలితే ఆలుగడ్డలు తొందరగా పాడవుతాయి. వీటిని ఫ్రిజ్‌లో కూడా పెట్టకూడదు. చల్లదనం వల్ల వాటిలోని పిండిపదార్థం చక్కెరగా మారుతుంది. దీంతో అవి సహజ రుచిని కోల్పోతాయి.
- ఆలుగడ్డలను గోనె సంచులు, వెదురు బుట్టలు, కాగితం సంచుల్లో గాలి ఆడేలా నిల్వ చేయడం మంచిది. అలాకాకుండా ప్లాస్టిక్ కవర్లలో మూసి ఉంచితే మొలకలు వచ్చి తొందరగా పాడవుతాయి.
- ఆలుగడ్డలను టమాటాలు, నిమ్మకాయలు, ఉల్లిపాయలు, అరటిపండ్లతో కలిపి ఉంచకూడదు. వీటి నుంచి వెలువడే ఎథిలీన్ వాయువు వల్ల ఆలుగడ్డలపై పసుపు రంగు మొలకలు వచ్చేస్తాయి. ఇలా మొలకెత్తినవాటిలో శరీరానికి హాని కలిగించే గ్లైకోఆల్కలైట్ తయారవుతుంది.
- ఆలుగడ్డలను కొనేటప్పుడు గట్టిగా ఉన్నవాటినే తీసుకోవాలి. ఏమాత్రం మెత్తగా ఉన్నా అవి త్వరగా కుళ్లిపోతాయి.
- కొంతమంది ఆలుగడ్డలను కొన్నతరవాత వాటిపై మట్టి ఉందని నీళ్లలో నానబెట్టి కడిగేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల ఆలుగడ్డలు ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. వాటికి నీళ్ల తగలకుండా ఉంటే చాలా రోజులు తాజాగా ఉంటాయి.

దిక్సూచి
DIKSUCHI

ఇంజనీరింగ్ విద్యార్థులకు
ఇంటర్న్‌షిప్ అవకాశాలు



మార్కెట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో చాలా మంది ఇంజనీరింగ్ విద్యార్థులు వెనకబడుతుంటారు. ఇందుకు ప్రధాన కారణం ఉద్యోగానికి అవసరమైన స్కిల్స్‌ను నేర్చుకోకపోవడమే. అలాంటి వారికి ఇంటర్న్‌షిప్‌లు ఉపయోగపడుతుంటాయి. వీటి ద్వారా కాలేజీలో నేర్చుకున్న థియరిటికల్ నాలెడ్జ్‌ని రియల్ వరల్డ్ సిట్యువేషన్స్‌కు అప్లై చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన ఇన్‌సైట్స్ తెలుసుకోవడంలో ఇంటర్న్‌షిప్స్ ఉపయోగపడతాయి. అకడమిక్‌కి, ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన స్కిల్స్ తేడా వారికి అవగతమవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలు అందించే కొన్ని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ ఇవి. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్

కేంద్ర పునరుత్పాదన మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటర్న్‌షిప్ ఇది. ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, లా తదితర ప్రోగ్రామ్స్ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మంత్రిత్వశాఖ అవసరాలను బట్టి సంవత్సరానికి రెండుసార్లు కూడా దీనిని ప్రకటిస్తారు. ఈ ఇంటర్న్‌షిప్ కాలపరిమితి రెండు నుంచి ఆరు నెలలు ఉంటుంది. నెలకు 15 వేల రూపాయలు ఉపకారవేతనం ఇస్తారు. https://mnre.gov.in/en/national-renewable-energy-internship-programme-2/

ఐఐటీ పాలక్కడ్ సమ్మర్ ఇంటర్న్‌షిప్

ఈ ఇంటర్న్‌షిప్ ఇంజనీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ విద్యార్థులకు ఉద్దేశించినది. మూడు లేదా నాలుగో సంవత్సరం చదువుతున్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆరువారాల ఈ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన రీసెర్చ్ ట్రైనింగ్ ఉంటుంది. 12000/- స్టయిఫండ్ కూడా ఇస్తారు. 2025 మార్చి 15లోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://sun.iitpkd. ac.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

డిజిటల్ ఇండియా ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఈ ఇంటర్న్‌షిప్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందిస్తుంది. ఇంజనీరింగ్ యూజీ, పీజీ, లా చేస్తున్న విద్యార్థులు దీనికి అర్హులు. ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే ముందు రాసిన పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. రెండు నెలల కాలవ్యవధి ఉంటుంది. నెలకు పదివేల రూపాయల స్టయిఫండ్ ఇస్తారు. www.meity.gov.in

వాద్వానీ, మద్రాస్ ఐఐటీ సమ్మర్ ఇంటర్న్‌షిప్స్

వాద్వానీ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఏఐ, మద్రాస్ ఐఐటీ కలిసి ఉమ్మడిగా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ లేదా సైన్స్ బ్రాంచ్‌ల్లో యూజీ ప్రోగ్రామ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు, పీజీ అయితే మొదటి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలలు ఉంటుంది. వ్యక్తిగతంగా హాజరయి పూర్తి చేయాల్సిన ఇంటర్న్‌షిప్ ఇది. వీరికి స్టయిఫండ్ కూడా అందజేస్తారు. దరఖాస్తులు 2025 ఫిబ్రవరి 15లోపు పంపుకోవాలి.
https://wsai.iitm.ac.in/2025/01/05/wsai-summer-internships-2025/

టెక్ ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు చెందిన 'టెలీకామ్ ఇంజనీరింగ్ సెంటర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోంది. ఆరు నెలలపాటు ఇది ఉంటుంది. అవసరమైన పక్షంలో దీనిని ఒక సంవత్సరం వరకు పొడిగించుకోవచ్చు. ఇంటర్న్‌షిప్‌లో మొత్తం రూ.15,000స్టయిఫండ్ ఇస్తారు. https://www.myscheme.gov.in/schemes/tecis#details

BITSAT 2025
నోటిఫికేషన్ విడుదల

దేశంలోని ఇంజనీరింగ్ విద్యను అందించే ప్రతిష్ఠాత్మక సంస్థలో 'బిర్లా ఇన్‌స్టిట్యూట్' (బిట్స్) ఒకటి. పిలానీ, గోవా, హైదరాబాద్‌ల్లో బిట్స్‌కు క్యాంపస్‌లు ఉన్నాయి. ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థులు జేఈఈ, తమ రాష్ట్రాల ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లతో పాటుగా దీనిని కూడా రాస్తుంటారు.


బిట్స్ ఎంట్రెన్స్ స్కోరుకు కూడా కొన్ని ఇతర సంస్థలు అడ్మిషన్ ఇస్తున్నాయి. ఇంటర్మీడియేట్ అర్హతతో బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరవచ్చు. ఇంటర్ సబ్జెక్టులతోపాటు ఈ ఎంట్రెన్స్‌లో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్‌ల్లో కూడా ప్రశ్నలు అడుగుతారు. జేఈఈ స్థాయిలో అత్యుత్తమంగా స్కోరు సాధించిన విద్యార్థులకు ఇక్కడ సీటు లభిస్తుంది. 390కి కనీసం 240 మార్కులు సాధించిన వారికి సీటు దొరికే అవకాశం ఉంది. బీఫార్మసీకి అయితే ఇంకా తక్కువ స్కోరుకు కూడా దొరుకుతుంది.

బిట్స్ ఎంట్రెన్స్ 2025 పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది.

- సెషన్-1 ఎంట్రెన్స్ 2025 మే 26 తేదీ నుంచి 30వ తేదీ వరకు.
- సెషన్-2 ఎంట్రెన్స్ 2025 జూన్ 22 తేదీ నుంచి 26 తేదీ వరకు.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 18
ఆసక్తి గల అభ్యర్థులు రెండు సెషన్లు లేదా ఒక్క సెషన్ అయినా రాయవచ్చు. రెండింటిలో అత్యుత్తమంగా సాధించిన మార్కులనే ఫైనల్ స్కోరుగా పరిగణనలోకి తీసుకుంటారు.

కోర్సులు:
బీఈ: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ సస్టయినబిలిటీ.
బీఫార్మసీ:
ఎమ్మెస్సీ: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయలాజికల్ సైన్సెస్, ఎకనామిక్స్, సెమీ కండక్టర్ అండ్ నానో సైన్స్, జనరల్ స్టడీస్.
పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం,



సబ్జెక్టులు: ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి.
పార్ట్-1: ఫిజిక్స్ 30,
పార్ట్-2: కెమిస్ట్రీ 30,
పార్ట్ 3
ఏ. ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ 10,
బి. లాజికల్ రీజనింగ్ 20.
పార్ట్-4: మేథ్స్/బయాలజీ(బీఫార్మసీ కోసం) 40 ప్రశ్నలు ఉంటాయి.

పరీక్ష విధానం: పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొత్తం 130 ప్రశ్నలను మూడు గంటల్లో పూర్తిచేయాలి. అయితే సమయానికి సంబంధించి సెక్షన్ల వారీ నిబంధనలు లేవు. కానీ నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతీ సరైన జవాబుకు మూడు మార్కులు, తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

SCHOLARSHIP ALERT

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recog nised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date: 15-02-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TCPS27

JK Tyre Shiksha Sarthi

Description: JK Tyre & Industries Pri vate Limited invites applications from the daughters of heavy vehicle drivers who are pursuing technical or non-technical undergraduate or diploma courses and reside in select locations.
Eligibility: Female students who are daughters of heavy vehicle drivers and pursuing technical or non-technical undergraduate or diploma courses are eligible to apply. Students must have received a minimum of 55% marks in their previous academic year. The annual family income of applicants must be less than or equal to INR 5,00,000. Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttara khand, Karnataka, or Tamil Nadu.
Prizes & Rewards: One-time scholarship:
Technical Undergraduate Courses: INR 25,000
Non-Technical Undergraduate Courses: INR 15,000
Diploma Courses: INR 15,000
Last Date to Apply: 15-02-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/JKTS1

Charpak Bachelor's

Description: Charpak Bachelor's Scholarship 2025 is an opportunity offered by the French Government to Indian students who wish to pursue a full-time undergraduate degree in one of the institutions in France.
Eligibility: Open for Indian nationals or OCI card holders who are 23 years old or younger at the time of application. Applicants must have completed secondary school in India and have applied for a bachelor's degree program starting on 1st September 2025. Students must have never previously studied at an educational institution in France.
Prizes & Rewards: The scholarship offers a monthly living allowance of 860 euros and other benefits.
Last Date to Apply: 28-02-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/CBSS3

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విజయ్ సినిమాలో సంజయ్‌దత్?

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారనే వార్త టాలీవుడ్‌లో ప్రచారమవుతోంది. అంతేకాదు 'ద మమ్మీ' యాక్టర్ అర్నాల్డ్ వోస్లూ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నాడనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలపై మేకర్స్ ఇప్పటివరకూ స్పందించలేదు. కాగా, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ సరికొత్త పాత్రలో కనిపించనున్నాడట. 1854-78 మధ్య కాలంలో జరిగే కథ కాబట్టి, సినిమాలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తోంది. చిత్ర షూటింగ్ ఈనెల మూడో వారంలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. మొదటి షెడ్యూల్‌లో విజయ్ దేవరకొండ ఎంట్రీ సీన్‌ను చిత్రీకరించనున్నట్లు టాక్. నాని హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో వచ్చిన 'శ్యామ్ సింగరాయ్' చిత్రం విజయవంతమైంది. దీంతో విజయ్ దేవరకొండ సినిమాపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విజయ్ తన తల్లితో కలిసి హాజరయ్యారు. వారు త్రివేణి సంగమంలో ఆదివారం పుణ్యస్నానాలు చేసారు.

త్వరలో వీడీ12 టైటిల్ టీజర్

విజయ్ దేవరకొండ హీరోగా గౌతం తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వీడీ12(వర్కింగ్ టైటిల్) టైటిల్ టీజర్ ఈనెలలోనే వెలువడనున్నట్లు వార్తలొస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హిందీ టీజర్‌కు రణ్‌బీర్ కపూర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. అదేవిధంగా తెలుగుకు ఎన్టీఆర్, తమిళ్‌కు ధనుష్ వాయిస్ ఓవర్ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

అజిత్ కారుకు మళ్లీ ప్రమాదం



పోర్చుగల్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతున్న హీరో అజిత్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ విషయాన్ని అజిత్ ఆదివారం వెల్లడించారు. 'నా అభిమానులు మాత్రమే కాకుండా, నేను ఏం చేయబోతున్నానో తెలుసుకునేందుకు అమితాసక్తితో ఎదురు చూస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ రోజు కూడా శిక్షణలో నా కారు స్వల్ప ప్రమాదానికి గురైంది. దాన్ని మెకానిక్ బృందం రిపేర్ చేసింది' అని ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కాగా, ఇటీవల దుబాయ్ వేదికగా జరిగిన 24హెచ్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతుండగా, అజిత్ కారు ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. దీంతో ఆ పోటీల నుంచి అజిత్ తప్పుకున్నారు. అయినప్పటికీ అజిత్ కుమార్ రేసింగ్ టీం ఆ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. దీంతో అజిత్ కుమార్‌కు 'లిబర్టీ ఆఫ్ ది గేమ్' అనే అవార్డును కూడా ప్రదానం చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

నాటి ప్రజారాజ్యమే నేటి జనసేన



- తొలిసారి 'జై జనసేన' అంటూ నినదించిన చిరంజీవి
- ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు
- 'పుష్ప 2' ఘన విజయాన్ని స్వాగతిస్తున్నా
- ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్

"ప్రజారాజ్యం పార్టీ జనసేనగా రూపాంతరం చెందింది. అందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు అంతా జనసేనే. జై జనసేన' అంటూ నినదించి మెగా అభిమానులను ఉత్సాహపరిచారు చిరంజీవి. విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన 'లైలా' చిత్రం ఈనెల 14 న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపైన ఉన్న విష్వక్‌సేన్ తండ్రి కరాటే రాజుతో తన అనుబంధం గురించి ప్రస్తావిస్తూ చిరంజీవి పై వ్యాఖ్యలు చేశారు. 'మేం ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు రాజకీయంగా ఎదగాలనే తన కోరికను కరాటే రాజు నా దగ్గర ప్రస్తావించాడు. దాంతో ప్రజారాజ్యం తరపున అవకాశం ఇచ్చాం. కానీ అప్పట్లో పరిస్థితులు ఇంకోలా ఉన్నాయి' అని చిరంజీవి చెప్పారు. అలాగే మేనల్లుడు అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' విజయం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. "పుష్ప 2' పెద్ద హిట్టయింది. అందుకు నేను గర్విస్తున్నా. ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు. కానీ ఒక సినిమా బాగా ఆడితే దాన్ని ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరూ హర్షించాలి' అన్నారు.

విష్వక్‌ను బాలకృష్ణ మనిషి అన్నారు

"నా బాల్యంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ అభిమానులు రక్తం వచ్చేలా కొట్టుకోవడం చూశాను. ఆ సంఘటన ప్రభావంతో నేను సినిమాల్లోకి వచ్చాక మా హీరోల మధ్య సఖ్యత కోసం కృషి చేశాను. 'విష్వక్సేన్ ఫంక్షన్‌కు వెళ్తున్నావా? అతను మన మనిషి కాదు, బాలకృష్ణ మనిషి. అప్పుడప్పుడూ 'తారక్' అని కూడా అంటాడు. ఆ కార్యక్రమానికి వెళ్లొద్దు" అని కొందరు నాతో అన్నారు. మనుషులన్నాక వేరేవాళ్ల మీద ప్రేమ, అభిమానం ఉండకూడదా? అభిమానం పర్సనల్. జిహ్వకో రుచి అన్నట్లు యాక్టర్‌గా కొంతమంది కొందరికి కనెక్ట్ అవుతారు. దాన్ని మనమంతా అంగీకరించాలి. రామ్ చరణ్‌కు సూర్య అంటే చాలా ఇష్టం. అంతమాత్రాన వాడితో నేను కలిసి ఉండకూడదా? ఇక నుంచైనా మా గురించి ఆ కాంపౌండ్, ఈ కాంపౌండ్ అంటూ మాట్లాడరనే అనుకుంటున్నాను. ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్' అని చెప్పారు. 'లైలా' సినిమాతో విష్వక్‌సేన్, దర్శకుడు రామ్ నారాయణ్, నిర్మాత సాహూ గారపాటి పెద్ద విజయాన్ని అందుకోవాలని చిరంజీవి ఆకాంక్షించారు. 'ఇది నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. జనాల్ని నవ్వించాలని డిసైడ్ అయ్యాను ' అని విష్వక్‌సేన్ అన్నారు. లైలా లాంటి పాత్ర చేయడానికి విష్వక్ తప్ప మరో హీరో ముందుకురాడు అని సాహూ గారపాటి అన్నారు. విష్వక్ ఈ సినిమాను అంగీకరించడమే నాకు పెద్ద బహుమతి అని . రామ్ నారాయణ్ చెప్పారు.



పుష్ప జీవితాంతం గుర్తుంటుంది

అల్లు అర్జున్

"పుష్ప' సినీ ప్రయాణంలో ఐదు నిమిషాల నుంచి ఐదేండ్ల వరకూ భాగమైన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు. ఈ సక్సెస్ క్రెడిట్ దర్శకుడు సుకుమార్‌తో పాటు సినిమా కోసం కష్టపడి పనిచేసిన టీమ్‌కు దక్కుతుంది. ఆయన సీన్ చెప్తుంటే పిచ్చెక్కిపోతుంది. ఈ సినిమా కోసం వెచ్చించిన ఐదేళ్లు నాకెంతో ప్రత్యేకం. ఈ సినిమా అందరికీ జీవితాంతం గుర్తుండిపోతుంది. 'పుష్ప 3' ఓ అద్భుతం" అని 'పుష్ప 2' థ్యాంక్స్ మీట్‌లో అల్లు అర్జున్ అన్నారు. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ "మైత్రీ మూవీస్ సీఈఓ చెర్రీ సలహాతోనే 'పుష్ప' మూడు భాగాలుగా తయారైంది. ఈ విజయం మైత్రీ మూవీ మేకర్స్‌కి అంకితం చేస్తున్నాను. ఈ ప్రపంచంలో నన్ను ఎక్కువగా నమ్మే వ్యక్తి అల్లు అర్జున్" అని చెప్పారు. "ఈ సినిమా విజయం ఎంతో మంది కష్టంతో వచ్చింది. ఈ విజయానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు" అని నిర్మాత యలమంచిలి రవిశంకర్ అన్నారు. "సినిమా అంచనాలను మించి కలెక్ట్ చేస్తుందని అనుకున్నాం కానీ.. ఇంత ఘనవిజయం సాధిస్తుందని అనుకోలేదు" అని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు.

'లూసిఫర్ 2'లో హాలీవుడ్ యాక్టర్లు



మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్ 2 ఈ ఎంపురాన్'. 'లూసిఫర్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. మార్చి 27న పాన్ ఇండియా స్థాయిలో మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఆశిర్వాద్ సినిమాస్, లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మంజు వారియర్, టొవినో థామస్, ఇంద్రజిత్ సుకుమారన్, జైస్ జోస్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ జైస్ జోస్ పోషించిన జేవియర్ పాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. జైస్ జోస్ ఈ మూవీ చిత్రీకరణ అనుభవాలను వీడియో ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. కాగా, ఈ చిత్రం గురించి ఓ ఆసక్తికర అప్డేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో కొందరు ఇంటర్నేషనల్ యాక్టర్స్ నటిస్తున్నట్టుగా గతంలో వార్తలు వెలువడ్డాయి. అయితే ఇప్పుడు యూకేకు చెందిన ఇద్దరు యాక్షన్ స్టార్స్ నటించారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హాలీవుడ్‌కు చెందిన ఓ ఏజెన్సీ ఈ సమాచారాన్ని వెల్లడించింది. కొరియన్ అమెరికన్ నటులు రిక్ యూన్, ఆండ్రియా టి వాడర్ కూడా ఈ సినిమాలో నటించనున్నట్లు ఆ ఏజెన్సీ తొలుత సోషల్ మీడియాలో షేర్ చేసి ఆ తర్వాత డిలీట్ చేసినట్లు మాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



ఆ సినిమాను అంగీకరించారా?

హీరోయిన్ శ్రీలీల వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే పవన్‌కల్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్‌సింగ్', రవితేజతో 'మాస్ జాతర', నితిన్‌తో 'రాబిన్‌హుడ్', శివకార్తికేయన్‌తో 'పరాశక్తి' సినిమాల్లో నటిస్తున్నారీ బ్యూటీ. అయితే, ఆమెకు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లో నటించేందుకు ఆఫర్ వచ్చిందని సమాచారం. 2023లో విడుదలై విజయవంతమైన 'మంగళవారం' సినిమా సీక్వెల్‌లో ఆమె నటిస్తున్నట్లు టాక్. తొలి భాగంలో కథానాయికగా నటించిన పాయల్ రాజ్‌పుత్ ఈ చిత్రం సీక్వెల్‌లో నటించట్లేదని తెలుస్తోంది. ఆమె స్థానంలో నటించేందుకు శ్రీలీలకు ఆఫర్ వచ్చిందట. ఇందుకు ఆమె అంగీకరించారా లేదా తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకూ ఆగాల్సిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు దర్శకుడు అజయ్ భూపతి. ఈ ఏడాదిలోనే సీక్వెల్‌ను పట్టాలెక్కించే ఆలోచనలో ఉన్నారు మేకర్స్

నటుడిగా నా స్థాయిని పెంచుతుంది

\- రాగ్ మయూర్



'సినిమా బండి, కీడా కోలా' తదితర చిత్రాలతో నటుడిగా రాగ్ మయూర్ చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే 'విడుదలైన గాంధీ తాత చెట్టు' చిత్రంలో విలన్‌గా తన నటనకు మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నారు. ప్రస్తుతం ఆయన 'గరివిడి లక్ష్మి' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా రాగ్ మయూర్ మాట్లాడుతూ 'ఫహద్ ఫాజిల్, రాజ్‌కుమార్ రావు లాంటి నటులు నాకు ఆదర్శం. వారిలా ముందు మంచి నటుడిగా నిరూపించుకొని ఆ తర్వాత హీరోగా ఎదగాలనేది నా ఆలోచన. అందుకే కెరీర్ ఆరంభం నుంచి ఎక్కువగా నటనకు ఆస్కారమున్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ వస్తున్నాను. నేను హీరోగా నటిస్తున్న 'గరివిడి లక్ష్మి' చిత్రం గ్రామీణ నేపథ్యమున్న ప్రేమకథతో తెరకెక్కుతోంది. నటుడిగా ఇది నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమవుతుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జరిగే కథ ఇది. అక్కడి వేషభాషలను అవగాహన చేసుకునేందుకు కొన్నాళ్లు అక్కడే గడిపాను. 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నా పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి చక్కని ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది' అని చెప్పారు.



జ్యోతి హ్యాట్రిక్ పసిడి

జాతీయ క్రీడల్లో తెలుగు అథ్లెట్ల జోరు

డెహ్రాడూన్: స్టార్ స్ప్రింటర్, తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ జాతీయ క్రీడల్లో అదరగొట్టింది. వరుసగా మూడోసారి చాంపియన్‌గా నిలిచి హ్యాట్రిక్ పసిడి దక్కించుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి 13.10 సెకన్లలో గమ్యాన్ని చేరి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో 2023 క్రీడల్లో తన పేరిటేనున్న 13.22 సెకన్ల రికార్డును జ్యోతి అధిగమించింది. విశాఖపట్నానికి చెందిన 25 ఏళ్ల జ్యోతికిది జాతీయ క్రీడల్లో వరుసగా మూడో స్వర్ణం కావడం విశేషం. అంతకుముందు 2022 (గుజరాత్), 2023 (గోవా) టోర్నీల్లోనూ ఆమె పసిడి అందుకుంది. కాగా, ఆదివారం నాటి పోటీల్లో తెలంగాణ రెండు పతకాలు


మహిళల రిలే జట్టు

గెలిచింది. మహిళల 4×100 మీటర్ల రిలే ఈవెంట్‌లో నందిని, నిత్య, సింధు, మైథిలిలతో కూడిన తెలంగాణ బృందం 47.58 సెకన్లలో రేసు ముగించి మూడోస్థానంతో కాంస్య పతకం సాధించింది. ఇక, మహిళల సంప్రదాయ నెట్‌బాల్‌లో తెలంగాణ జట్టు కాంస్యం గెలిచింది. ఉత్తరాఖండ్‌తో జరిగిన కాంస్యం పోరును తెలంగాణ 42-42 స్కోరుతో టైగా ముగించింది. దీంతో ఇరుజట్లకు కాంస్య పతకం అందజేశారు. ఇక, పురుషుల డెకాథ్లాన్‌లో ఏపీకి చెందిన రోహిత్ రోమన్ పాటిల్ (6753 పాయింట్లు) మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నాడు.

తొలి క్వార్టర్స్‌లో గుకేష్ ఓటమి

వీసెన్‌హస్ (జర్మనీ): గ్రాండ్‌స్లామ్ టూర్ చెస్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్ తొలి గేమ్‌లో ప్రపంచ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు పరాజయం చవిచూశాడు. ఆదివారం హోరాహోరీగా జరిగిన గేమ్‌లో నల్లపావులతో ఆడిన అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానా 40 ఎత్తుల్లో గుకేష్‌పై నెగ్గాడు. ఇతర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో అబ్దుసతోరోవ్‌పై కార్ల్‌సన్, అలీరెజాపై కీమర్ గెలుపొందారు. సిందరోవ్, నకామురా మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. సోమవారం రెండో రౌండ్ క్వార్టర్ ఫైనల్స్ జరుగుతాయి.

ఆహా.. ఈ ఆట కోసమే కదా భారత క్రికెట్ అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసింది. ఫామ్‌లో లేడు.. వయసు మీరుతోంది.. జట్టులో అవసరమా? అనే విమర్శలను తిప్పికొడుతూ ఒకే ఒక్క ఇన్నింగ్స్‌తో హిట్‌మ్యాన్ కమ్‌బ్యాక్ అయ్యాడు. బౌలర్లను తుత్తునియలు చేస్తూ ఫ్లిక్, పుల్, కవర్‌డ్రైవ్, లాఫ్టెడ్ ఆఫ్ డ్రైవ్స్, స్వీప్.. ఇలా అన్ని రకాల షాట్లతో ఫ్యాన్స్‌కు విందు భోజనమే అందించాడు. ఆఖరి పది ఇన్నింగ్స్‌లో కనీసం ఒక్కదాంట్లోనైనా 20 పరుగులైనా సాధించని రోహిత్ శర్మ (90 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 119) కటక్‌లో గర్జించాడు. తాను క్రీజులో కుదురుకుంటే ఎంత ప్రమాదకరమో ఎటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థికి రుచి చూపిస్తూ.. 16 నెలల తర్వాత సెంచరీతో మురిపించాడు. రో'హిట్'తో రెండో వన్డేలోనూ ఇంగ్లండ్‌ను భారత్ చిత్తుచేసింది. మరో మ్యాచ్ ఉండగానే మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకుంది.

రోహిట్ అయ్యాడోచ్!


రోహిత్ శర్మ (90 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 119)

ఒక్క ఇన్నింగ్స్‌తో..

ఎన్ని విమర్శలు..ఎంతటి అవమానం! కెప్టెన్‌గా ఉండీ టెస్ట్ మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సిన దుస్థితి. టీ20 కెరీర్ ముగిసింది. ఇక టెస్ట్‌ల నుంచీ రిటైర్ కావడమే ఉత్తమం అన్న సూచనలు. ఇటీవలి కాలంలో ఏ భారత స్టార్ క్రికెటర్‌కూ ఇంతటి గడ్డు పరిస్థితి ఎదురుకాలేదు. కానీ అన్నింటినీ పంటి బిగువున అదిమిపట్టాడు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ. ఎవరెన్ని విధాలుగా మాటల దాడి చేసినా సంయమనం కోల్పోలేదు. ప్రతి విమర్శలు చేయలేదు. తనదైన రోజుకోసం ఎదురుచూశాడు. ఆ అవకాశం ఇంగ్లండ్‌తో రెండో వన్డే రూపంలో లభించింది. అంతే..దెబ్బతిన్న పులిలా గర్జించాడు. తనలోని బ్యాటర్‌ను వెలికి తీశాడు. ఇంగ్లండ్ పేసర్లు, స్పిన్నర్ల భరతం పట్టి పరుగుల సునామీ సృష్టించాడు. తన పని అయిపోలేదని, ఇంకా ఎంతో క్రికెట్ మిగిలి ఉందని నిరూపించాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లతో కదం తొక్కి 'హిట్‌మ్యాన్'ను మరోసారి ఆవిష్కరించాడు. మ్యాచ్‌లో రోహిత్ సంధించిన ఫోర్లు, సిక్సర్ల గురించి ఎంత వర్ణించినా తక్కువే. పేసర్ అట్కిన్సన్ వేసిన భారత ఇన్నింగ్స్ రెండో ఓవర్లో-క్రీజు బయటకు వచ్చి కొట్టిన బౌండరీతోపాటు తదుపరి బంతిని ఎలాంటి ప్రయాస లేకుండా ఫ్లిక్ షాట్‌తో సిక్సర్‌గా మలుస్తూ తన 'తుఫాన్'కు శ్రీకారం చుట్టిన రోహిత్ కిక్కిరిసిన బారాబతి స్టేడియాన్ని హోరెత్తించాడు. రషీద్ బౌలింగ్‌లో కట్ షాట్‌తో హాఫ్ సెంచరీ సాధించిన రోహిత్-అదే రషీద్ బంతిని లాంగాఫ్‌లో అద్భుత సిక్సర్‌గా కొట్టి తనదైన శైలిలో సెంచరీ పూరించాడు. దాంతో ఫ్యాన్స్ హర్షధ్వానాలతో స్టేడియం దద్దరిల్లింది. ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ ఇన్నింగ్స్‌తో ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకున్న రోహిత్..ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపడంతోపాటు విమర్శకుల నోళ్లు మూయించాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

2 వన్డేల్లో ఎక్కువ సిక్సర్లు (338) బాదిన రెండో బ్యాటర్‌గా రోహిత్. షాహిద్ అఫ్రిదీ (351) టాప్‌లో ఉన్నాడు. అలాగే రోహిత్‌కు కెరీర్‌లో ఇది రెండో వేగవంతమైన శతకం (76 బంతుల్లో).

3 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అన్ని ఫార్మాట్లలో కలిపి ఎక్కువ సెంచరీలు (49) సాధించిన మూడో భారత బ్యాటర్‌గా రోహిత్. సచిన్ (100), కోహ్లీ (81) ముందున్నారు.

1 ఇంగ్లండ్ తరపున అత్యధిక హాఫ్ సెంచరీలు (56) సాధించిన బ్యాటర్‌గా జో రూట్.

300+ స్కోర్లు సాధించినా ఎక్కువ సార్లు (28) ఓడిన జట్టుగా ఇంగ్లండ్.



2 వన్డేల్లో భారత్ తరపున అరంగేట్రం చేసిన రెండో అతిపెద్ద వయస్కుడిగా (32 ఏళ్లు) వరుణ్ చక్రవర్తి. ఫరూఖ్ ఇంజనీర్ 36 ఏళ్ల వయస్సులో తొలి వన్డే ఆడాడు.

- గిల్ హాఫ్ సెంచరీ
- 2-0తో భారత్‌దే సిరీస్
- రెండో వన్డేలోనూ ఇంగ్లండ్ ఓటమి

76 బంతుల్లో శతకం


గిల్ (60)

కటక్: రోహిత్ శర్మ శతకంతో ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ 4 వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. తద్వారా 2-0తో మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను కూడా ఖాతాలో వేసుకుంది. ఆఖరిదైన మూడో వన్డే బుధవారం అహ్మదాబాద్‌లో జరుగుతుంది. మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (69), బెన్ డకెట్ (65), లివింగ్‌స్టోన్ (41), కెప్టెన్ జోస్ బట్లర్ (34), బ్రూక్ (31) కలిసికట్టుగా రాణించారు. జడేజాకు 3 వికెట్లు దక్కాయి. భారీ ఛేదనలో భారత్ 44.3 ఓవర్లలో 6 వికెట్లకు 308 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (60), శ్రేయాస్ అయ్యర్ (44), అక్షర్ పటేల్ (41 నాటౌట్) ఆకట్టుకున్నారు. ఒవర్టన్‌కు రెండు వికెట్లు లభించాయి. సెంచరీ హీరో రోహిత్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.


జడేజా (3/35)

కెప్టెన్ జోరు: భారీ ఛేదనలో భారత్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్లు రోహిత్, గిల్ ఇంగ్లండ్ బౌలర్లను యథేచ్ఛగా ఆడేసుకున్నారు. పిచ్ నుంచి బౌలర్లకు ఎలాంటి సహకారం అందకపోవడంతో భారత్‌కు అలవోకగా పరుగులు సమకూరాయి. ముఖ్యంగా రోహిత్ రెండో ఓవర్‌లో వరుసగా 4,6తో స్టేడియంలో ఫుల్ జోష్‌ను నింపాడు. ఇక అతను కుదురుకున్నట్టే అని ఫ్యాన్స్ అంతా సంబరపడ్డారు. వారిని ఏ మాత్రం నిరాశకు గురి చేయకుండా రోహిత్ ఆ తర్వాత కవర్ డ్రైవ్‌తో, ఫ్లిక్ షాట్‌తో సంధించిన సిక్సర్లు మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచాయి. అయితే ఈ దశలో ఏడో ఓవర్‌లో ఓ ఫ్లడ్‌లైట్ మొరాయించడంతో అరగంటపాటు ఆట ఆగిపోయింది. మ్యాచ్ మొదలైన తర్వాత కూడా రోహిత్ జోరు తగ్గలేదు. వరుస బౌండరీలతో 30 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అటు 15వ ఓవర్‌లో రెండు ఫోర్లతో గిల్ కూడా 45 బంతుల్లో ఈ ఫిఫ్టీ సాధించాడు. కానీ ఒవర్టన్ అతడిని సూపర్ యార్కర్‌తో బౌల్డ్ చేయడంతో తొలి వికెట్‌కు 136 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు విరాట్ కోహ్లీ (5) నిరాశపరుస్తూ రషీద్ ఓవర్‌లో అవుటయ్యాడు. అటు శతకానికి దగ్గరగా వచ్చిన రోహిత్ మాత్రం దూకుడు కొనసాగించాడు. 26వ ఓవర్‌లో ముందుకు వచ్చి మరీ లాంగాఫ్‌లో బాదిన సిక్సర్‌తో రోహిత్ కెరీర్‌లో 32వ శతకాన్ని పూర్తి చేశాడు. ఆ వెంటనే రెండు వరుస ఫోర్లతో 15 రన్స్ సమకూరాయి. అటు శ్రేయాస్ సైతం చెలరేగి ఉడ్ ఓవర్‌లో 4,4,6తో 17 రన్స్ రాబట్టాడు. సెంచరీ తర్వాత కాస్త అలసిపోయినట్టు కనిపించిన రోహిత్ ఓ ఫుల్‌టాస్ బంతికి రషీద్‌కు క్యాచ్ ఇవ్వడంతో మూడో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికే పటిష్ఠ స్థితికి చేరిన భారత్‌కు శ్రేయాస్-అక్షర్ జోడీ నాలుగో వికెట్‌కు 38 పరుగులు జోడించింది. చక్కగా కుదురుకున్న శ్రేయాస్ సమన్వయలోపంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ వెంటనే కేఎల్ రాహుల్ (10), హార్దిక్ పాండ్యా (10) అవుటయ్యారు. కానీ లక్ష్యం 48 బంతుల్లో 19 పరుగులే ఉండడంతో అక్షర్, జడేజా (11 నాటౌట్) 45వ ఓవర్‌లో విజయలాంఛనాన్ని పూర్తి చేశారు.

కలిసికట్టుగా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు ఈసారి నిలకడ చూపారు. టాప్-6 బ్యాటర్ల సమష్టి రాణింపుతో జట్టు స్కోరు 300 దాటగలిగింది. అయితే ఆరంభంలో చూపిన జోరు మధ్య ఓవర్లలో కాస్త తగ్గింది. ఓపెనర్లు డకెట్, సాల్ట్ (26) తొలి పవర్‌ప్లేలో వేగంగా ఆడడంతో 75 పరుగులు వచ్చాయి. అయితే 11వ ఓవర్‌లో సాల్ట్‌ను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు హాఫ్ సెంచరీతో ఊపు మీదున్న డకెట్‌ను జడేజా తన తొలి ఓవర్‌లోనే అవుట్ చేశాడు. అనంతరం రూట్, బ్రూక్ జోడీ భారత్‌ను విసిగిస్తూ మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించింది. బ్రూక్ వెనుదిరిగాక రూట్‌కు బట్లర్ జత కలిశాడు. ఇద్దరూ నిలకడను ప్రదర్శించడంతో 320+ స్కోరు కూడా సాధ్యమేననిపించింది. ఇదే జోరులో రూట్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కానీ 39వ ఓవర్‌లో బట్లర్‌ను హార్దిక్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే జడేజా వరుస ఓవర్లలో కీలక రూట్‌తో పాటు ఒవర్టన్ (6)ను వెనక్కి పంపడంతో జట్టు 258 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. అప్పటికి మరో ఐదు ఓవర్లే ఉండడంతో స్కోరు 300 దాటదనిపించింది. అయితే లివింగ్‌స్టోన్, రషీద్ (14) ఆఖరి నాలుగు ఓవర్లలోనే 43 రన్స్ రాబట్టి ఇంగ్లండ్ భారీ స్కోరుకు కారణమయ్యారు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (సి) జడేజా (బి) వరుణ్ 26; డకెట్ (సి) హార్దిక్ (బి) జడేజా 65; రూట్ (సి) విరాట్ (బి) జడేజా 69; బ్రూక్ (సి) గిల్ (బి) రాణా 31; బట్లర్ (సి) గిల్ (బి) హార్దిక్ 34; లివింగ్‌స్టోన్ (రనౌట్) 41; ఒవర్టన్ (సి) గిల్ (బి) జడేజా 6; అట్కిన్సన్ (సి) కోహ్లీ (బి) షమి 3; రషీద్ (రనౌట్) 14; ఉడ్ (రనౌట్) 0; సకీబ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 49.5 ఓవర్లలో 304 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-81, 2-102, 3-168, 4-219, 5-248, 6-258, 7-272, 8-297, 9-304, 10-304. **బౌలింగ్:** షమి 7.5-0-66-1; హర్షిత్ రాణా 9-0-62-1; హార్దిక్ 7-0-53-1; వరుణ్ 10-0-54-1; జడేజా 10-1-35-3; అక్షర్ 6-0-32-0.

భారత్: రోహిత్ (సి) రషీద్ (బి) లివింగ్‌స్టోన్ 119; గిల్ (బి) ఒవర్టన్ 60; విరాట్ (సి) సాల్ట్ (బి) రషీద్ 5; శ్రేయాస్ (రనౌట్) 44; అక్షర్ (నాటౌట్) 41; రాహుల్ (సి) సాల్ట్ (బి) ఒవర్టన్ 10; హార్దిక్ (సి) ఒవర్టన్ (బి) అట్కిన్సన్ 10; జడేజా (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 44.3 ఓవర్లలో 308/6. వికెట్ల పతనం:** 1-136, 2-150, 3-220, 4-258, 5-275, 6-286. **బౌలింగ్:** సకీబ్ 6-0-36-0; అట్కిన్సన్ 7-0-65-1; ఉడ్ 8-0-57-0; రషీద్ 10-0-78-1; ఒవర్టన్ 5-0-27-2; లివింగ్‌స్టోన్ 7-0-29-1; రూట్ 1.3-0-15-0.

వావ్..గిల్



బ్యాటింగ్‌లో రాణించిన శుభ్‌మన్ గిల్ అంతకుముందు ఫీల్డింగ్‌లో మూడు అద్భుత క్యాచ్‌లతో వహ్వా.. అనిపించాడు. ఇందులో అసాధ్యమనుకున్న బ్రూక్ క్యాచ్‌ను అతను పట్టిన తీరు కళ్లారా చూడాల్సిందే. 30వ ఓవర్‌లో రాణా వేసిన బంతిని బ్రూక్ భారీ షాట్‌గా మలిచేందుకు యత్నించగా.. మిడాఫ్ నుంచి బౌండరీ లైన్ వైపు 19 మీటర్ల దూరం వెనక్కి పరిగెత్తి గిల్ డైవ్ చేస్తూ అందుకున్న ఈ క్యాచ్ హైలైట్‌గా నిలిచింది.

సింధుకు గాయం

'ఆసియా' బ్యాడ్మింటన్ నుంచి అవుట్



న్యూఢిల్లీ: మరో రెండు రోజుల్లో ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ జరగనున్న నేపథ్యంలో..భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కండర గాయంతో స్టార్ షట్లర్ పీవీ సింధు ఈ టోర్నీ నుంచి వైదొలగింది. చైనాలోని క్వింగ్‌డావోలో ఈనెల 11 నుంచి 16 వరకు ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ జరగనుంది. ఇందుకోసం భారత జట్టు ప్రస్తుతం గువాహటిలో శిబిరంలో పాల్గొంటోంది. 'శిబిరంలో శిక్షణ సందర్భంగా ఈనెల 4న గాయం అయ్యింది. కోలుకొనేందుకు.. ముందుగా అంచనా వేసిన సమయం కంటే ఎక్కువ పట్టనుందని ఎంఆర్ఐ స్కాన్ తర్వాత తెలిసింది. దాంతో ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనలేక పోతున్నందుకు ఎంతో విచారంగా ఉంది' అని 29 ఏళ్ల సింధు ఆదివారం ఎక్స్‌లో వెల్లడించింది.

దీప్తికి యూపీ వారియర్స్ పగ్గాలు



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఫ్రాంచైజీ యూపీ వారియర్స్ తమ సారథిగా ఆల్‌రౌండర్ దీప్తి శర్మను ఎంపిక చేసింది. ఈమేరకు ఆదివారం ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ అలీసా హీలీ (ఆస్ట్రేలియా) పాదం గాయంతో ఈసారి డబ్ల్యూపీఎల్ నుంచి వైదొలగింది. దాంతో హీలీ స్థానంలో 27 ఏళ్ల దీప్తిని నియమించింది. అలీసా స్థానంలో వెస్టిండీస్ ఆల్‌రౌండర్ చినెలీ హెన్రీని జట్టులోకి యూపీ తీసుకుంది.

గెలుపు దిశగా ఐర్లాండ్

జింబాబ్వేతో ఏకైక టెస్ట్

బులవాయో: మాథ్యూ హంఫెరీ (4/55) విజృంభించడంతో జింబాబ్వేతో ఏకైక టెస్ట్‌లో ఐర్లాండ్ గెలుపు దిశగా సాగుతోంది. 292 పరుగుల లక్ష్య ఛేదనలో.. నాలుగోరోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 38/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే ఆట చివరకు 183/7 స్కోరు చేసింది. ఆఖరిరోజు విజయానికి జింబాబ్వే 109 రన్స్ దూరంలో ఉండగా.. ఐర్లాండ్‌కు 3 వికెట్లు కావాలి. ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 260, రెండో ఇన్నింగ్స్‌లో 298 రన్స్ చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 267 పరుగులకు ఆలౌటైంది.

కంగారూలదే సిరీస్



గాలె: ఆతిథ్య శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను పర్యాటక ఆస్ట్రేలియా 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మరో రోజు ఆట మిగిలి ఉండగానే.. రెండో టెస్ట్‌లో ఆసీస్ 9 వికెట్లతో లంకపై గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 211/8తో ఆటకు నాలుగో రోజైన ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన లంక 231 రన్స్‌కు కుప్పకూలింది. ప్రత్యర్థి ముందు కేవలం 75 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో ఆసీస్ 17.4 ఓవర్లలోనే 75/1 స్కోరు చేసి గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 257, ఆస్ట్రేలియా 414 రన్స్ చేశాయి. 2011 తర్వాత లంకలో సిరీస్ నెగ్గడం కంగారూలకు ఇదే తొలిసారి.

'రెండు'కు ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. సౌతాఫ్రికా (69.44 పాయింట్ల శాతం) అగ్రస్థానంలో నిలిచి డబ్ల్యూటీసీ ఫైనల్ తొలి బెర్త్‌ను ఖరారు చేసుకొంది. ఇప్పుడు ఆసీస్ (67.54 పాయింట్ల శాతం) రెండో స్థానంలో నిలిచి 2023-25 సైకిల్‌ను ముగించింది. భారత్‌పై 3-1తో సిరీస్ నెగ్గినప్పుడే ఆసీస్ కూడా డబ్ల్యూటీసీ బెర్త్‌ను దక్కించుకొంది. జూన్ 11 నుంచి లార్డ్స్‌లో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్లో సౌతాఫ్రికాతో ఆసీస్ తలపడనుంది.

ఊపిరితిత్తుల కేన్సర్‌తోనే మరణాలు అధికం

- ప్రపంచవ్యాప్తంగా ఏటా 18 లక్షల మంది మృతి
- 3వ లేదా 4వ దశలో నిర్ధారణతో వైద్యుల వద్దకు
- యశోద గ్రూప్ ఆస్పత్రుల ఎండీ డా. జీఎస్‌రావు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇతర క్యాన్సర్ల కంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ కారణంగానే మరణాలు అధికమని యశోద గ్రూప్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ రావు తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ కారణంగా ప్రతీ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మంది చనిపోతున్నారని వెల్లడించారు. శని, ఆదివారల్లో యశోద ఆస్పత్రిలో ఆధ్వర్యంలో అంతర్జాతీయ పల్మనాలజీ సదస్సు, లైవ్ వర్క్‌షాప్ 'బ్రాంకస్ - 2025 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం సదస్సులో జీఎస్ రావు మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల క్యాన్సర్ చాలా ఆలస్యంగా 3 లేదా 4వ దశలలో నిర్ధారణ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో చాలా ఆలస్యంగా వైద్యులను సంప్రదిస్తున్నారని అన్నారు. మన దేశంలో అన్ని క్యాన్సర్ కేసులలో ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులే దాదాపు 8.5 శాతం ఉన్నాయని వివరించారు. దేశంలో మూడు ప్రధాన క్యాన్సర్ కేసులలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి అని చెప్పారు. అనేక ఊపిరితిత్తుల వ్యాధులకు ఉపశమనం కలిగించే బ్రాంకియాల్ థర్మో ప్లాస్టీ, ఇంటర్వెన్షనల్ బ్రాంకోస్కోపిక్ థర్మల్ వెపార్ అబ్లేషన్ (బీవీటీఏ)లాంటి అత్యాధునిక వైద్య విధానాలను దక్షిణాదిలో తొలిసారిగా తాము ప్రవేశపెట్టినట్లు ఆయన చెప్పారు. బ్రాంకియాల్ థర్మో ప్లాస్టీ విధానం ద్వారా ఎందరో రోగులకు శాశ్వత చికిత్స చేశామన్నారు. డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ఆధారిత ముందస్తు ఊపిరితిత్తుల క్యాన్సర్లను గుర్తించే పరికరం, అనేక ఇతర కొత్త సాంకేతిక వైద్య విధానాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు డాక్టర్. పవన్ గోరుకంటి తెలియజేసారు. 'అంతర్జాతీయ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ సదస్సు లైవ్ వర్క్‌షాప్'ను దేశంలో వరుసగా నాలుగోసారి యశోద గ్రూప్ ఆస్పత్రి నిర్వహించింది. 60 మంది కంటే ఎక్కువ అంతర్జాతీయ అధ్యాపకులు, 3000 మంది కంటే ఎక్కువ జాతీయ అధ్యాపకులు, 150 కంటే ఎక్కువ మంది పల్మోనాలజీ వైద్యులతో ఈ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కార్యనిర్వహక కార్యదర్శి, పల్మనాలజీ వైద్య నిపుణులు డాక్టర్. హరికిషన్, విదేశీ వైద్యులు ప్రొఫెసర్ ఫెలిక్స్ హెర్త్ - థొరాక్స్ క్లినిక్ (జర్మనీ), ప్రొఫెసర్ కైల్ హోగార్త్-యూనివర్శిటీ ఆఫ్ చికాగో (యూఎస్ఏ), డాక్టర్. మైఖేల్ ప్రిట్చెట్ (యూఎస్ఏ), డాక్టర్. పల్లవ్ షా (లండన్), డాక్టర్. మునవ్వర్ (లండన్), డాక్టర్. లోరెంజో (ఇటలీ), డాక్టర్. జమాలుల్ (మలేషియా)పాల్గొన్నారు.



అంతర్జాతీయ పల్మనాలజీ సదస్సు, లైవ్ వర్క్‌షాప్ బ్రాంకస్- 2025ను ప్రారంభిస్తున్న యశోద ఆస్పత్రుల ఎండీ డాక్టర్ జీఎస్‌రావు

ఒక్క సీటూ గెలవకపోయినా!

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ప్రభావం
- 2 సీట్లకే పోటీ.. అక్కడ మూడో స్థానంలో
- ఢిల్లీ ఓటర్లకు అసదుద్దీన్ ఒవైసీ కృతజ్ఞతలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 9: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేయడం బీజేపీ ఘన విజయానికి దోహదం చేయగా.. హైదరాబాద్ పార్టీ ఎంఐఎం కూడా ఈ ఎన్నికల్లో ప్రభావం చూపింది. ఎంఐఎం ఇద్దరు అభ్యర్థులను ఈ ఎన్నికల్లో బరిలో దింపగా ఒక్కరూ గెలవలేదు. అయితే ఆ ఇద్దరూ తాము పోటీ చేసిన చోట కాస్త ఘనంగానే ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలవడం విశేషం. ఒక నియోజకవర్గంలో ఎంఐఎం అభ్యర్థి చీల్చిన ఓట్లు బీజేపీ విజయానికి కారణమయ్యాయి. ఓక్లా అసెంబ్లీ స్థానం నుంచి షిఫా ఉర్ రహ్మాన్ ఖాన్, ముస్తఫాబాద్ నుంచి తాహిర్ హుస్సేన్‌లను ఎంఐఎం బరిలో దింపింది. 2020లో జరిగిన ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న వీరిద్దరూ ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు. అయితే తాము పోటీ చేసిన స్థానాల్లో మూడో స్థానంలో నిలిచి కాంగ్రెస్‌ని నాలుగో స్థానానికి నెట్టారు. ఎన్నికల సమయంలో ఎంఐఎం అభ్యర్థులకు మధ్యంతర బెయిల్ మంజూరవడంతో జోరుగా ప్రచారం చేయగలిగారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి మద్దతిచ్చిన ఓటర్లకు, అభ్యర్థుల కోసం కృషి చేసిన కార్యకర్తలకు ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీకి మజ్లిస్ బీ టీం అని ప్రచారం చేసిన ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ఎన్నికల ఫలితాలను విశ్లేషించి ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

ఆదివారం కూల్చివేతలు వద్దన్నా వినరా?

హైడ్రాపై మండిపడ్డ హైకోర్టు.. హౌస్‌మోషన్‌పై విచారణ

కోహెడలో కూల్చివేతలు ఆపేయాలని ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'వారాంతాల్లో ప్రత్యేకంగా ఆదివారం రోజు కూల్చివేతలు చేపట్టవద్దు అని చెప్పినా మీరు వినరా'? అని హైకోర్టు హైడ్రాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం కూల్చివేతలు చేపట్టాల్సినంత అత్యవసరం ఏమొచ్చింది? అంత తొందర ఎందుకు? అని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా తగిన అవకాశం ఇవ్వకుండా హైడ్రా కూల్చివేతలు చేపట్టడాన్ని తప్పుబట్టింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో కూల్చివేతలు నిలిపేయాలని ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 7వ తేదీ (శుక్రవారం)న నోటీసు ఇచ్చి 9వ తేదీన (ఆదివారం) కూల్చివేతలు చేపడుతుండటాన్ని వ్యతిరేకిస్తూ ఎస్. బాలరెడ్డి హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. పట్టాదారు పాస్‌పుస్తకం, లింకు డాక్యుమెంట్లు, టైటిల్ పత్రాలు సమర్పించాలని నోటీసు ఇచ్చారని తెలిపారు. మధ్యలో శనివారం ఒక్క రోజే సమయం ఇచ్చి ఆదివారం కూల్చివేతలు చేపట్టారని చెప్పారు. ఇది అన్యాయమని పేర్కొన్నారు. హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసే సమయానికే కూల్చివేతలు మొదలు పెట్టారని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. హైడ్రా తీరుపై మండిపడింది. గతంలోనే హైడ్రా కమిషనర్‌కు ప్రత్యక్షంగా కోర్టుకు హాజరైనప్పుడు వారాంతాలు, ఆదివారాల్లో కూల్చివేతలు వద్దని స్పష్టంగా చెప్పామని గుర్తు చేసింది. దీనిపై పలు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను ప్రస్తావించి వాటిని చదువుకోవాలని స్పష్టంగా చెప్పామని తెలిపింది. శుక్రవారం నోటీసు ఇచ్చి.. శనివారం వ్యక్తిగత విచారణకు పిలిచి, ఆదివారం కూల్చివేతలు చేపట్టాల్సినంత తొందర ఏమిటి ? అని ఆగ్రహం వ్యక్తంచేసింది. కఠిన చర్యలకు దిగేముందు తగిన అవకాశం ఇవ్వాలన్న కనీస మర్యాద పాటించరా అని పేర్కొంది. ఈ మేరకు కూల్చివేతలు ఆపాలని పేర్కొంటూ టైటిల్ పత్రాలు సమర్పించడానికి పిటిషనర్‌కు వారంపాటు గడువు ఇచ్చింది. నోటీసులు, విచారణ, కూల్చివేతలకు తగిన సమయం ఇవ్వకపోతే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. ముఖ్యంగా సెలవుల్లో ఇలాంటి చర్యలకు పాల్పడరాదని అధికారులకు హెచ్చరించింది.

బిజినెస్

వరంగల్ ● సోమవారం 10 ఫిబ్రవరి 2025

త్వరలో ఈ-రిక్షా మార్కెట్లోకి బజాజ్

న్యూఢిల్లీ: బజాజ్ ఆటో మార్చి చివరి నాటికి ఈ-రిక్షా విభాగంలోకి ప్రవేశిస్తోంది. నెలకి 45,000 యూనిట్ల పరిమాణం గల ఈ మార్కెట్ ప్రస్తుతం అత్యంత అవ్యవస్థీకృతంగా ఉందని, మార్చి త్రైమాసికం ముగిసేలోగా నియంత్రణాపరమైన అనుమతులు తీసుకోవాలని చూస్తున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ తెలిపారు. అనుమతులు రాగానే "ఈ-రిక్" మోడల్ విడుదల చేయాలని భావిస్తున్నామన్నారు. ఏప్రిల్ తొలివారం నుంచి అమ్మకాలు ప్రారంభించాలన్నది తమ ఆలోచన అని తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	475
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	98
వరంగల్	97	గుంటూరు	105
కరీంనగర్	97	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	82
కర్నూలు	97	నెల్లూరు	87
విశాఖపట్నం	96	అనంతపురం	87
గోదావరి	98		

2047 నాటికి ఫార్మా ఎగుమతులు రూ.30 లక్షల కోట్లు

టాప్ 5లోకి భారత్ చేరే చాన్స్

బెయిన్ అండ్ కంపెనీ నివేదిక వెల్లడి

ముంబై: భారత ఫార్మా ఎగుమతులు 2047 నాటికి 35,000 కోట్ల డాలర్లకు (రూ.30.10 లక్షల కోట్లు) చేరుతాయని అంచనా. అంటే ప్రస్తుత విలువతో పోల్చితే 10 రెట్లు అధికం. అలాగే ప్రస్తుతం ఫార్మా ఎగుమతుల్లో ప్రపంచ స్థాయిలో భారత్ 11వ స్థానంలో ఉండగా అప్పటికి టాప్ 5లోకి చేరుతుందని ఫార్మెక్సిల్, భారత ఫార్మా సంస్థలతో కలిసి బెయిన్ అండ్ కంపెనీ రూపొందించిన తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం అనుసరిస్తున్న పరిమాణం ఆధారిత వైఖరి నుంచి విలువ ఆధారిత వ్యూహం అనుసరించడం ద్వారానే భారత్ ఈ ఘనత సాధిస్తుందని కూడా పేర్కొంది. భారత్ ప్రస్తుతం జెనరిక్ ఔషధాల సరఫరాలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. 2023లో ఫార్మా ఎగుమతులు 2,700 కోట్ల డాలర్ల (రూ.2.32 లక్షల కోట్లు)



స్థాయిలో ఉండగా 2030 నాటికి 6,500 కోట్ల డాలర్లకు (రూ.5.59 లక్షల కోట్లు) చేరగలవని అంచనా. రాబోయే కాలంలో స్పెషాలిటీ జెనరిక్స్, బయో సిమిలర్స్, ఇన్నోవేటివ్ ఫార్మా ఉత్పత్తులపై దృష్టి సారించటం ద్వారా విలువ మరింతగా పెరుగుతుందని ఆ నివేదికలో తెలిపారు.

విధానపరమైన మద్దతు అవసరం

భారత ఫార్మా సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగంలోకి తేవాలంటే విధానపరమైన మద్దతు అవసరమని ఇండియన్ డ్రగ్స్ మాన్యుఫాక్చరర్స్ సమాఖ్య (ఐడీఎంఏ) జాతీయ అధ్యక్షుడు విరంచి షా అన్నారు. ప్రధానంగా ఎగుమతులకు నాన్ టారిఫ్ అవరోధాలను తొలగించి విభిన్న దేశాలకు విభిన్న ఎగుమతి వ్యూహాలు అనుసరించాలని సూచించారు. 40 కొత్త కెమికల్, బయోలాజికల్ ఎంటిటీలు అభివృద్ధి దశలో ఉన్న నేపథ్యంలో ఇన్నోవేషన్ విభాగంలో భారత ఎగుమతులు 2047 నాటికి 1,300-1,500 కోట్ల డాలర్లకు (రూ.11.18-12.90 లక్షల కోట్లు) చేరగలవని అంచనా. కాగా స్పెషాలిటీ జెనరిక్స్, బయో సిమిలర్స్, వ్యాక్సిన్లు, అడ్వాన్స్‌డ్ థెరపీల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడం ద్వారా 2047 నాటికి అంచనా వేస్తున్న ఎగుమతుల స్థాయికి చేరగలుగుతామని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజా భాను అన్నారు.

మూడు అంశాలపై దృష్టి పెడితే సాధ్యమే

విలువ ఆధారిత వ్యూహంలో దృష్టి సారించాల్సిన మూడు అంశాలను ఆ నివేదికలో గుర్తించారు. యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) ఎగుమతులు పెంచుకోవడం ఒకటి. ప్రస్తుతం ఏపీఐ ఎగుమతుల పరిమాణం 500 కోట్ల డాలర్లుండగా (రూ.43,000 కోట్లు).. 2047 నాటికి 8,000-9,000 కోట్ల డాలర్లకు (రూ.6.88-7.74 లక్షల కోట్లు) చేరవచ్చని అంచనా. మొత్తం ఔట్‌సోర్సింగ్ ఏపీఐ మార్కెట్లో 35% వాటాతో చైనా అగ్రగామిగా ఉంది. ప్రపంచ సరఫరా వ్యవస్థను విస్తరించుకోవడం ద్వారా భారత్ కూడా తన మార్కెట్‌ను పెంచుకోవచ్చు. ఈ కోణంలో చూస్తే అమెరికా రూపొందించిన బయోసెక్యూర్ చట్టం భారత్‌కు మంచి అవకాశమని ఆ నివేదికలో తెలిపారు. ఏపీఐ మార్కెట్లో గట్టి పట్టు సాధించాలంటే బల్క్ డ్రగ్ పార్కుల్లో పెట్టుబడులు పెట్టడం, ముడిసరుకులో స్వయం సమృద్ధి సాధించడం అవసరమని పేర్కొన్నారు.

- భారత బయో సిమిలర్ ఎగుమతులు ప్రస్తుతం 80 కోట్ల డాలర్లుండగా (రూ.6,880 కోట్లు).. 2047 నాటికి 3000-4000 కోట్ల డాలర్లకు (రూ.2.58-3.44 లక్షల కోట్లు) చేరగలవని అంచనా. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల్లో పెట్టుబడులు పెట్టడం, అమెరికా వంటి మార్కెట్లలో నిబంధనల సరళీకరణ, సామర్థ్యాల విస్తరణ బయో సిమిలర్ విభాగంలో భారత్ స్థానాన్ని పటిష్ఠం చేస్తాయంటున్నారు.
- ప్రస్తుతం మొత్తం ఫార్మా ఎగుమతుల్లో 70 శాతం వాటా జెనరిక్ ఫార్ములేషన్లదే. వీటి ప్రస్తుత విలువ 1,900 కోట్ల డాలర్లుండగా (రూ.1.63 లక్షల కోట్లు).. 2047 నాటికి 18,000-19,000 కోట్ల డాలర్లకు (రూ.15.48-16.34 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా. ఇందుకోసం భారత్ సాధారణ జెనరిక్స్ నుంచి అధిక మార్జిన్లుండే స్పెషాలిటీ జెనరిక్స్ వైపు దృష్టి కేంద్రీకరించాలి.

రెయిన్‌బో హాస్పిటల్స్ ఆదాయం రూ.398 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రెయిన్‌బో చిల్డ్రన్ మెడికేర్ లిమిటెడ్ నికర లాభం 10.2 శాతం వృద్ధితో రూ.68.94 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.62.57 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో రెవెన్యూ రూ.335.96 కోట్ల నుంచి రూ.398.08 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో హాస్పిటల్స్‌లో సేవల విస్తరణ కోసం రూ.21.83 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు రెయిన్‌బో పేర్కొంది. కాగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో 100 పడకలతో ఏర్పాటు చేస్తున్న రీజినల్ హబ్ హాస్పిటల్ వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

బీఎస్ఎన్ఎల్ 4జీ కోసం అదనంగా రూ.6,000 కోట్లు!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్)కు అదనంగా రూ.6,000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ తన 4జీ కార్యకలాపాల విస్తరణ కోసం ఈ మొత్తం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. గత శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ భేటీలో ఈ అంశం ప్రధాన అజెండాగా ఉందని, అయితే ఇది అధికారికంగా వెల్లడించలేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా లక్ష 4జీ సైట్స్‌ను ఏర్పాటు చేసేందుకు బీఎస్ఎన్ఎల్ ఈ నిధులను వినియోగించాలని భావిస్తోంది. కాగా రూ.19,000 కోట్లతో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటికే ఇందులో రూ.13,000 కోట్లు ఖర్చు చేసింది.

రివర్సల్‌కు అవకాశం

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. అంతర్జాతీయంగా నెలకొన్ని అనిశ్చిత పరిస్థితులు ముగుస్తున్నాయి. పరిస్థితులు కుదుటపడుతుండటంతో మార్కెట్లో పాజిటివ్ సెంటిమెంట్ పెరుగుతోంది. పైగా ఫండమెంటల్స్ బాగున్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్నాయి. ప్రస్తుతం బెంచ్‌మార్క్ సూచీలన్నీ టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఫైనాన్స్, బ్యాంకింగ్, ఆటో, వినియోగ రంగాల షేర్లు పటిష్ఠంగా ట్రేడవుతున్నాయి. మీడియా, రియల్టీ రంగాలు మెరుగవుతున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

టాటా స్టీల్: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్లో ఉంది. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత మూమెంటమ్ మొదలైంది. చక్కటి రిలేటివ్ స్ట్రెంత్ ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం 4.35 శాతం లాభంతో రూ.138 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.135 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.165 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.130 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: గత ఏడాది నవంబరు నాటి గరిష్ఠం నుంచి 30 శాతం మేరకు దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం బలం ప్రదర్శిస్తోంది. కీలకమైన రూ.560 స్థాయిలో రెండు సార్లు మద్దతు లభించింది. మెటల్ రంగం మెరుగ్గా రాణిస్తుండటం, త్వరలో ఆర్థిక ఫలితాలు వెల్లడించే నేపథ్యంలో ఈ షేరుపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది గత శుక్రవారం రూ.607 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.600 శ్రేణిలో ఎంటరై రూ.674/710 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.570 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌పీఐసీ (స్పిక్) లిమిటెడ్: కొన్ని నెలలుగా డౌన్ ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. రూ.70 స్థాయిలో సపోర్ట్ తీసుకున్న ఈ షేరు తక్షణ నిరోధ స్థాయి రూ.80ని బ్రేకౌట్ చేసింది. నిఫ్టీతో పోలిస్తే మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.82 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.80 శ్రేణిలో ప్రవేశించి రూ.96/100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించాలి. అయితే రూ.77 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

చంబల్ ఫెర్టిలైజర్స్: గత ఏడాది జూన్ నుంచి ఈ షేరు సైడ్‌వేస్‌లో కన్సాలిడేషన్ అవుతూ వస్తోంది. తాజా త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో గతవారం ఈ షేరు మెరుగ్గా రాణించింది. కీలకమైన రూ.555 రెసిస్టెన్స్ జోన్‌కు చేరుకుంది. గత శుక్రవారం రూ.555 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.520/540 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.490 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కేఫిన్ టెక్నాలజీస్: జీవితకాల గరిష్ఠం తర్వాత 36 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరలో లభిస్తోంది. డిసెంబరు త్రైమాసిక ఫలితాల తర్వాత మూమెంటమ్ పెరిగింది. చివరి నాలుగు సెషన్లలోనే 16 శాతం మేర ఎగిశాయి. గత శుక్రవారం రూ.1,224 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,155 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

అమర రాజా లాభంలో 11 శాతం వృద్ధి

అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసిక లాభంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.3,272.47 కోట్ల ఆదాయంపై రూ.298.37 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.267.89 కోట్లు)తో పోల్చితే లాభం 11 శాతం వృద్ధి చెందింది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను రూ.9,786.25 కోట్ల ఆదాయంపై రూ.783.10 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన అమర రాజా ఎనర్జీ డిసెంబరు త్రైమాసికంలో రూ.3,164.02 కోట్ల ఆదాయంపై రూ.311.83 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

టెక్ వ్యూ: మరింత కన్సాలిడేషన్‌కే ఆస్కారం

నిఫ్టీ గత వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు మధ్యన ముగియడం అనిశ్చిత ధోరణికి సంకేతం. మార్కెట్ మరింత కన్సాలిడేట్ కావలసి ఉంది. అయితే ఇప్పటికీ ప్రధాన మద్దతు స్థాయి 23,000 కన్నా చాలా పైన ఉండడం వల్ల తక్షణ ముప్పు ఏదీ ఉండకపోవచ్చు. శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో ఏర్పడిన రియాక్షన్ కారణంగా ఈ వారంలో నిఫ్టీ మరింత అప్రమత్త ట్రెండ్ ప్రదర్శించే ఆస్కారం ఉంది. మొత్తం మీద గత రెండు వారాల ర్యాలీ అనంతరం పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు.



వి. సుందర్ రాజా

బుల్లిష్ స్థాయిలు: రియాక్షన్ ఏర్పడినా ట్రెండ్‌లో సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో 23,500 వద్ద బలంగా నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 23650, 23800. ఇక్కడ కూడా నిలదొక్కుకోగలిగితే తదుపరి టార్గెట్ 24,100.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 23,300 వద్ద విఫలమైతే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ వారంలో ఈ సూచీ మానసిక అవధి 50,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ప్రధాన నిరోధం 50,600. ఇక్కడ నిలదొక్కుకుంటే తదుపరి టార్గెట్ 51,000. దిగువన ప్రధాన మద్దతు స్థాయిలు 49,400, 48,800.

పాటర్న్: మార్కెట్ సానుకూలత కోసం 50 డిఎంఏ వద్ద నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం నిఫ్టీ 23,650 వద్ద "దిగువకు అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద ఉంది. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక సానుకూలత ప్రదర్శిస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	23,650, 23,710
మద్దతు	22,450, 22,380

సుప్రీం తీర్పును శిరసావహిస్తా

» ఉప ఎన్నిక వస్తే.. పోటీ చేసి గెలుస్తా: కడియం



హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుల కేసు విషయంలో సుప్రీం కోర్టు తీర్పును శిరసావహిస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అవసరమైతే ఉపఎన్నికను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఆదివారం హనుమకొండలోని తన నివాసంలో కడియం మీడియాతో మాట్లాడుతూ ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. "పదేళ్లలో బీఆర్ఎస్ 36మంది ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకోలేదా? వారిలో మంత్రులైన వారు లేరా..? పార్టీకి రాజీనామా చేయకుండా వారు చేరలేదా..?" అని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే కేటీఆర్ సంబరపడుతున్నారని, ఆప్ ఓటమికి బీఆర్ఎస్ ప్రధాన కారణమని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్, కవిత జైలుకు వెళ్లారని, ఫలితంగా ఆప్ దారుణంగా ఓడిపోయిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు కడియం పూర్తి మద్దతును ప్రకటించారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య, వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు

చట్టబద్ధత కల్పించి ఎన్నికలు నిర్వహించాలి

» 42 శాతం రిజర్వేషన్లపై బీసీ మేధావులు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై చట్టబద్రత కల్పించి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని పలు బీసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించాలన్నారు. కులగణన సర్వే ఫలితాలను తక్షణం సమీక్షించి, పూర్తి పారదర్శకతతో వాస్తవ గణాంకాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. కులగణన సర్వే నివేదిక సమీక్ష, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించే లక్ష్యంతో ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జసత్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన భేటీలో బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సర్వేలో పారదర్శకత లోపించిందని, బీసీ జనాభా తగ్గించడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. 42% రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేయకుండా పార్టీ పరంగా సీట్లు ఇస్తానని సీఎం ప్రకటించడం మోసం చేయడానికి ప్రయత్నించడమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరిట బీసీల లెక్కలను తక్కువ చేసి చూపిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు.

చర్చలకు ఆహ్వానించకపోతే సమ్మె తప్పదు..!

» ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి థామస్‌రెడ్డి

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై యాజమాన్యం చర్చలకు ఆహ్వానించకపోతే సమ్మె తప్పదని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి థామస్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ విద్యానగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన 19 డిమాండ్ల పరిష్కారంపై సోమవారం యాజమాన్యంతో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ చర్చలు జరపబోతున్నారని చెప్పారు. తమ డిమాండ్లపై ఆర్టీసీ యాజమాన్యం స్పందించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు.

స్పీకర్‌ను సుప్రీంకోర్టు నిర్దేశించగలదా?

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ వేర్వేరుగా స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ మూడు పిటిషన్లను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కే.వినోద్ చంద్రన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించనుంది. అయితే, బీఆర్ఎస్ ఫిర్యాదుపై లిఖితపూర్వకంగా స్పందించాలని గత మంగళవారం(4న) పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన స్పీకర్ కార్యాలయం.. ఎప్పటిలోగా సమాధానం ఇవ్వాలన్న అంశాన్ని మాత్రం పేర్కొనలేదు. దీంతో తమకు 3 నుంచి 4 నెలల సమయం ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కోరారు. కాగా, నిర్దిష్ట సమయంలో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానాలు ఆదేశించవచ్చా? లేదా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. నిజానికి వివిధ న్యాయస్థానాల్లో ఈ విషయంపై వేర్వేరు తీర్పులు వచ్చాయి. గతంలో మణిపూర్ ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన కేసులో 4 వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కానీ, మహారాష్ట్ర ఎమ్మెల్యేల కేసులో జస్టిస్ సుభాష్ దేశాయ్, జస్టిస్ ఖోటో హోల్లోహన్, జస్టిస్ రాజేంద్రసింగ్ రాణా, జస్టిస్ కే మేఘచంద్రతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మాత్రం అనర్హత పిటిషన్లపై స్పీకర్ హేతుబద్ధ సమయంలో నిర్ణయం తీసుకోవాలని సూచించిందే తప్ప నిర్దిష్ట సమయాన్ని పేర్కొనలేదు. ఇక, మరో కేసులో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే బాధ్యతలు స్పీకర్‌కు అప్పగించాలా? లేదా? అన్న విషయంపై పార్లమెంటే పునరాలోచించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అనర్హత పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఒక శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, తద్వారా నిష్పాక్షికంగా, వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాలని పేర్కొంది. వివిధ కేసుల్లో సుప్రీం కోర్టు వేర్వేరు అభిప్రాయాలు వెల్లడించిన నేపథ్యంలో తెలంగాణ ఎమ్మెల్యేల కేసు విషయంలో ఎలాంటి ఆదేశాలు వెలువడుతాయోనన్న చర్చ సాగుతోంది. కాగా, అనర్హతపై సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండు రోజుల క్రితమే ఢిల్లీకి వచ్చి న్యాయ నిపుణులతో భేటీ అయ్యారు. సుప్రీంకోర్టు న్యాయవాది మోహిత్ రావు నేతృత్వంలో సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడుతో గంటకుపైగా చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదని, త్వరలోనే తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయన్నారు.

సచివాలయంలో పార్కింగ్ సదుపాయం!

» గ్రౌండ్ ప్లస్ వన్, సోలార్ రూఫ్ టాప్ నిర్మాణం.. అంచనా వ్యయం 26.81కోట్లు

» ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ పాయింట్

హైదరాబాద్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో వాహనాల పార్కింగ్ సదుపాయంతో పాటు డ్రైవర్ల సమస్యలు తీరనున్నాయి. డ్రైవర్ల కోసం రెస్ట్‌రూమ్స్, టాయ్‌లెట్స్ మరికొన్ని సౌకర్యాల కల్పనకు రంగం సిద్ధమైంది. వీటి నిర్మాణాలకు రూ.26.81 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. సచివాలయంలో వాహనాల పార్కింగ్‌కు సరైన సదుపాయాలు లేవు. దీంతో సచివాలయానికి వచ్చిన సందర్శకులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ సమస్యలపై దృష్టిసారించిన రోడ్లు, భవనాల శాఖ వాహనాల పార్కింగ్ సౌకర్యం కోసం రెండు, మూడు రకాల నమూనాలను రూపొందించింది. వీటిలో గ్రౌండ్ ప్లస్ వన్ విధానంలో ఒకటి, సోలార్ రూఫ్‌టాప్ పద్ధతిలో రెండోది, మూడోది సాధారణ షెడ్లులాగా నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో గ్రౌండ్ ప్లస్ వన్ విధానంలోనే నిర్మాణం చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సచివాలయం ప్రధాన ద్వారం వినహా మిగిలిన మూడు వైపులా ఈ పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటుచేయనున్నారు. వీటిలో గ్రౌండ్ ప్లస్ వన్ విధానంలోనే నిర్మించినా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తారని తెలిసింది. కొత్తగా ఏర్పాటుచేయబోయే పార్కింగ్ విధానంలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్‌కు అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం రెడ్‌కో విభాగంతో ఆర్ అండ్ బీ శాఖ చర్చించనుంది. త్వరితగతిన పార్కింగ్ సౌకర్యాల కల్పన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిర్వహించిన సమీక్షలో అధికారులకు సూచించారని తెలిసింది.

సోలార్ విద్యుత్‌తో ఆదాయం కూడా

పార్కింగ్ సౌకర్యాన్ని సోలార్ విధానంలో నిర్మిస్తే కొంత విద్యుత్ బిల్లు ఆదా చేయొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయం శోభాయమానంగా కనబడాలని రాత్రి సమయంలో భారీ లైట్లు ఆన్‌లో ఉంటున్నాయి. దీంతో విద్యుత్ బిల్లు అధికంగా వస్తోంది. ఇదే సమయంలో మరికొన్ని అవసరాలకు వినియోగించుకునేందుకు సోలార్ విద్యుత్ ఉపయోగపడుతుంది. దీంతో సోలార్ రూఫ్ పార్కింగ్ విధానమైతే బాగుంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మంత్రులు, అధికారులను కలిసేందుకు వచ్చే సందర్శకులు సచివాలయం లోపలికి వెళ్లాలంటే ఇబ్బందిపడాల్సి వస్తోంది. పాసులు జారీ చేసే కౌంటర్ నుంచి సచివాలయంలోకి వెళ్లాలంటే చాలా దూరం ఉంది. ఈ నేపథ్యంలో పాసులు జారీ చేసే కౌంటర్ ఎదురుగానే సచివాలయంలోనికి నడిచి వెళ్లేలా మార్గం ఏర్పాటుచేయడంతోపాటు వృద్ధులు, వికలాంగులు వెళ్లేందుకు వీలుగా విద్యుత్ వాహనాలను ఏర్పాటుచేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

» స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్ అమలు చేయాలి: హరీశ్

» సన్నవడ్లకు బోనస్ విడుదల చేయాలని సీఎంకు లేఖ



సిద్దిపేట టౌన్/హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని, బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సిద్దిపేట పట్టణంలో పలు కార్యక్రమాలకు హాజరైన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ఆత్మ గౌరవం నిలబెడితే, రేవంత్‌రెడ్డి తెలంగాణ గౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టారని మండిపడ్డారు. భూమికి సంబంధించిన పని కావాలంటే మంత్రులకు 30% కమీషన్ ఇవ్వాల్సిందేనని, వారిది భూమాత కాదు.. భూమేత అయ్యిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేకు కమీషన్ల మధ్య గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. రైతు కందులు పండిస్తే 3 క్వింటాల్లే కొంటున్నారని, కంది రైతుల మీద కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకంత తపగ అని నిలదీశారు. కొత్త పాస్‌బుక్ వచ్చిన వాళ్లకు రైతు భరోసా పడడంలేదన్నారు. సన్నవడ్లకు బోనస్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని.. 48గంటల్లో ఇస్తామని 48 రోజులైనా బోనస్ డబ్బులు రైతాంగానికి ఇవ్వలేదని హరీశ్ మండిపడ్డారు. సన్నవడ్లకు రూ.432కోట్లు ప్రభుత్వం బకాయిఉందని, వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. సర్కారు నిర్లక్ష్య వైఖరితో రైతులు, నేతన్నలు, ఆటోడ్రైవర్లతో మొదలైన ఆత్మహత్యల పరంపర రియల్టీ రంగానికీ చేరడం దురదృష్టకరమని 'ఎక్స్' వేదికగా హరీశ్‌రావు పేర్కొన్నారు.

కులగణన సర్వే నివేదిక ఓ చిత్తుకాగితం

» కాంగ్రెస్ ప్రభుత్వం రీసర్వే చేయాలి

» బీసీలకు జరిగే మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన కులగణన సర్వే నివేదిక ఓ చిత్తుకాగితంతో సమానమని, ఈ మాట కాంగ్రెస్ ఎమ్మెల్సీనే స్వయంగా చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ బీసీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు సాధన, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు చెప్పొద్దని.. రీ సర్వేకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్‌లో 42% రిజర్వేషన్ కల్పిస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు పార్టీపరంగా బీసీలకు 42% ఇస్తామనడం తగదన్నారు. కులగణన తప్పుల తడక అని, కాంగ్రెస్ దుర్మార్గ వైఖరిని బీసీ బిడ్డలు ఒప్పుకోవడం లేదన్నారు. కులగణన నివేదికపై బీసీ బిడ్డలు ఆందోళన వ్యక్తంచేస్తున్నా.. ప్రభుత్వం స్పందించడంలేదని మండిపడ్డారు. కులగణనలో ఐదున్నరశాతం జనాభాను తగ్గించారని, దాదాపు 22 లక్షల మంది ఉన్నవారిని లేనట్టుగా చిత్రీకరించారని ఆరోపించారు. జనాభాను తగ్గించడంపై సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలన్నారు. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్‌ను వదిలిపెట్టేది లేదని.. బీసీలకు ఆపార్టీ చేస్తున్న మోసాన్ని వివిధ రూపాల్లో ప్రజల్లోకి తీసుకువెళ్తామని కేటీఆర్ చెప్పారు.

బీఆర్ఎస్ హయాంలో కొండగట్టు ఆలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్సీ కవిత

మల్యాల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్ర అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో ప్రణాళిక రూపొందించి అమలుకు కృషి చేసిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రభుత్వం మారినందున అభివృద్ధి ఆగిపోకుండా గత ప్రణాళిక అమలు చేయాలని కోరారు. ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామిని ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా కొండగట్టు అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. తమ ప్రభుత్వం కొండగట్టు మెట్లదారి, కోనేరు, షెడ్లు, దీక్ష విరమణ మండపం పనులు చేపట్టిందన్నారు. కొండగట్టు ఘాట్‌రోడ్డు అభివృద్ధి పనులపై ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను వచ్చే హనుమాన్ జయంతిలోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కవిత వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలే స్థానిక సంస్థల కుర్చీల్లో కూర్చోవాలి

» ఇందుకు పార్టీ శ్రేణులు కష్టపడాలి: తుమ్మల



ఖమ్మం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతిప్రతినిధి): కాంగ్రెస్ కార్యకర్తలే స్థానిక సంస్థల కుర్చీల్లో కూర్చోవాలని, అందుకోసం పార్టీ శ్రేణులు కష్టపడాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. త్వరలో జగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను కార్యకర్తలు ప్రతిష్మాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రజా ఆమోదంతో పాటు పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలనే అభ్యర్థులుగా ఎంపిక చేసి ఎన్నికల్లో నిలబెడతామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాల్లో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారి ఖమ్మంలో ఖమ్మం అసెంబ్లీ నియోజవర్గస్థాయి సమావేశాన్ని మంత్రి తుమ్మల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే స్థానిక ఎన్నికలు నిర్వహించనుందని, ముందుగా మండల స్థాయి ఎన్నికలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు కేవలం పదిరోజుల షెడ్యూల్ వ్యవధిలోనే పూర్తి చేస్తుందని తెలిపారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రాణాలను పణంగాపెట్టి కాంగ్రెస్‌ను గెలిపించిన కార్యకర్తలే స్థానిక సంస్థల కుర్చీలో కూర్చుంటే ప్రభుత్వానికి, పార్టీకి ఆగౌరవం దక్కుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అక్కడ ప్రత్యర్థులు గెలిచే అవకాశం ఉంటుందని, అలాంటివారు ప్రభుత్వ కార్యక్రమాలను సజావుగా సాగనివ్వరన్నారు. ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ పరోక్ష మద్దతు: మహేశ్ గౌడ్



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల మాదిరిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీకి బీఆర్ఎస్ పరోక్షంగా మద్దతు ఇస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. పోటీ చేయడానికి బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కరువయ్యారని, దీంతో ఈ మేరకు ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందన్నారు. ఎలాంటి ఆధారం చూపకుండా బీసీ కులగణన తప్పుల తడకంటూ కేటీఆర్ ఎలా మాట్లాడతారని ఆదివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. లక్ష మందికి పైగా సిబ్బందితో శాస్త్రీయంగా కులగణన సర్వేని నిర్వహించిన కాంగ్రెస్ సర్కారుకు పేరు రావడం భరించలేకే కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు.. ఆ సర్వే గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే రైతుల ఆత్మహత్యలు

» రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపకుడు జస్టిస్ చంద్రకుమార్

పంజాగుట్ట, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్లే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపకుడు జస్టిస్ బి.చంద్రకుమార్ ఆరోపించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయలు పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబ సభ్యులకు ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మెదక్ జిల్లా హవేలి ఘనపురం మండలం కూచన్‌పల్లి గ్రామానికి చెందిన ఈర్ల మమత, మహబూబాబాద్ జిల్లా సిరోల్ మండలం సక్రమ్‌నాయక్ తండాకు చెందిన తెజావత్ మంగమ్మలకు చెక్కులను అందించారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోడ్ ముగిశాకే కొత్త ఇళ్లు

» ఎమ్మెల్సీ ఎన్నికలతో ఇందిరమ్మ ఇళ్లకు బ్రేక్

» ఇప్పటికే మంజూరైన వాటికి ఇబ్బంది లేదు



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆటంకం ఏర్పడింది. కోడ్ ముగిసిన తరువాతే మళ్లీ కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కానున్నాయి. దీని ప్రకారం కొత్తగా ఖరారు చేసిన లబ్ధిదారులకు మార్చిలో ఇళ్ల మంజూరవుతాయని తెలుస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26న ప్రారంభించిన నాలుగు పథకాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 71,500 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందించింది. ఆ పత్రాలు అందుకున్న వారు ఇంటిని నిర్మించుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. దరఖాస్తుదారుల్లో మళ్లీ కొత్తగా అర్హులను తేల్చి, వారికి మంజూరు పత్రాలను ఇవ్వడానికి మాత్రమే కోడ్ వల్ల ఇబ్బంది తలెత్తిందని, అందువల్లే కొత్త ఇళ్ల మంజూరును చేపట్టడం లేదని తెలిసింది. కొత్త లబ్ధిదారులను ఖరారు చేసిన తర్వాత వారికి అందించే మంజూరు పత్రాల కోసం మళ్లీ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుందని.. కోడ్ నిబంధనల ప్రకారం కొత్తగా ఉత్తుర్వులు ఇచ్చేందుకు అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినపుడు సాధారణంగా ప్రభుత్వ పథకాలను అమలు చేసేందుకు అవకాశం ఉండదని అధికార వర్గాలు అంటున్నాయి. ఏదైనా పథకాన్ని అప్పటికే అమలు చేస్తున్నట్టయితే దాని వివరాలను తెలుపుతూ, అమలుకు అవకాశం ఇవ్వాలంటూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాల్సి ఉంటుంది. దానిని పరిశీలించిన తర్వాత ఏం చేయాలో ఎన్నికల కమిషన్ స్పష్టతనిస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అదే విషయాన్ని తెలుపుతూ, పథకం అమలుకు అవకాశం ఇవ్వాలని అధికారులు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసే అంశంపై స్పష్టతరావాల్సి ఉంది.

క్షేత్రస్థాయి నుంచి వస్తున్న జాబితాలు

డిసెంబరు 2023లో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి కోసం గ్రామీణ ప్రాంతాల్లో 69,83,895 దరఖాస్తులు, జీహెచ్ఎంసీ పరిధిలో 10,70,659 దరఖాస్తులు కలిపి మొత్తం 80.50 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిని మూడు విభాగాలుగా విభజించారు. ఇప్పటికే ఈ దరఖాస్తుల పరిశీలన ఒకదఫా పూర్తయినప్పటికీ పథకంలో అనర్హులకు అవకాశం ఇవ్వకూడదన్న ఉద్దేశంతో జిల్లాల్లో మరోసారి దరఖాస్తుల పునఃపరిశీలన చేపట్టారు. అందులో అర్హులుగా తేలిన వారి జాబితాలు జిల్లా కలెక్టర్ల నుంచి గృహ నిర్మాణ శాఖకు ఒక్కొక్కటిగా అందుతున్నాయి. ఈ జాబితాలన్నీ అందగానే అర్హులైన వారందరికీ ఇళ్లను మంజూరు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

గృహలక్ష్మి లబ్ధిదారులు ఎంత మంది..?

అసెంబ్లీ ఎన్నికల ముందు 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పేరుతో ఇళ్లను మంజూరు చేసింది. ఈ పథకం కింద అర్హులుగా తేలినవారికి ఇంటిని నిర్మించుకునేందుకు రూ.3లక్షలు అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. ఆ పథకాన్ని రద్దు చేసి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే గత ప్రభుత్వ హయాంలో అమలైన గృహలక్ష్మి పథకం కింద ఎంత మందికి ఇళ్ల పట్టాలు అందాయనేదానిపై గృహ నిర్మాణశాఖ దృష్టి సారించింది. అప్పుడు ఇళ్ల పట్టాలు పొందిన వారి వివరాలను పంపాలంటూ జిల్లా కలెక్టర్లకు సర్క్యులర్ పంపినట్టు సమాచారం. ఆ వివరాలు వచ్చిన తర్వాత, గతంలో ఇళ్ల పట్టాలు పొందిన వారు ఇందిరమ్మ ఇళ్లకు కూడా దరఖాస్తు చేసుకున్నారా..? అనే వివరాలను పరిశీలించనున్నారు. అనంతరం వారికి ఇళ్లను అందించే అంశంపై ప్రభుత్వానికి ఒక లేఖను రాయనున్నట్టు తెలిసింది. కాగా, గతంలో గృహలక్ష్మి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,000 మందికి లోపే ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చినట్టు సమాచారం.

దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. "జనాభా లెక్కల ప్రకారం కాకుండా.. ప్రతి రాష్ట్రానికి 50% సీట్లను పెంచాలి. దీనివల్ల అన్ని రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయి" అని సూచించారు. ఇదే సూచనను మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక విధానానికి తాము వ్యతిరేకమని, ఇది ఒకే వ్యక్తి.. ఒకే పార్టీకి నిదర్శనమని.. ఇదే మోదీ రహస్య అజెండా అని ఆరోపించారు. "బీజేపీ, ప్రధాని మోదీ ప్రతిదాన్నీ తమ నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేస్తారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను ముప్పు. దీన్ని తిప్పికొట్టేందుకు కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి ప్రజలు ఏకమవ్వాలి" అని పిలుపునిచ్చారు. హరియాణాలో కాంగ్రెస్‌ను కేజ్రీవాల్ దెబ్బతీశారని, అది ఆయనకు ఢిల్లీలో ప్రతికూలమైందని, అంతిమంగా బీజేపీ లబ్ధి పొందిందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రాలపై పెత్తనానికి యత్నం

రాష్ట్రాలను తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు మోదీ సర్కారు కుట్ర పన్నుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. "రాష్ట్రం అనేది ఒక యూనిట్. రాష్ట్రాల సమాఖ్య ఈ దేశం. రాష్ట్రాల ప్రాథమిక హక్కులను మోదీ విస్మరించలేరు. రాష్ట్రాలను స్థానిక సంస్థలుగా మార్చి, తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని మోదీ ఆకాంక్షిస్తున్నారు. ఇప్పుడు విద్యారంగంలో మార్పులు అందుకు నిదర్శనం. భవిష్యత్‌లో రాష్ట్ర వర్సిటీల ఉపకులపతులను సైతం కేంద్రమే నిర్ణయించేలా నిబంధనలను మారుస్తున్నారు. నదుల అనుసంధానం విషయంలోనూ రాష్ట్రాల అధికారాలను లాక్కొంటున్నారు. కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలను రాజ్యాంగం స్పష్టంగా పేర్కొన్నా.. మోదీ మాత్రం అన్నీ తన చేతుల్లోకి తీసుకుంటున్నారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అన్నది ఏ విధంగానూ సరైంది కాదు. జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి ఎన్నికలు వేర్వేరు. తప్పనిసరైతే 'ఒకే రాష్ట్రం.. ఒకే ఎన్నిక' నినాదంతో.. గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీలు, జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, సహకార ఎన్నికలను నిర్వహించవచ్చు" అని అభిప్రాయపడ్డారు. ప్రజలు, రాజకీయపార్టీలు దీన్ని అర్థం చేసుకోవడం లేదని, మేధావులు దీనిపై ఆలోచన చేయాలని కోరారు.



తిరువనంతపురంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్

పీవీపై బీజేపీ వాట్సాప్ వర్సిటీ ప్రచారం

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కాంగ్రెస్ పార్టీ గౌరవం ఇవ్వలేదన్నది బీజేపీ, మోదీ వాట్సాప్ వర్సిటీ సృష్టించిన భావన మాత్రమేనని రేవంత్‌రెడ్డి అన్నారు. "పీవీని గ్రామపంచాయతీ సర్పంచ్ నుంచి ప్రధాని స్థాయికి తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడిగా, కేంద్ర హోంమంత్రిగా పనిచేశారు. వీరిద్దరినీ కాంగ్రెస్‌కు దూరం చేసే కుట్ర జరుగుతోంది. పటేల్‌కు ఆరెస్సెస్ ముద్ర వేశారు. తామే పటేల్ వారసులమని బీజేపీ నేతలు చెప్పుకొంటున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు కాంగ్రెస్ ఎన్నో అవకాశాలిచ్చింది. నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి అయ్యారు. జైపాల్‌రెడ్డి కేంద్ర మంత్రిగా పనిచేశారు. వాట్సాప్ వర్సిటీ ద్వారా బీజేపీ, మోదీ సృష్టించే మాయాజాలంలో ఎవరూ పడొద్దు" అని కోరారు.

ప్రజలు మూడో పార్టీకి అవకాశం ఇవ్వట్లేదు

ఇటీవలికాలంలో ప్రజలు మూడో పార్టీకి అవకాశం ఇవ్వడం లేదని, అయితే అధికార పార్టీ, లేదంటే విపక్షం వైపు మొగ్గుచూపుతున్నారని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఢిల్లీ ఎన్నికలు కూడా ఓ జాతీ య, మరో ప్రాంతీయ పార్టీ మధ్యే కేంద్రీకృతమైందని గుర్తుచేశారు. "ప్రజలు తమ ఓటు వృథా కావొద్దని భావిస్తున్నారు. దాంతో.. రెండు పార్టీల మధ్యే ఎన్నికలు కేంద్రీకృతమవుతున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిలిచింది. ప్రధాని మోదీ స్వయంగా ప్రచారం చేసినా.. బీజేపీకి 13% ఓట్లే వచ్చాయి. నిజానికి అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన రెండు ఉప ఎన్నికల్లో బీజేపీనే గెలిచింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రాలేదు. కానీ, సాధారణ ఎన్నికలు వచ్చేసరికి, కాంగ్రెస్ ఓటు బ్యాంకు 40శాతానికి పెరిగింది. అధికారంలోకి వచ్చింది" అని చెప్పారు. ప్రజలను జాతీయ నాయకుల పేరుతో ఓట్లు అడిగితే ఫలితం ఉంటుందని రేవంత్ అభిప్రాయపడ్డారు. "సర్పంచ్ ఎన్నికల్లో కూడా బీజేపీ మోదీ పేరుతో ఓట్లడుగుతోంది. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి పేరుతో ఓట్లడిగితే.. ఓటర్లు అగ్రకులాన్ని చూస్తారు. తాము బీసీలమని, రేవంత్‌కు ఎందుకేయాలని అడుగుతారు. అదే సోనియా పేరుతో ఓట్లడిగితే.. కులాన్ని పెద్దగా పట్టించుకోరు. మేం అసెంబ్లీ ఎన్నికల్లో సోనియా గాంధీ పేరుతోనే ఓట్లడిగాం. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాను గెలిపించాలని కోరాం" అని వివరించారు.

ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీనే లక్ష్యం

తెలంగాణ జీఎస్‌డీపీ ప్రస్తుతం సుమారు 200 బిలియన్ యూఎస్ డాలర్లుగా ఉందని, 2035 నాటికి దానిని ట్రిలియన్ యూఎస్ డాలర్లుగా మార్చాలనుకుంటున్నామన్నారు. "తెలంగాణ రాష్ట్రాన్ని హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అనే మూడు జోన్లుగా విభజించాం. 160 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ఏరియాలో 1.2 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రాంతం సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాలకు కేంద్రంగా ఉంది. చార్మినార్, హైదరాబాద్ బిర్యానీ, ముత్యాలకు హైదరాబాద్ ప్రసిద్ధి. ఓఆర్ఆర్ పరిధిలోని ఈ కోర్ అర్బన్ ఏరియాను సర్వీస్ సెకార్ట్‌తో 100% నెట్ జీరోగా మార్పు చేయనున్నాం. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నాం. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ఇందులో ఏఐ సిటీ ఉంటుంది. యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ నిర్మిస్తున్నాం. దావోస్‌లో రూ.1,82,000 కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టాం. మూసీ ఒడ్డున 200 ఎకరాల్లో గాంధీ సరోవర్‌ను నిర్మిస్తున్నాం. మాకు తీరప్రాంతం లేదు. అందుకే.. డ్రైపోర్టులను నిర్మిస్తాం. వాటిని ఏపీలోని సీపోర్టులతో లింక్ చేస్తాం. హైదరాబాద్ వృద్ధి చెందితే.. తెలంగాణ రైజింగ్ సాధ్యమవుతుంది. రీజనల్ రింగ్‌రోడ్డు, రీజనల్ రింగ్ రైల్వేను నిర్మించాలని నిర్ణయించాం. ఇటీవల ఎనర్జీ పాలసీని తీసుకొచ్చి, ఈవీలపై ఉన్న అన్ని పన్నులను తొలగించాం. ఈవీల అమ్మకాల్లో తెలంగాణ తొలి స్థానంలో ఉంది. 3 వేల ఆర్టీసీ బస్సులను దశలవారీగా ఈవీగా మారుస్తున్నాం. ఔషధాలు, విత్తనాల ఉత్పత్తిలో తెలంగాణ ముందంజలో ఉంది" అని రేవంత్ రెడ్డి వివరించారు.

ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినం!

సమగ్ర కుల సర్వే చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని, దాన్ని అసెంబ్లీలోనూ ప్రవేశపెట్టామని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణపైనా తీర్మానం చేశామన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే ప్రకారం అత్యల్ప ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని, గ్లోబల్ ఏఐ యూసేజ్ నివేదిక ప్రకారం ఏఐలో తామే మొదటి స్థానంలో ఉన్నామని గుర్తుచేశారు. తలసరి ఆదాయంలోనూ తెలంగాణ టాప్‌లో ఉందని, 2035 కల్లా తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారితే.. అది దేశ వృద్ధికి ప్రయోజనం కాదా? అని ఆయన ప్రశ్నించారు.

27.60 లక్షలకు సర్పంచ్ పదవి వేలం !

ఎన్నిక ఏకగ్రీవం చేసేందుకు వేలంపాట

పాల్గొన్న 12 మంది.. గద్వాల జిల్లాలో ఘటన

మానవపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల అంటే పల్లెల్లో మామూలుగా ఉండదు. ప్రత్యర్థుల పోటాపోటీ రాజకీయాలతో హైటెన్షన్ వాతావరణమే ఉంటుంది. మాకెందుకు ఇదంతా..!! అని అనుకున్నారో ఏమో కానీ ..!! రాష్ట్రంలోని ఓ గ్రామ సర్పంచ్ పదవిని ఆ ఊరి పెద్దలంతా కలిసి వేలం వేసి విక్రయించేశారు. ఒకటి, రెండు కాదు.. ఏకంగా రూ.27.60 లక్షలకు ఓ వ్యక్తి సర్పంచ్ పదవిని ఆ వేలంలో కొనేశాడని తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడకముందే ఈ వ్యవహారం జరగడం విశేషం. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని గోకులపాడు గ్రామంలో ఈ ఘటన జరిగినట్టు స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. గోకులపాడులో 546 మంది ఓటర్లు ఉండగా.. సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం నిర్వహించిన వేలంపాటలో దాదాపు 12 మంది పాల్గొన్నారట. ఇందులో ఓ వ్యక్తి అత్యధికంగా రూ.27.60 లక్షలు పాడి సర్పంచ్ పదవిని దక్కించుకున్నాడట. అయితే, సర్పంచ్ పదవి కోసం కాదు.. గ్రామాభివృద్ధి, ఆలయ నిర్మాణం కోసం వేలం పాట నిర్వహించామని కొందరు అంటుంటే.. అసలు వేలంపాటే జరగలేదని గ్రామానికి చెందిన మరికొందరు అంటుండడం గమనార్హం.

తుంగతుర్తికి నేనే లీడర్.. వేరెవ్వరూ కాదు

» స్థానిక ఎన్నికలకు బీఫామ్‌లు ఇచ్చేది నేనే: ఎమ్మెల్యే సామేలు



మోత్కూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): "తుంగతుర్తి నియోజకవర్గానికి నేనే లీడర్. వేరెవ్వరూ కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఫామ్‌లు ఇచ్చేది నేనే. నేను సంతకం చేస్తేనే ఇందిరమ్మ ఇళ్లు వస్తాయి. ఎవరో బీఫామ్‌లు ఇస్తామంటే, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామంటే నమ్మవద్దు" అని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. కాంగ్రెస్ అసమ్మతి నాయకులు ఇటీవల మోత్కూరులో నిర్వహించిన సమావేశాన్ని దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతూ ఖబడ్దార్ అని హెచ్చరించారు. తనతో వచ్చేవారే తనవారని స్పష్టం చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు ఆర్యవైశ్య భవన్‌లో సామేలు విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవ ప్రదర్శన నేపథ్యంలో "సీఎం రేవంత్‌రెడ్డిది ఐరన్ లెగ్" అని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సామేలు ఖండించారు. "కేటీఆర్ సోదరి కవిత కారణంగానే ఆప్ ఓడిపోయింది కదా.. ఎవరిది ఐరన్ లెగ్" అని ఆయన ఎదురు ప్రశ్నించారు.

ముస్లింలను బీసీల్లో ఎలా చేర్చుతారు..?

» ఓట్ల కోసం ఒవైసీతో రేవంత్ కుమ్మక్కు

» బీసీల స్థానాల్లో ముస్లింల పోటీకి కుట్ర

» బీజేపీని అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీ : సంజయ్



నల్లగొండ/బోయినపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "ముస్లింలను బీసీల్లో ఎలా చేరుస్తారు..? బీసీల జాబితా ఏమైనా మీ అయ్య జాగీరా..? బీసీలను ఉద్ధరిస్తామని చెప్పుకునే బీసీ సంఘాలు ఏం చేస్తున్నాయి..? అధికారంలో ఎవరుంటే వారి అడుగులకు మడుగులొత్తుతున్నాయా..?" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఆదివారం నల్లగొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఒక జాతికి, మరో జాతికి మధ్య తేడాలు తెలుసుకోలేని మూర్ఖత్వపు పార్టీ కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. ముస్లిం, మైనారిటీల ఓట్ల కోసం ఒవైసీ, రేవంత్ గ్యాంగ్ కలిసి ముస్లింలను బీసీలలో కలిపే కుట్రకు తెరలేపిందని దుయ్యబట్టారు. బీసీలకు జరిగిన అన్యాయంపై బీసీ సంఘాలు ఎందుకు నోరు మూసుకున్నాయని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల స్థానాల్లో ముస్లింలు పోటీ చేసి, బీసీలకు అన్యాయం చేసేందుకు రంగం సిద్ధమైందని హెచ్చరించారు. రాష్ట్రంలో బీజేపీని నిలువరించడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. దీనివల్లే కాళేశ్వరం స్కామ్, కార్ రేస్, డ్రగ్స్ కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసుల విచారణ ఆగిపోయాయన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను అరెస్టు చేయిస్తామన్న కాంగ్రెస్ నేతలు నోరుమూసుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ అర్బన్ నక్సలైట్ల చేతుల్లోకి వెళ్లిందని ఆయన ఆరోపించారు.

మున్నూరు కాపుల సత్తా చాటాలి..

రానున్న రోజుల్లో రాజ్యాధికార సాధనలో మున్నూరు కాపులు కీలకంగా వ్యవహరిస్తారని బండి సంజయ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని డైమండ్ పాయింట్ హోటల్ చౌరస్తా వద్ద ఉన్న వీహెచ్ఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం 'కులగణన ఫలితాలలో కాపులకు జరిగిన తప్పిదాలు' పేరిట మున్నూరు కాపుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పూర్తిగా తప్పులు తడకగా ఉందన్నారు. మున్నూరుకాపుల సంఖ్యను పది లక్షలు తక్కువగా చూపించడం దారుణమని మండిపడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో 10 లక్షల మందితో సభ నిర్వహించి మున్నూరు కాపుల సత్తా చాటాలని. అప్పుడు అన్ని పార్టీలు టిక్కెట్లు ఇచ్చేందుకు ముందుకొస్తాయని అన్నారు. సభ నిర్వహణకు పూర్తి సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జోగు రామన్న, తీన్మార్ మల్లన్న, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ విడిపోని దోస్తులు

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానం పలికారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎప్పటి నుంచో మిత్రులని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన అనేక విషయాలను ప్రస్తావిస్తూ కిషన్‌రెడ్డి ట్వీట్ చేశారు. "కేసీఆర్ రాజకీయ జీవితం కాంగ్రెస్‌తోనే మొదలైంది. 2004లో కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో గెలిచి యూపీఏ-1లో కేంద్ర మంత్రి అయ్యారు. 2014లో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు.. కేవలం రూ.2 లక్షలకే కాంగ్రెస్ కార్యాలయం కోసం విలువైన 10 ఎకరాల స్థలాన్ని అప్పగించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో.. బీజేపీని ఓడగొట్టేందుకు కూటమి ప్రభుత్వంలో చేరేందుకు సిద్ధమేనన్న సంకేతాలను కేటీఆర్ చాలా స్పష్టంగా ఇచ్చారు. దీనికి కాంగ్రెస్ కూడా వంతపాడింది. కాంగ్రెస్ జెండాపై గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరి మంత్రులవుతారు. బీఆర్ఎస్ జెండాపై గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారు. ఇద్దరి ఆలోచనలు ఒకటే అని చెప్పేందుకు ఇంతకన్నా ఏం కావాలి. రాష్ట్రపతిగా.. గిరిజన మహిళ అయిన ద్రౌపది ముర్మును ఓడించేందుకు ఈ రెండు పార్టీలు ఒక్కటయ్యాయి. మజ్లిస్ పార్టీ ప్రాపకం, ముస్లిం ఓట్ల కోసం.. ఉమ్మడి పౌరస్మృతి విషయంలోనూ రెండూ ఒక్కటయ్యాయి. 2023 ఆగస్టులో లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం విషయంలోనూ.. బహిరంగంగా చెట్టాపట్టాలేసుకుని తిరిగాయి. ఢిల్లీ సర్వీసెస్ బిల్లు సందర్భంలోనూ.. జాతి ప్రయోజనాలను పక్కనపెట్టి.. ఆమ్ ఆద్మీ పార్టీకి, కాంగ్రెస్ తీర్మానానికి బీఆర్ఎస్ బహిరంగంగా మద్దతిచ్చింది. ఈ రెండు పార్టీల అనైతిక పొత్తును చెప్పేందుకు ఎన్నో ఉదాహరణలున్నాయి. అలాంటిది మరోసారి బహిరంగంగా దోస్తీకి ఈ రెండు కుటుంబ పార్టీలు సిద్ధమయ్యాయి. రాజకీయాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఈ పార్టీలను మరోసారి కలిపేందుకు మజ్లిస్ పార్టీ మధ్యవర్తిత్వం చేస్తోంది" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే మూడు స్థానాలనూ తామే కైవసం చేసుకుంటామని కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఢిల్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితం రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. విద్యావంతులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని కోరారు.



ఢిల్లీలో బీజేపీ విజయం నేపథ్యంలో సంబరాలు చేసుకుంటున్న కిషన్‌రెడ్డి, నేతలు

రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కార్..

తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కార్ అని, గ్రేటర్ ఎన్నికల్లో వంద సీట్లు సాధిస్తామని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బర్కత్‌పుర చమాన్ వద్ద ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. హామీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేసీఆర్‌కు పట్టినగతే రేవంత్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నుంచి బర్కత్‌పుర చమాన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కళాకారుల డప్పులు, నృత్యాలతో ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు దూరం..?


జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి, మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి దూరంగా ఉండాలని బీజేపీ నిర్ణయించింది. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి పోటీ చేసే యోచనలో ఉంటాయి కాబట్టి, ఈ సమయంలో పోటీ చేసి ఓడిపోవడం కంటే దూరంగా ఉండడం మంచిదని కిషన్‌రెడ్డి అన్నట్లు తెలిసింది. పోటీ చేయాలని కచ్చితమైన ఆలోచన ఉంటే మరోసారి చర్చిద్దామని కార్పొరేటర్లతో చెప్పినట్లు సమాచారం. మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాసం పెడితే దూరంగా ఉండాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే చోట ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇద్దరు కార్పొరేటర్లను నియమిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. కార్పొరేటర్లు ఈ ఎన్నికల్లో ప్రచారం చేసి పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

చిలుకూరు అర్చకుడిపై దాడి

» రామరాజ్యం సేనల ఘాతుకం

» నిందితుడు వీరరాఘవరెడ్డి అరెస్టు

» మిగతా నిందితుల కోసం గాలింపు



మొయినాబాద్: ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సీఎస్ రంగరాజన్‌పై 'రామరాజ్యం' అనే సంస్థ ప్రతినిధులు దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా.. రామరాజ్య స్థాపనకు కృషి చేయడం లేదంటూ దూషించారు. ఈ ఘటనపై ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందర్‌రాజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చిలుకూరు బాలాజీ ఆలయానికి వంశపారంపర్యంగా అర్చకుడిగా వ్యవహరిస్తున్న రంగరాజన్.. ధార్మిక వ్యవహారాలపై తరచూ స్పందిస్తూ ఉంటారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని సందర్శించి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన సనాతన హిందూబోర్డు ఏర్పాటు డిమాండ్‌కు ఆయన మద్దతిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వీర రాఘవరెడ్డి అనే వ్యక్తి రామరాజ్యం పేరుతో హిందూధర్మంపై జరిగే దాడులను ఖండిస్తుంటారు. అయితే.. శుక్రవారం వీర రాఘవరెడ్డి 20 మంది రామరాజ్యం సభ్యులతో కలిసి చిలుకూరుకు వచ్చారు. నేరుగా బాలాజీ ఆలయ ప్రాంగణంలోని రంగరాజన్ ఇంటికి వెళ్లారు. "రామరాజ్య స్థాపనకు సహకరించాలి. ఉగాదిలోగా నేను ఏర్పాటు చేయాలనుకుంటున్న రామరాజ్య సైన్యానికి ఆర్థిక సాయం చేయాలి. చిలుకూరు ఆలయాన్ని నాకు అప్పగించాలి" అంటూ రంగరాజన్‌ను బెదిరించారు. లేనిపక్షంలో అంతుచూస్తానంటూ హెచ్చరించారు. దానికి రంగరాజన్ తీవ్రంగా స్పందిస్తూ.. తాను నిబంధనల ప్రకారమే నడుచుకుంటానని, అడ్డదారిలో ఎవరికీ సహకరించేది లేదని తేల్చిచెప్పారు. దాంతో.. వీర రాఘవరెడ్డి ఆయనపై చేయిచేసుకున్నారు. రంగరాజన్‌ను ఓ మూలన కూర్చోబెట్టి.. తనకొచ్చిన శ్లోకాలు, పద్యాలను వల్లిస్తూ.. కాలంచెల్లిన భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ), భారతీయ నేర శిక్షాస్మృతి(సీఆర్‌పీసీ)లోని పలు సెక్షన్లను గురించి చెబుతూ.. దూషించారు. ఉగాది వరకు సమయమిస్తున్నామని హెచ్చరించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ దారుణంపై సౌందర్ రాజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించారు. అదే సమయంలో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్(ఎస్‌వోటీ) సమాంతర దర్యాప్తు ప్రారంభించి, సీసీకెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించింది. నిందితుడు వీర రాఘవరెడ్డిని ఆదివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించింది. ఇతర నిందితుల అరెస్టుకు వేర్వేరు బృందాలు పనిచేస్తున్నాయని మొయినాబాద్ పోలీసులు తెలిపారు.

మరణిస్తూ.. మరో ఐదుగురికి ప్రాణదానం!

» రోడ్డుప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురైన యువ డాక్టర్ భూమికారెడ్డి

» అవయవాలు దానం చేసి కూతురి కోరిక తీర్చిన తల్లిదండ్రులు..



భూమికారెడ్డి (ఫైల్)

రాయదుర్గం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తాను మరణిస్తూ.. మరో ఐదుగురికి ప్రాణం పోసిందా వైద్యురాలు..! ఒక్కగానొక్క కుమార్తె తమకు దక్కదన్న కొండంత దుఃఖాన్ని దిగమింగుకుని, అవయవాలను దానం చేసి బిడ్డ కోరిక తీర్చారు ఆమె తల్లిదండ్రులు.. ఏపీలోని శ్రీసత్యసాయి అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గం తలుపులు మండల నంగివాండ్లపల్లికి చెందిన నంగి నందకుమార్‌రెడ్డి, లోహితల కూతురు భూమికారెడ్డి (24). ఇటీవలే వైద్య విద్య పూర్తిచేసి హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో హౌస్ సర్జన్‌గా వైద్య సేవలు అందిస్తోంది. ఈ నెల 1వ తేదీన హైదరాబాద్‌లో భూమికారెడ్డి ప్రయాణిస్తున్న కారు.. డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకోగా నానక్‌రామ్‌గూడలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. చివరికి వారం తర్వాత ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తేల్చారు. దీంతో గతంలో భూమికారెడ్డి అవయవదానంపై చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకున్న తల్లిదండ్రులు.. ఆమె అవయవాలు దానం చేసేందుకు ముందుకొచ్చారు. వైద్యులు భూమికారెడ్డి నుంచి గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు సేకరించి అవసరమైన వారికి అవయమార్పిడి చేసి ప్రాణాలు కాపాడారు. భూమికారెడ్డి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఆదివారం రాత్రి స్వగ్రామం నంగివాండ్లపల్లికి తరలించారు. భూమికారెడ్డి త్యాగం చిరస్మరణీయమని కాంటినెంటల్ ఆస్పత్రి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు.

స్పౌజ్ బదిలీలు వెంటనే అమలు చేయాలి

» తెలంగాణ సెంట్రల్ స్పౌజ్ ఫోరం డిమాండ్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భార్యాభర్తల(స్పౌజ్) బదిలీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ సెంట్రల్ స్పౌజ్ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి రాందేవ్, శైలజ, కోశాధికారి రవీందర్, ఉపాధ్యక్షులు ప్రవీణ, సంయుక్త కార్యదర్శి నారాయణలు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న భార్యాభర్తలకు బదిలీలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 85 మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బదిలీలు రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండడం వల్ల వెంటనే బదిలీలు చేపట్టి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. స్పౌజ్ బదిలీలకు సంబంధించి రేవంత్ సర్కారు తీసుకొచ్చిన జీవో 243ని అమలు చేసి భార్యాభర్తల ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే రాబోయే రోజుల్లో మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మాలలకు 10% రిజర్వేషన్ కల్పించాలి

» మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ

నల్లకుంట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో భాగంగా సీ గ్రూప్‌లో చేర్చిన మాలలను ప్రత్యేక గ్రూప్‌గా గుర్తించి 10% రిజర్వేషన్ అమలు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసం అగ్ర వర్ణాల వారికి రూ.8లక్షల పరిమితిని విధించినట్లే, మాలలకు రూ.9లక్షల ఆదాయ పరిమితిని విధించాలని సూచించారు. ఎస్సీల్లో క్రీమీలేయర్‌ను అమలు చేయాలన్న ప్రతిపాదనను వ్యతిరేకించే మాల, మాదిగలను అగ్రకులాల జాబితాలో చేర్చాలన్నారు. ఆదివారం హైదర్‌గూడలో విలేకరులతో శ్రీకృష్ణ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ ఇచ్చిన రిపోర్టు తప్పుల తడక అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాను తగ్గించి చూపించారని ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకోవడానికే ఎస్సీ వర్గీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గాల మధ్య విబేధాలు సృష్టించి మాలలను శత్రువులుగా చూసేలా పాలకులు కుట్ర చేస్తున్నారని, పంచాయతీ ఎన్నికల్లో ఓటు ఆయుధంతో మాలల సత్తా ఏంటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు.

దేశంలో రాజ్యహింస అవధులు దాటింది

రెండో రోజు విరసం సాహిత్య పాఠశాలలో ప్రొఫెసర్ హరగోపాల్



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఫాసిజం దేశంలో నలుమూలలా విస్తరించిందని, తద్వారా రాజ్యహింస అవధులు దాటిందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో రెండ్రోజులుగా కొనసాగిన విప్లవ రచయిత సంఘం (విరసం) 24వ సాహిత్య పాఠశాల కార్యక్రమాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఇటీవల దివంగతులైన కవి, విప్లవ మేధావి ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మృతిపథంలో, సాయిబాబా ప్రాంగణంగా.. 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమాల ముగింపు బహిరంగ సభలో ముఖ్యవక్తగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. రచయితల దృక్పథంలో మార్పు రావడం కాదని, ప్రవర్తనలో మార్పు రావాలని అన్నారు. భారతీయ సమాజంలో అంబేడ్కర్ తర్వాత గొప్ప మేధస్సు కలిగిన వ్యక్తిగా వరవరరావు కనపడతారని, సాహిత్యంలో ప్రధాన భూమిక పోషించి ఉంటే ఆయనకు జ్ఞానపీఠ్ పురస్కారం వచ్చేదని చెప్పారు. విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ ప్రధాన కార్యదర్శి రివేరా, సాయిబాబా సహచరి వసంతకుమారి, వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

తిరుమల కల్తీ నెయ్యి ఘటనలో.. నలుగురు కీలక నిందితుల అరెస్టు

అమరావతి/తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో నలుగురు కీలక నిందితులను ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సిట్.. ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ఉన్న బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ డైరెక్టర్లు విపిన్ జైన్(45), పోవిల్ జైన్(47).. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెనుమాకలోని వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ లిమిటెడ్ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావ్డా (47), తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న ఏఆర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ రాజు రాజశేఖరన్(69)ను అరెస్టు చేసింది. కల్తీ జరిగిన కాలంలో విపిన్ జైన్, పోవిల్ జైన్ వైష్ణవి డెయిరీ డైరెక్టర్లుగా ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. నలుగురినీ ఆదివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకుని తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులో వున్న సిట్ కార్యాలయానికి తరలించారు. రాత్రి 8.20 గంటల సమయంలో రిమాండ్ రిపోర్టు సిద్ధం చేసి వైద్య పరీక్షల నిమిత్తం నలుగురినీ భారీ భద్రత నడుమ రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం రాత్రి 9.10 గంటలకు 2వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ నివాసానికి తీసుకెళ్లారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన న్యాయాధికారి.. నలుగురికీ జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అనంతరం వారిని తిరుపతి సబ్ జైలుకు తరలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కలిపే నెయ్యిలో అపవిత్ర పదార్థాలు కలిసినట్లు రిపోర్టుల్లో వెల్లడైన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు ఏర్పాటైన సిట్.. గత నాలుగు రోజులుగా ఏఆర్, వైష్ణవి డెయిరీలకు వెళ్లి యాజమాన్యాలను ప్రశ్నించారు. ఆదివారం మధ్యాహ్నం వారిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తరలించారు. కాగా.. ఆయా డెయిరీలకు చెందిన మరో పది మంది సిబ్బంది ప్రస్తుతం సిట్ అదుపులో ఉన్నారు. వారిలో మేనేజర్ స్థాయి అధికారుల నుంచి.. ల్యాబ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్లు కూడా ఉన్నట్లు తెలిసింది. వారిని సోమ లేదా మంగళవారం అరెస్టు చూపించే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరున్నారు.. తక్కువ ధరకు నెయ్యి సరఫరాకు అంగీకరించడం వెనుక మతలబేంటి? ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాల సేకరణలో సిట్ ప్రస్తుతం నిమగ్నమైంది. అయితే, ఆయా డెయిరీలకు అవకాశమిచ్చిన లేదా తెర వెనుక ఉండి కథ నడిపించిన కీలక వ్యక్తి ఎవరన్నది తేలాల్సి ఉందని అంటున్నారు.

కాళేశ్వరాలయంలో వైభవంగా కుంభాభిషేకం

» హాజరైన మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

» తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానందతో మహా క్రతువు



ఆలయంలో కుంభాభిషేకానికి హాజరైన భక్తజనం



పూజలు చేస్తున్న సచ్చిదానంద సరస్వతి, మంత్రులు శ్రీధర్ బాబు, సురేఖ

మహదేవపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ప్రాచీన పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కనులపండువగా సాగిన ఈ వేడుక ఆదివారం ముగిసింది. చివరి రోజు మహా క్రతువును భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తుని తపోవన పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా ప్రధాన ఘట్టం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ హాజరు కాగా, వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కాళేశ్వర ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవం 43 ఏళ్ల తర్వాత నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభామేళా జరుగుతున్న తరుణంలోనే కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో ఈ మహోత్సవం 3 రోజులపాటు జరిగింది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి.. త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు.

జగన్ సహా ప్రజాప్రతినిధుల కేసుల్లో రోజువారీ విచారణ!

(మొదటి పేజీ తరువాయి)

హాజరు కాని వారి అరెస్టుకు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీచేయాలని తన తాజా అఫిడవిట్‌లో కోరారు. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేల కేసులను ప్రత్యేక కోర్టులు రోజువారీ విచారించేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు. ఆ కేసుల ట్రయల్ పూర్తయ్యేదాకా సదరు కోర్టులకు ఇతర రెగ్యులర్ కేసుల బాధ్యతలు అప్పగించకుండా చూడాలని సూచించారు. క్రిమినల్ కేసుల్లో దోషులుగా నిరూపణ అయిన ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో పోటీచేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ 2016లో దాఖలుచేసిన పిటిషన్‌పై కోర్టుకు సహాయకారి(అమికస్ క్యూరీ)గా హన్సారియాను సుప్రీంకోర్టు నియమించిన సంగతి తెలిసిందే. ఆయా కేసుల్లో పురోగతిపై ఆయన రెండ్రోజుల కింద 21వ అఫిడవిట్‌ను దాఖలుచేశారు. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈ అంశంపై విచారణ జరుపనుంది. దేశవ్యాప్తంగా ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులపై 4,732 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని హన్సారియా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో 892 కేసులు ఒక్క 2024లోనే నమోదయ్యాయని తెలిపారు. ప్రజాస్వామిక సంస్కరణల సంఘం (ఏడీఆర్) రిపోర్టును ప్రస్తావిస్తూ.. ప్రస్తుత లోక్‌సభలోని 543 మంది ఎంపీల్లో 170 మందిపై ఐదేళ్లు, అంతకుమించి శిక్షపడే అవకాశమున్న తీవ్ర నేరాభియోగాలు నమోదైనట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సహా పలువురు ప్రజాప్రతినిధులపై తెలంగాణ హైకోర్టులో 319 కేసులు పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. 2023 నవంబరు 24 నుంచి ప్రజాప్రతినిధులపై దాఖలుచేసిన కేసులకు సంబంధించి హైదరాబాద్(నాంపల్లి) సీబీఐ కోర్టులో డిశ్చార్జి పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై ఏ తీర్పూ వెలువరించలేదని సదరు హైకోర్టు గత ఏడాది జూన్ 4న పేర్కొందని హన్సారియా తెలిపారు. సుప్రీంకోర్టు విచారణ నేపథ్యంలో జగన్ సహా ప్రజాప్రతినిధుల కేసుల విచారణ ఇక వేగవంతమయ్యే అవకాశముందని న్యాయవాద వర్గాలు చెబుతున్నాయి.

సగం మందిపై క్రిమినల్ కేసులు

2024లో ఏర్పడిన ప్రస్తుత లోక్‌సభలో సగం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 251 మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉండగా, వాటిలో తీవ్ర నేరాభియోగాలు ఎదుర్కొంటున్నవారు 170 మంది ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని 80 మంది ఎంపీల్లో 40 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. వారిలో 34 మందిపై తీవ్ర అభియోగాలు ఉన్నాయి. అలాగే మహారాష్ట్రలో 24 మంది ఎంపీలపై, పశ్చిమ బెంగాల్లో 22 మంది, బిహార్‌లో 21 మంది, తమిళనాడులో 26 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

హన్సారియా అఫిడవిట్‌లోని ముఖ్యాంశాలివీ..

- తమపై కేసుల దర్యాప్తు లేదా ట్రయల్‌పై చట్టసభల సభ్యుల పలుకుబడి ప్రభావం ఉంది. ట్రయల్ పూర్తవడాన్ని అనుమతించడం లేదు. సుప్రీంకోర్టు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నా.. హైకోర్టులు పర్యవేక్షిస్తున్నా.. ఎంపీలు, ఎమ్మెల్యేలపై పెద్దసంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది దేశ ప్రజాస్వామ్యానికే మచ్చ.
- ప్రజాప్రతినిధుల కేసులను విచారించే ప్రత్యేక కోర్టులకు ఇతర రెగ్యులర్ కేసుల విచారణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. కొన్ని కేసుల్లో నిందితులు నిర్దిష్ట తేదీల్లో కోర్టులకు హాజరు కావడంలేదు. దీంతో సాక్షుల వాంగ్మూల నమోదు చేయడం లేదు.
- అలాగే నిర్ధారిత తేదీల్లో సాక్షులను కోర్టుల్లో హాజరుపరిచేందుకు ప్రాసిక్యూషన్ సమర్థ/సీరియస్ చర్యలు తీసుకోవడం లేదు.
- అరుదైన, అనివార్య కేసుల్లో తప్ప ట్రయల్ కోర్టులు ఈ కేసుల విచారణను వాయిదా వేయరాదని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా.. ప్రత్యేక కోర్టులు ఉదారంగా వాయిదాలు మంజూరు చేస్తున్నాయి.
- సుమోటో రిట్ పిటిషన్లలో వివిధ హైకోర్టులు ఉత్తర్వులు జారీచేసినా.. కేసుల ట్రయల్‌లో చెప్పుకోదగిన పురోగతి లేదు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల కేసులను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.
- చట్టసభల సభ్యుల నేరచరిత గురించి తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉందని సుప్రీంకోర్టు ఎన్నోసార్లు స్పష్టంచేసింది. ఈ వివరాలు హైకోర్టు వెబ్‌సైట్లలో అందుబాటులో లేదు. అలాగే ఈ వెబ్‌సైట్లలో ఏకరూపత లేదు. ఏ ఒక్క వెబ్‌సైట్‌లోనూ ప్రజాప్రతినిధుల కేసులను విచారించే ప్రత్యేక కోర్టుల ఆదేశాలను అప్‌లోడ్ చేయలేదు. ఈ కేసుల విచారణ పురోగతిని హైకోర్టులు నెలవారీగా సమీక్షించాలి.
- ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక కోర్టులు పూర్తిగా ఆ కేసులను మాత్రమే విచారించాలని.. వాటి ట్రయల్ పూర్తయ్యాకే ఇతర కేసులను చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలివ్వాలి. అన్ని జిల్లాల ప్రిన్సిపల్-సెషన్స్ జడ్జీలు.. ప్రజాప్రతినిధులపై కేసుల ట్రయల్ పూర్తయిన తర్వాత మాత్రమే ఆయా కోర్టులకు రెగ్యులర్ వర్క్ కేటాయించాలి.
- భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 346 (గతంలో సీఆర్‌పీసీ సెక్షన్ 309) ప్రకారం.. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న ప్రజాప్రతినిధుల కేసులపై కోర్టులు రోజువారీ విచారణ జరపాలని సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయాలి.
- కోర్టులకు వరుసగా రెండుసార్లు హాజరుకాని ప్రజాప్రతినిధుల అరెస్టుకు నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీచేయాలి.

తెలంగాణ హైకోర్టులో 313 పెండింగ్ కేసులు

తెలంగాణ హైకోర్టులో 172 మంది సిటింగ్ ప్రజాప్రతినిధులు, 26 మంది మాజీ ప్రజాప్రతినిధులపై 313 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని హన్సారియా వెల్లడించారు. ఇక్కడ ఎంపీలు, మాజీ ఎంపీలపై 121 కేసులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలపై 112 కేసులు ఉన్నాయని 2019 ఆగస్టు 25న సీబీఐ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన నివేదికలో పేర్కొందని తెలిపారు. వీటిలో 31 కేసులపై విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. కాగా, ఏపీలో 13 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. వారిలో 9 మందిపై తీవ్రమైన నేరాభియోగాలు ఉన్నాయని హన్సారియా తెలిపారు. తెలంగాణలో 17 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ సీబీఐ కోర్టులో 28 కేసులపై విచారణ జరుగుతుండగా.. వాటిలో నాలుగు కేసులపై స్టే ఉందంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన నివేదికను ఆయన ప్రస్తావించారు.

2023లో సుప్రీం కీలక ఆదేశాలు..

వాస్తవానికి ప్రజాప్రతినిధులపై పెండింగ్‌లో ఉన్న 5వేలకుపైగా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం 2023 నవంబరు 9నే కీలక ఆదేశాలు జారీచేసింది. సత్వర పరిష్కారానికి హైకోర్టులు స్వయంగా ట్రయల్‌ను పర్యవేక్షించాలని నిర్దేశించింది. అరుదైన, అనివార్యమైన సందర్భాల్లో తప్ప ప్రత్యేక కోర్టులు కేసుల విచారణను వాయిదా వేయొద్దని స్పష్టంగా ఆదేశించింది. ప్రజాప్రతినిధులపై దాఖలైన క్రిమినల్ కేసుల ట్రయల్‌కు ప్రాధాన్యమివ్వాలని హైకోర్టులు, జిల్లా జడ్జీలు, ప్రత్యేక కోర్టులకూ ఆదేశాలిచ్చింది. పెండింగ్‌లో ఉన్న 5 వేలకుపైగా కేసుల్లో 2,000 కేసులపై ప్రత్యేక కోర్టులు 2023లో నిర్ణయాలు వెలువరించి పరిష్కరించాయని హన్సారియా గత ఏడాది ఏప్రిల్ 22న సుప్రీంకోర్టుకు నివేదించారు. రెండ్రోజుల కిందట తన 21వ నివేదిక/అఫిడవిట్‌ను ఆయన సమర్పించారు.

తగ్గుతున్న డిస్కమ్‌ల నష్టాలు!

» ఆర్నెల్లలో కేవలం రూ.68.13 కోట్ల నష్టాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ డిస్కమ్‌లు క్రమంగా నష్టాలను తగ్గించుకునే దిశగా పయనం సాగిస్తున్నాయా...? అవుననే చెబుతున్నాయి గణాంకాలు. తొలి ఆర్నెల్ల డిస్కమ్‌ల లెక్కలను పరిశీలిస్తే... క్రమంగా నష్టాల ఊబి నుంచి డిస్కమ్‌లు క్రమంగా బయటపడుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు 2024-25 ఆర్థిక సంవత్సరంలో గతేడాది (2024) సెప్టెంబరుతో ముగిసిన అర్ధ వార్షికంలో నష్టాలను గణనీయంగా తగ్గించుకున్నాయి. దక్షిణ డిస్కమ్ 2024 తొలి ఆర్నెల్ల కాలానికి(ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30) రూ.21,389.64 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగా... ఖర్చులు రూ.21,590.85 కోట్లు అయ్యాయి. పన్నులు, ఇతరత్రా కలుపుకొని తొలి ఆర్నెల్లలో రూ.213.88 కోట్ల నష్టాలను చవిచూసింది. ఇక, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) తొలి ఆర్నెల్లలో రూ.9166.17 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయగా... రూ.9033.09 కోట్లు వ్యయమైంది. ఉత్తర డిస్కమ్ తొలి ఆర్నెల్లలో రూ.133.08 కోట్ల లాభాలను నమోదు చేసింది. రెండు డిస్కమ్‌లు కలిపి తొలి అర్ధవార్షికంలో రూ.30,555.81 కోట్ల ఆదాయాన్ని రికార్డు చేయగా... రూ.30,623.94 కోట్లు వ్యయం అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. దాంతో రెండు డిస్కమ్‌లు కలిపి ఆర్నెల్లలో రూ.68.13 కోట్ల నష్టాలను మాత్రమే చవిచూశాయి. కాగా, దక్షిణ డిస్కమ్ తొలి ఆర్నెల్లలో రూ.21,389.64 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయగా.. రూ.17,674.20 కోట్లను కరెంట్ కొనుగోళ్లకే వెచ్చించారు. ఉద్యోగుల జీతాలు/భత్యాల కోసం రూ.1320.59 కోట్లు వెచ్చించడం గమనార్హం. ఉత్తర డిస్కమ్ ఆర్నెల్లలో రూ.9166.17కోట్ల ఆదాయాన్ని రాబట్టుకోగా... అందులో రూ.6706కోట్లను కరెంట్ కొనుగోళ్లకు పెట్టారు. ఇక ఉద్యోగుల జీత/భత్యాల కోసం రూ.1224.69 కోట్లను వెచ్చించారు. 2023-24 (2024 మార్చి 31వ తేదీ)లెక్కలు పరిశీలిస్తే రూ.64,227కోట్ల నష్టాలను డిస్కమ్‌లు మూటగట్టుకున్నాయి.

కిలోమీటరుకు 372 కోట్లు!

రాయదుర్గం-కోకాపేట్ మార్గంలో మెట్రో నిర్మాణ అంచనా వ్యయం.. నిర్ధారించిన అధికారులు

» ఎల్‌బీనగర్-హయత్‌నగర్ రూట్‌లో కి.మీ.కు సగటున రూ.264 కోట్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండోదశ నిర్మాణంలో భాగంగా పలు కారిడార్లలో అంచనా వ్యయం భారీగా పెరిగింది. రాయదుర్గం-కోకాపేట మార్గంలో కిలోమీటరుకు సగటున రూ.372 కోట్లు వ్యయం కానున్నట్లు సమాచారం. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల ధరలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిన నేపథ్యంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు నిర్మాణ ఖర్చులను సైతం పెంచారు. కారిడార్ల నిర్మాణానికి కావాల్సిన భూములను కలుపుకొని ప్రాజెక్టు వ్యయాన్ని నిర్ధారించారు. ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)లో ఈ మేరకు పొందుపరిచారు. హైదరాబాద్ నగరంలో మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా పార్ట్-ఏ కింద నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట్ నియోపోలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్బీనగర్-హయత్‌నగర్ (7.1 కి.మీ.) మార్గాలను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అలాగే పార్ట్-బీ కింద శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఫోర్త్‌సిటీ (40 కి.మీ.), జేబీఎస్-శామీర్‌పేట్ (22 కి.మీ.), ప్యారడైజ్-మేడ్చల్ (23 కి.మీ.) మార్గాలను ప్రతిపాదించారు. పార్ట్-ఏ కింద ఉన్న 5 కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌ను గతేడాది నవంబర్ 4వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. మార్చిలో సంబంధిత అనుమతి లభించనున్నట్లు హెచ్ఏఎంఎల్ అధికారులు చెబుతున్నారు.

కి.మీ.కు రూ.317 కోట్లు



రెండో దశ ప్రాజెక్టులో ఒక కి.మీ.కు సగటున రూ.317 కోట్ల వ్యయం అవుతుందని మెట్రో అధికారులు అంచనాలు రూపొందించారు. కాగా, ఇదే సెకండ్ ఫేజ్‌లో బెంగళూరులో ఒక కి.మీ.కు సగటున రూ.533 కోట్లు, చెన్నైలో రూ.531 కోట్లతో పనులు చేస్తున్నారని, వాటితో పోల్చితే మన వద్ద నిర్మాణ వ్యయం తక్కువగా ఉందని, ఎక్కువగా భూసేకరణ లేకపోవడమే దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, రాయదుర్గం-కోకాపేట్ ప్రాంతాల్లోనే భూసేకరణకు అధికంగా వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. కాగా, మెట్రో రెండోదశలో రాయదుర్గం-కోకాపేట్ మార్గంలోనే అత్యధిక వ్యయం అవసరమవుతోంది. 11.6 కి.మీ.ల ఆ కారిడార్‌కు రూ.4,318 కోట్ల అంచనా వ్యయాన్ని రూపొందించారు. దీంట్లో దాదాపు రూ.1200 కోట్ల వరకు భూసేకరణకే ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇక్కడ ఒక కి.మీ.కు రూ.372కోట్ల చొప్పున లెక్కించి డీపీఆర్‌ను రూపొందించారు. రెండో దశలో అతిపెద్ద కారిడార్ అయిన 36.8 కి.మీ.ల నాగోల్-శంషాబాద్ మార్గంలో కి.మీ.కు రూ.305కోట్ల వ్యయాన్ని నిర్ధారించారు. ఈ రూట్‌లో భూసేకరణ సమస్యలు లేకపోవడంతో నిర్మాణ వ్యయం తగ్గింది. అలాగే ఎల్‌బీనగర్-హయత్‌నగర్ మార్గంలో 7.1కి.మీ. మెట్రోకు సగటున కి.మీ.కు రూ.264 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఆ మార్గంలో ఇప్పటికే జాతీయ రహదారి ఉండడంతో భూసేకరణ సమస్యల్లేవు. దీంతో నిర్మాణవ్యయం తక్కువగా ఉంది.

పాతబస్తీలో చురుగ్గా పనులు

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ.ల మార్గంలో ప్రతిపాదించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రూట్‌లో ఆస్తుల సేకరణను అధికారులు వడివడిగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు 360 మందికి రూ.120 కోట్ల నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి పరిహారం పొందిన నిర్వాసితుల ఇళ్లు, కమర్షియల్ భవనాలను తొలగిస్తున్నారు. ఈ నెల చివరివారంలోగా చెక్కుల పంపిణీని పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

కోడలికి 'గిఫ్ట్' ఇవ్వడం కుదరదు!

» ధరణి గిఫ్ట్ డీడ్లలో లోపాయికారి ఒప్పందాలు

» రుసుం తగ్గించేలా సిబ్బంది చేతి వాటం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌ని అడ్డుపెట్టుకుని జరుగుతున్న మోసాలు అన్ని ఇన్ని కావు..! నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకుని పలుచోట్ల ధరణి ఆపరేటర్ల ద్వారా తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. గిఫ్ట్ డీడ్ విషయంలోనూ చేతివాటం చూపి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. భారత స్టాంపుల చట్టంలో ఆర్టికల్ 49 ప్రకారం కుటుంబం అంటే ఎవరు అనే దానిపై స్పష్టత ఇచ్చారు. తండ్రి, తల్లి, భర్త, భార్య, సోదరుడు, సోదరి, కుమారుడు, కుమార్తె, తాత, అమ్మమ్మ, నానమ్మ, మనవడు, మనవరాలు, పెంపుడు తండ్రి, పెంపుడు తల్లి, దత్త పుత్రుడు, దత్త కుమార్తె.. వీరు మాత్రమే వారసులుగా, కుటుంబం కింద పరిగణించాలని చట్టంలో ఉంది. వీరికి మాత్రమే గిఫ్ట్ డీడ్, గిఫ్ట్‌సెటిల్‌మెంట్ డీడ్ చేయాల్సి ఉంటుంది. అయితే ఇందులో కోడలును ఈ జాబితాలో వారసురాలిగా పరిగణించడానికి అవకాశం లేదు. ఒకవేళ అలా చేయాలి అనుకుంటే ధరణి పోర్టల్‌లో 'ఇన్ ఫేవర్ ఆఫ్ అదర్స్' అనే కాలమ్‌లో మాత్రమే నమోదు చేయాలి. గిఫ్ట్ డీడ్‌కు, కుటుంబ సభ్యుల పేరుతో చేసే గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్‌కు, ఇతరుల పేరుతో చేసే గిఫ్ట్ డీడ్‌లకు చలానాలో వ్యత్యాసాలున్నాయి. ఇందులో ఇతరుల పేరుతో జరిగే గిఫ్ట్ డీడ్‌లకు మార్కెట్ విలువ మీద 7%, అదే కుటుంబ సభ్యుల పేరుతో అయితే 3% చలానా మాత్రమే చెల్లించాల్సి ఉంది. ఇతరుల పేరు మీద గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు 4%, అదే కుటుంబసభ్యుల పేరుతో అయితే 3% చెల్లించాలి. అయితే రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సరైన ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకుని స్లాట్ బుక్ చేశారా లేదా అనే విషయాన్ని అధికారులు గుర్తించకపోయినా, ఐచ్ఛికాలు మార్చి రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి లబ్ధి చేకూర్చాలనే ప్రయత్నాలు చేసినా ఖజానాకు గండి కొట్టినట్లే అవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా సగటున గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు రోజుకు 150కిపైగా జరుగుతున్నాయి. అయితే 7 శాతం చలానాను తప్పించేందుకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్లలో క్షేత్రస్థాయిలో రిజిస్ట్రార్లు అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. వీటిపై ఆడిటింగ్ జరిగితే అధికారులు దొరికిపోయే అవకాశం ఉంటుంది. అయినా అటువంటి చర్యలు తీసుకోవట్లేదు.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.